# నినాదం

నిఖార్సైన జర్నలిజం

సంపుటి : 22 సంచిక : 154 పేజీలు : 8 వెల : 5- బుధవారం 25 ఫిబ్రవరి 2026

Circulated by Vijayawada, AlluriSeetharamaraju, Vizianagaram,Parvathipuram, Srikakulam, Kakinada,East Godavari,Konaseema, West Godavari, Krishna,Guntur, Bapatla,NTR,Anantapuram, Satyasai Kurnool,Nandyala, Chittoor,Tirupati,Annamayya, Telangana State


## కల్తీ నెయ్యి వ్యవహారం.. దోషులు ఎవరైనా శిక్ష పడాల్సిందే: పవన్



**అమరావతి :**

కల్తీ నెయ్యి వ్యవహారంలో దోషులు ఎవరైనా సరే శిక్ష పడాల్సిందేనని డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ అన్నారు. తిరుమల లడ్డూ కల్తీ వ్యవహారంపై శాసనసభలో జరిగిన లఘు చర్చలో ఆయన మాట్లాడారు. "కల్తీనెయ్యిలో ఏ రసాయనాలు వాడారో ఆ పెరుమాళ్లకే తెలియాలి. జంతు సంబంధ రసాయనాలు ఉన్నాయని ఎన్‌డీడీబీ రిపోర్టు చెప్పింది. అది నెయ్యే కాదని సీబీఐ రిపోర్టు ఇచ్చింది. ఇది ధర్మానికి సంబంధించిన విషయం. సకల మతాలను గౌరవించడం ఈ దేశ సంస్కృతి. తితిదే పాత బోర్డును జగన్ ఎందుకు వెనకేసుకొస్తున్నారు? అంటే ఆయనకూ భాగం ఉన్నట్టే కదా?" అని పవన్ అన్నారు.

# కల్తీ నెయ్యితో 20 కోట్ల లడ్డూలు తయారు చేశారు

## సీఎం చంద్రబాబు

**అమరావతి**

**వైకాపా హయాంలో 20 కోట్ల లడ్డూలను కల్తీ నెయ్యితో తయారు చేశారని ఏపీ సీఎం చంద్రబాబు అన్నారు. అధికారులు, నిపుణులు అందరూ కలిసి కుట్రలు చేశారని ఆక్షేపించారు. తిరుమల లడ్డూ వ్యవహారంపై శాసనసభలో నిర్వహించిన లఘు చర్చలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా 'మహాపాపం' పేరిట వైకాపా హయాంలో లడ్డూ కల్తీ జరిగిన తీరును పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా ఆయన వివరించారు.**

"రాజకీయ వివాదం ఉండకూడదని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ అధికారులతో సిట్ ఏర్పాటు చేశారు. సీబీఐ ఆధ్వర్యంలో విచారణకు సిట్ ఏర్పాటు చేయాలని సుప్రీంకోర్టు సూచించింది. తప్పు చేసిన అధికారులపై చర్యలు తీసుకోవాలని సీబీఐ రిపోర్టు పంపించింది. అందుకే ఏకసభ్య కమిటీ వేయాలని నిర్ణయించాం. లడ్డూ వ్యవహారంలో కాకుండా అనేక విషయాల్లో తప్పులు చేశారు. 2019-24 మధ్య 59.71లక్షల లీటర్ల కల్తీ నెయ్యి వినియోగించారు. రూ.231.51 కోట్ల అక్రమాలు జరిగాయి. ఫుడ్ సేఫ్టీ నిబంధనలను నీరుగార్చారు. ఒక పద్ధతి ప్రకారం లాలూచీ పడిన లూటీ అని స్పష్టంగా తేలింది. కల్తీ నెయ్యి అని నిర్ధారణ అయినా రిపోర్టును తొక్కిపెట్టారు. లడ్డూలో జంతుకొవ్వు కలిసిందని నేను సొంతంగా ఏమీ చెప్పలేదు. ఎన్‌డీడీబీ ఇచ్చిన రిపోర్టునే చెప్పా. ఆ భగవంతుడే నాతో చెప్పించాడు" అని చంద్రబాబు అన్నారు.

### అవన్నీ ఈవో, ఛైర్మన్‌కు తెలియకుండా జరుగుతాయా?

"వారికి అనుగుణంగా నిబంధనలన్నీ సడలించారు. రోజుకు 4 లక్షల లీటర్ల పాలు కొనుగోలు చేయాలన్న నిబంధన తొలగించారు. నెయ్యి ఉత్పత్తిలో అనుభవాన్ని మూడేళ్ల నుంచి ఏడాదికి కుదించారు. రోజుకు 12 టన్నులుగా ఉండాల్సిన వెన్న తయారీ ఎనిమిది టన్నులకు తగ్గించారు. డెయిరీల వార్షిక టర్నోవర్ రూ.250 కోట్ల నుంచి రూ.150 కోట్లకు పరిమితం చేశారు. సాంకేతిక అధ్యయనం, ఫీల్డ్ విజిట్లకు పూర్తిగా మినహాయింపు ఇచ్చారు. ఫుడ్ సేఫ్టీ నిబంధనలను నీరుగార్చారు. పోమిల్ జైన్, విపిన్ జైన్, భోలేబాబా ఆర్గానిక్ డెయిరీ ప్రధాన సూత్రధారులు. నెయ్యి సరఫరా చేసిన షెల్ కంపెనీలు ఏఆర్ డెయిరీ ఫుడ్స్,



శ్రీవైష్ణవి డెయిరీ, మాల్ గంగా మిల్క్ డెయిరీ. భోలే బాబా డెయిరీకి షెల్ కంపెనీలు సహకరించాయి. లంచం డబ్బుతో చిన్నప్పన్న దొరికిపోయారు. కల్తీ నెయ్యి సరఫరాదారులకు చిన్నప్పన్న సహకారం అందించారు. తప్పుడు రిటర్నులతో బురిడీ కొట్టించారు. ల్యాబ్ నివేదిక ఫోర్జరీ చేశారు. ఇన్ని జరిగితే తితిదే బోర్డు ఈవో, ఛైర్మన్‌కు తెలియకుండా జరుగుతాయా? ప్రసాదం తీసుకున్న ప్రతి ఒక్కరూ నాణ్యత తగ్గిందని చెప్పారు" అని సీఎం తెలిపారు.

# ఏపీ క్యాబినెట్ కీలక భేటీ..

## 55 అజెండా అంశాలపై చర్చ!



**అమరావతి ) :**

**ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన రాష్ట్ర మంత్రివర్గం సచివాలయంలో సమావేశమైంది. దాదాపు 55 అజెండా అంశాలపై చర్చించి ఆమోదం తెలపనుంది. తొలుత 36 అజెండా అంశాలే అనుకున్నప్పటికీ.. అజెండాలో 55 అంశాలను చేరుస్తూ క్యాబినెట్ సుదీర్ఘంగా చర్చించనుంది. ఇటీవల పెట్టుబడుల ప్రోత్సాహక మండలిలో తీసుకున్న నిర్ణయాలకు ఆమోదం తెలపనున్నట్లు సమాచారం.**

అలాగే, విశాఖ, తిరుపతి, కాకినాడ, రాజమండ్రి, చీరాల, సత్యసాయి జిల్లాల్లోని పలు పర్యాటక ప్రాజెక్టులకు, మరీ ముఖ్యంగా ఆతిథ్య రంగంలో పలు ప్రాజెక్టులకు ఆమోదం తెలపనున్నట్లు తెలుస్తోంది. అలాగే, పునరుత్పాదక ఇంధన రంగంలో కొత్త ప్రాజెక్టులు, నెల్లూరు జిల్లాలో మహిళల కోసం కొత్తగా ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటుకు ప్రభుత్వం ఆమోదం తెలిపే అవకాశం ఉంది. ఉన్నత విద్య, నైపుణ్యాభివృద్ధి శాఖల పునర్వ్యవస్థీకరణకు సంబంధించి పలు కీలక నిర్ణయాలు తీసుకొనే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. విశాఖలో సెమీ కండెక్టర్ పరిశ్రమ ఏర్పాటు, వివిధ సంస్థలకు భూకేటాయింపుల అంశాల పైనా చర్చించి నిర్ణయం తీసుకొనే అవకాశం ఉంది. రాష్ట్రంలో కొత్తగా పాలనాపరమైన సౌలభ్యం కోసం సైన్స్ అండ్ టెక్నాలజీ, ఇన్నోవేషన్ పేరుతో నూతన మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయడంతో పాటు పలు కీలక నిర్ణయాలు తీసుకొనే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

## హెరిటేజ్ ఎప్పుడూ తప్పుడు పనులు చేయదు: సీఎం చంద్రబాబు

**అమరావతి**

**కల్తీ నెయ్యి వ్యవహారాన్ని హెరిటేజ్ సంస్థతో ముడిపెట్టేందుకు కొందరు ప్రయత్నిస్తుండటంపై సీఎం చంద్రబాబు స్పందించారు. హెరిటేజ్ ఎప్పుడూ తప్పుడు పనులు చేయదని స్పష్టం చేశారు. ఈ మేరకు హెరిటేజ్ అంశంపై అసెంబ్లీలో సీఎం మాట్లాడారు. "హెరిటేజ్ సంస్థ మా కుటుంబ వ్యాపార సంస్థ. ప్రభుత్వ సంస్థలకు ఎక్కడా మా ఉత్పత్తులు సరఫరా కాలేదు. హెరిటేజ్ నుంచి కిలో నెయ్యి కూడా ప్రభుత్వ శాఖలు కొనలేదు. ఆ పత్రికలో మాత్రం హెరిటేజ్‌కు వ్యతిరేకంగా కథనాలు రాశారు. ప్రభుత్వ సహకారం లేకుండా ఆ సంస్థ నిజాయతీగా వ్యాపారం చేస్తోంది" అన్నారు.**



"గత ప్రభుత్వ హయాంలో ప్రభుత్వ పథకాలు, ప్రాజెక్టుల్లో భారతి సిమెంట్స్ వాడారు. నేరస్థులు ఏ విధంగా ప్రభుత్వంలో వ్యవహరిస్తారో అనేందుకు ఇదే ఉదాహరణ. నెయ్యి వ్యవహారాన్ని హెరిటేజ్ డెయిరీకి ముడిపెట్టేందుకు యత్నించారు. హెరిటేజ్ నిత్యం 20 లక్షల లీటర్ల పాలు సేకరిస్తోంది. నెయ్యి విషయంలో ఇందాపూర్ డెయిరీకి, హెరిటేజ్‌కు సంబంధంలేదు. పుణెలోని ఇందాపూర్ డెయిరీ అనేక కంపెనీలతో కో మ్యానుఫేక్చరింగ్ చేస్తుంది. హెరిటేజ్ ఎప్పుడూ తప్పుడు పనులు చేయదు" అని సీఎం పునరుద్ఘాటించారు.

# పోలీసుల ఎదుట లొంగిపోయిన మావోయిస్టు అగ్రనేత దేవ్‌జీ

**హైదరాబాద్:**

**మావోయిస్టు కేంద్ర కమిటీ అప్రకటిత కార్యదర్శి తిప్పిరి తిరుపతి ఎలియాస్ దేవ్‌జీ మంగళవారం తెలంగాణ డీజీపీ శివధర్‌రెడ్డి ఎదుట లొంగిపోయారు. ఆయనతో పాటు బడే చొక్కారావు, మల్లా రాజిరెడ్డి, నూనె నర్సింహారెడ్డి కూడా లొంగిపోయారు. ఈ మేరకు డీజీపీ శివధర్‌రెడ్డి విలేకరుల సమావేశంలో వివరాలను ప్రకటించారు.**



ఈ సందర్భంగా డీజీపీ మాట్లాడుతూ.. "గత రెండేళ్లలో నలుగురు సీసీఎంలు, 16మంది ఎస్‌ఈఎంలు, 26మంది డివిజన్ కమిటీ సభ్యులు, సెక్రటరీలు.. 85 మంది ఏసీఎస్‌లు, 60 మంది పార్టీ సభ్యులు సహా మొత్తం 591 మంది జన జీవన స్రవంతిలోకి వచ్చారు. తెలంగాణలో పుట్టి, పెరిగిన 11 మంది ఇంకా అజ్ఞాతంలో ఉన్నారు. వాళ్లలో కొంతమంది మాతో చర్చలు జరుపుతున్నారు. త్వరలోనే వారు కూడా బయటకు వస్తారు. పోలీసుల అమరవీరుల సంస్మరణ సందర్భంగా తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన పిలుపు మేరకు ఎంతో మంది మావోయిస్టులు అజ్ఞాతాన్ని వీడి జన జీవన స్రవంతిలోకి వస్తున్నారు. అలా వచ్చిన వారికి రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన రివార్డులు, పునరావాస ప్రయోజనాలు వెంటనే అందిస్తాం"

"మావోయిస్టుల లొంగుబాటులో కీలకంగా వ్యవహరించిన స్పెషల్ ఇంటెలిజెన్స్ ఐజీ సుమతి, ఆమె టీమ్‌నకు నా అభినందనలు. ఐడీజీ ఇంటెలిజెన్స్ విజయ్‌కుమార్‌ను కూడా అభినందిస్తున్నా" అని తెలిపారు. ఈ సందర్భంగా దేవ్‌జీ, బడే చొక్కారావు, మల్లా రాజిరెడ్డి, నూనె నర్సింహారెడ్డిల స్వస్థలం, విద్యాభ్యాసం, మావోయిస్టులుగా వారి ప్రయాణాన్ని డీజీపీ వివరించారు. జన జీవన స్రవంతిలోకి వచ్చిన మావోయిస్టుల హక్కుల కాపాడేందుకు ప్రయత్నిస్తామని అవసరమైతే వారి ప్రాణాలకు తమ ప్రాణాలు అడ్డు వేస్తామని డీజీపీ పునరుద్ఘాటించారు.

### లొంగిపోయిన మావోయిస్టులకు పునరావాస ప్రయోజనాలివే!

తెలంగాణ ప్రభుత్వ పునరావాస పథకం ప్రకారం...

తిపిరి తిరుపతి ఎలియాస్ దేవ్‌జీ: సెంట్రల్ కమిటీ సభ్యుడు (జజవీ) పొలిట్‌బ్యూరో సభ్యుడు (గ్రాదీవీ)పై రూ. 25,00,000/- (ఇరవై ఐదు లక్షలు) నగదు బహుమతి.

మల్ల రాజి రెడ్డి ఎలియాస్ సంగ్రామ్: సెంట్రల్ కమిటీ సభ్యుడు (జజవీ)పై రూ.25,00,000/- (ఇరవై ఐదు లక్షలు) నగదు బహుమతి.

బడే చొక్కా రావు ఎలియాస్ దామోదర్: స్టేట్ కమిటీ సభ్యుడు (రాజవీ)పై రూ.20,00,000/- (ఇరవై లక్షలు) నగదు బహుమతి.

నూనె నర్సింహ రెడ్డి ఎలియాస్ గంగన్న: స్టేట్ కమిటీ సభ్యుడు (రాజవీ)పై రూ.20,00,000/- (ఇరవై లక్షలు) నగదు బహుమతి.

రాష్ట్ర మరియు కేంద్ర ప్రభుత్వాల పునరావాస పథకం ప్రకారం, వీరికి లభించే మొత్తం రూ. 90,00,000/- (తొంబై లక్షలు) నగదు బహుమతిని డిమాండ్ డ్రాఫ్టు/చెక్కుల రూపంలో చెల్లించనున్నారు. అలాగే తెలంగాణ రాష్ట్ర పోలీసు శాఖ, తెలంగాణ ప్రభుత్వ పునరావాస పథకం ప్రకారం వీరికి లభించాల్సిన అన్ని ప్రయోజనాలను తక్షణమే అందిస్తారు.

## ఫేస్‌బుక్ పోస్టులు.. అనంతపురంలో కానిస్టేబుల్ భార్య ఆత్మహత్య



**అనంతపురం :**

అనంతపురంలో విషాదం చోటుచేసుకుంది. ఫేస్‌బుక్ పోస్టులతో మనస్తాపానికి గురైన ఓ మహిళ ఆత్మహత్యకు పాల్పడింది. కానిస్టేబుల్ భార్య ఫేస్‌బుక్ లోఇటీవల కొన్ని పోస్టులు చేశారు. ఆమె పోస్టుల కింద మరో కానిస్టేబుల్ గురుమోహన్‌రెడ్డి అసభ్య మెసేజ్‌లు పెట్టాడు. వీటిని భర్త చూడడంతో దంపతుల మధ్య రెండు రోజుల క్రితం గొడవ జరిగింది. గురుమోహన్‌రెడ్డిపై పీఎస్‌లో భార్యతో కానిస్టేబుల్ ఫిర్యాదు చేయించారు. ఈ క్రమంలోనే ఆమె ఇంట్లో ఉరివేసుకొని బలవన్మరణానికి పాల్పడింది.

## నెయ్యి సేకరణ.. కఠిన నిబంధనలను మార్చిందెవరు?: ధూళిపాళ్ల

**అమరావతి:**

వైకాపా హయాంలో ఆ పార్టీ నేతలు అధికారాన్ని అడ్డుపెట్టుకుని సొంత కంపెనీలకు దోచిపెట్టారని తెదేపా ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర విమర్శించారు. తిరుమల నెయ్యి సేకరణకు సంబంధించిన కఠిన నిబంధనలను మార్చిందెవరని ఆయన ప్రశ్నించారు. రోజుకు 4లక్షల లీటర్ల సామర్థ్యం నిబంధనను తీసేశారని.. రూ.250 కోట్ల టర్నోవర్‌ను రూ.150 కోట్లకు తీసుకొచ్చారని చెప్పారు. డెయిరీ అనుభవాన్ని మూడేళ్ల నుంచి ఏడాదికి తీసుకొచ్చారన్నారు. తిరుమల లడ్డూ కల్తీ వ్యవహారంపై శాసనసభలో నిర్వహించిన లఘు చర్చలో ధూళిపాళ్ల మాట్లాడారు. "నిబంధనలు సడలింపు చేయడంతో తమకు కావాల్సిన ప్రైవేటు వ్యాపారులకు టెండర్లు ఇచ్చేందుకు పునాది పడింది. ఒక మహాపాపం, దోపిడీకి ఆనాడే తెరలేపారు. కల్తీ నెయ్యిని ఏటా సరఫరా చేశారు. నాటి ప్రభుత్వ పెద్దల భాగస్వామ్యం లేకపోతే తిరుమలలో ఐదేళ్లపాటు కల్తీ నెయ్యి సరఫరా సాగుతుందా? వైవీ సుబ్బారెడ్డి ఛైర్మన్‌గా ఉన్నా ఎందుకు చర్యలు తీసుకోలేదు?" అని ఆయన ప్రశ్నించారు.

## మహిళలు, చిన్నారుల భద్రతకు కూటమి ప్రభుత్వం అధిక ప్రాధాన్యం: మంత్రి అనిత



**అమరావతి**

మహిళలు, చిన్నారుల భద్రతకు కూటమి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని ఏపీ హోంమంత్రి అనిత ప్రకటించారు. ఎవరైనా ఆడపిల్లల జోలికొస్తే అదే వారికి చివరి రోజు అనే సందేశం ప్రజల్లోకి పంపామని గుర్తుచేశారు. గత రెండేళ్లుగా రాష్ట్రంలో నేరాలు పెరిగాయన్న వైకాపా ఎమ్మెల్సీ వరుదు కల్యాణి ఆరోపణలను.. శాసనమండలిలో మంత్రి అనిత తిప్పికొట్టారు. గంజాయి సాగును పూర్తిగా అరికట్టామని, డ్రగ్స్ నియంత్రణకు పటిష్ట చర్యలు చేపట్టామని అనిత తెలిపారు.

నినాదం
నిఖార్సైన జర్నలిజం

ఫిబ్రవరి 25 బుధవారం
2026



# రూ.8లక్షలు అప్పు చేసి మరీ
# ఎయిర్ అంబులెన్స్ బుకింగ్..!

దిల్లీ : కాలిన గాయాలతో విషమ పరిస్థితుల్లో ఉన్న రోగిని చికిత్స కోసం దిల్లీకి తరలించేందుకు రాంచీ నుంచి బయల్దేరిన ఎయిర్ అంబులెన్స్ సోమవారం రాత్రి కుప్పకూలిన విషయం తెలిసిందే. ఈ ఘటనపై దర్యాప్తు కొనసాగుతోంది. ఈ ప్రమాదానికి సంబంధించి మరికొన్ని విషయాలు బయటికొచ్చాయి. హోటల్లో జరిగిన అగ్ని ప్రమాదంలో గాయపడిన సంజయ్‌కుమార్‌ను ఎలాగైనా కాపాడుకోవాలనే ఆలోచనతో.. అతడి కుటుంబం రూ.8 లక్షలు అప్పు చేసి మరీ ఈ ఎయిర్ అంబులెన్స్ బుక్ చేసినట్లు తెలుస్తోంది.



దర్యాప్తు అధికారులు వెల్లడించిన వివరాల ప్రకారం.. ఝార్ఖండ్ రాజధాని రాంచీలోని చాంద్వా ప్రాంతానికి చెందిన సంజయ్‌కుమార్ (41) స్థానికంగా హోటల్ నిర్వహిస్తున్నాడు. సోమవారం హోటల్లో షార్ట్ సర్క్యూట్ కావడంతో అతడు తీవ్రంగా గాయపడ్డాడు. బాధితుడిని వెంటనే ఆసుపత్రికి తరలించారు. అప్పటికే అతడి శరీరం 65శాతం కాలిపోవడంతో మెరుగైన చికిత్స కోసం దిల్లీ ఆసుపత్రికి తీసుకెళ్లాలని స్థానిక వైద్యులు సూచించారు. వీలైనంత త్వరగా బాధితుడిని తరలించడం కోసం అతడి కుటుంబం రూ.8 లక్షలు అప్పు చేసి.. రెడ్‌బర్డ్ ఎయిర్‌వేస్ ప్రైవేట్ లిమిటెడ్‌కు చెందిన బీచ్‌క్రాఫ్ట్ సీ90 ఎయిర్ అంబులెన్స్‌ను బుక్ చేసింది.

సంజయ్‌తో పాటు అతడి భార్య అర్చన, మరో కుటుంబసభ్యుడు, ఒక వైద్యుడు, ఒక పారామెడికల్ ఉద్యోగి, ఇద్దరు పైలట్లు ఎయిర్ అంబులెన్స్‌లో వెళ్లారు. సోమవారం రాత్రి జరిగిన ప్రమాదంలో వీరంతా మృతి చెందారు. రాంచీ నుంచి బయల్దేరిన కొంత సమయం తర్వాత ప్రతికూల వాతావరణ పరిస్థితుల వల్ల పైలట్లు ఎయిర్ అంబులెన్స్‌ను కోల్‌కతాకు మళ్లించాలనుకున్నట్లు డీజీసీఏ పేర్కొంది. రాత్రి 7.34 గంటల సమయంలో ఏటీసీతో సంబంధాలు కోల్పోయిన కాసేపటికే ఈ ఎయిర్ అంబులెన్స్ కుప్పకూలిందని తెలిపింది.

# ఇండో పసిఫిక్‌లో మన పాత్ర కీలకం

**తూర్పు నౌకాదళ ప్రధానాధికారి వైస్ అడ్మిరల్ సంజయ్‌భల్లా**



**'డిఫెన్స్ ప్రొడక్షన్ పవరింగ్ ఇండస్ట్రియల్ గ్రోత్' నివేదికను విడుదల చేస్తున్న తూర్పు నౌకాదళ ప్రధానాధికారి (ఎఫ్ఓసీ-ఇన్-సీ ఈస్ట్) వైస్ అడ్మిరల్ సంజయ్‌భల్లా. చిత్రంలో రాజీవ్‌సింగ్, కమోడోర్ పి.ఆర్.హరి, జి.సతీష్‌రెడ్డి, కమాండర్ గౌతమ్‌నందా**

**విశాఖపట్నం**

దేశ భద్రతను సుస్థిరం చేసేందుకు ఇండో పసిఫిక్ ప్రాంతంలో మన శక్తి సామర్థ్యాల ప్రదర్శన ఎంతో ముఖ్యమని తూర్పు నౌకాదళ ప్రధానాధికారి (ఎఫ్ఓసీ-ఇన్-సీ ఈస్ట్) వైస్ అడ్మిరల్ సంజయ్‌భల్లా అన్నారు. సోమవారం విశాఖపట్నంలో ఇండియన్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ (ఐసీసీ) ఆధ్వర్యంలో నిర్వహించిన 'డిఫెన్స్ స్టార్టప్ అండ్ అటానమస్ సిస్టమ్స్ సమిట్'కు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. 'స్వదేశీ ఉత్పత్తుల తయారీ.. రక్షణ రంగం ఆధునికీకరణకే కాకుండా దేశ వ్యూహాత్మక స్వయం ప్రతిపత్తికి సైతం బాటలు వేస్తోంది. సాయుధ దళాలకు అవసరమైన సాంకేతికతను దేశీయంగా తయారు చేసుకోవడానికి ఇది సరైన సమయం. ఈ సదస్సు ద్వారా మంచి ఫలితాలు వస్తాయని ఆశిస్తున్నా. నౌకాదళం అభివృద్ధిలో ఎంఎస్ఎంఈలు కీలకంగా మారాయి. ప్రస్తుతం మనం వినియోగిస్తున్న చాలా నౌకలు, ఇతర వ్యవస్థల రూపకల్పనలో ఎంఎస్ఎంఈలు పాలుపంచుకున్నాయి' అని వివరించారు. ఏరోనాటికల్ సొసైటీ ఆఫ్ ఇండియా ప్రెసిడెంట్, ఏపీ ప్రభుత్వ సలహాదారు, జాతీయ భద్రతా మండలి సభ్యుడు డాక్టర్ జి.సతీష్‌రెడ్డి మాట్లాడుతూ.. దేశ రక్షణ రంగ ఉత్పాదక సామర్థ్యాన్ని పెంపొందించడంలో ఏపీ ప్రభుత్వం నైపుణ్యతను వివరించారు. స్టార్టప్‌లు, ఎంఎస్ఎంఈలు వినూత్న ఆలోచనలతో ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఐసీసీ డైరెక్టర్ జనరల్ రాజీవ్‌సింగ్ మాట్లాడుతూ.. 'ఆత్మనిర్భర్ భారత్' ద్వారా రక్షణ ఉత్పత్తుల తయారీ రంగంలో దేశీయ సామర్థ్యాన్ని పెంచడానికి ప్రభుత్వం చేస్తున్న కృషిని అభినందించారు. అనంతరం 'డిఫెన్స్ ప్రొడక్షన్ పవరింగ్ ఇండస్ట్రియల్ గ్రోత్' పేరుతో రూపొందించిన నాలెడ్జ్ రిపోర్టును అతిథులు ఆవిష్కరించారు. కార్యక్రమంలో గార్డెన్ రీచ్ షిప్‌బిల్డర్స్ అండ్ ఇంజినీర్స్ లిమిటెడ్ (జీఆర్ఎస్ఈ) సీఎండీ, రక్షణ, ఏరోస్పేస్ అండ్ స్పేస్ ఐసీసీ నేషనల్ ఎక్స్‌పర్ట్ కమిటీ విశ్రాంత ఛైర్మన్ కమోడోర్ పి.ఆర్.హరి, రక్షణ, ఏరోస్పేస్ విభాగం ఐసీసీ జాతీయ కమిటీ కో-ఛైర్మన్ కమాండర్ గౌతమ్‌నందా తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్రపతి భవన్‌లో రాజగోపాలాచారి విగ్రహం

**ఆవిష్కరించిన రాష్ట్రపతి ముర్ము**

దిల్లీ: స్వతంత్ర భారతదేశపు తొలి, ఏకైక భారతీయ గవర్నర్ జనరల్ చక్రవర్తి రాజగోపాలాచారి విగ్రహాన్ని దిల్లీలోని రాష్ట్రపతి భవన్‌లో రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము సోమవారం ఆవిష్కరించారు. అశోక మండపం సమీపంలోని గ్రాండ్ ఓపెన్ మెట్ల వద్ద ఉన్న బ్రిటిష్ ఆర్కిటెక్ట్ ఎడ్విన్ లుట్యెన్స్ విగ్రహాన్ని తొలగించి, ఆ స్థానంలో దీన్ని ఏర్పాటు చేశారు. వలసవాద స్మృతులను తొలగించి, భారతీయ సంస్కృతి, వారసత్వం, సంప్రదాయాలకు పట్టం కట్టే దిశగా ఈ చర్య తీసుకున్నట్లు రాష్ట్రపతి కార్యాలయం



ఎక్స్‌లో పేర్కొంది.

ఈ కార్యక్రమానికి ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్, రాజగోపాలాచారి కుటుంబసభ్యులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీ హర్షం వ్యక్తం చేస్తూ తన సందేశాన్ని పంపించారు. "మహాత్మా గాంధీ, రాజాజీ(రాజగోపాలాచారి) మధ్య పరస్పర విశ్వాసంతో కూడిన అనుబంధం ఉండేదన్న విషయం అందరికీ తెలుసు. ఇప్పుడు బాపూజీ విగ్రహం ఎదురుగానే రాజాజీ ప్రతిమను ఏర్పాటు చేయడం సముచితం" అని మోదీ తన సందేశంలో పేర్కొన్నారు.

## అమెరికాలో తీవ్ర హిమపాతం..
# మూడు రోజుల్లో 10 వేల విమాన సర్వీసులు రద్దు



అమెరికా : అమెరికాలో మంచు తుపాను తీవ్ర రూపం దాల్చింది. ఈశాన్య ప్రాంతాల్లో భారీగా మంచు కురుస్తోంది. దీంతో లక్షలాది మంది ప్రజలు ఇళ్లకే పరిమితమయ్యారు. మంచు తుపాను, బలమైన ఈదురు గాలుల కారణంగా రవాణా వ్యవస్థలు స్తంభించాయి. వేలాది విమాన సర్వీసులు రద్దయ్యాయి. తుపాన తీవ్రత దృష్ట్యా విమాన సర్వీసులను రద్దు చేస్తున్నట్లు విమానయాన సంస్థలు ముందుగానే ప్రకటించాయి. శనివారం నుంచి మంగళవారం మధ్య 10,000 కంటే ఎక్కువ విమాన సర్వీసులు రద్దయినట్లు విమానాల ట్రాకింగ్ సర్వీస్ 'ఫ్లైట్‌అవేర్' పేర్కొంది. ఇందులో సోమవారమే 5వేల కంటే ఎక్కువ రద్దయ్యాయని తెలిపింది. న్యూయార్క్‌లోని జేఎఫ్‌కే, లగ్వార్డియా విమానాశ్రయాలు, బోస్టన్ లోగన్, నెవార్క్ లిబర్టీ నుంచి రాకపోకలు సాగించాల్సినవే ఎక్కువగా ఉన్నట్లు వెల్లడించింది.

పలు రాష్ట్రాల్లో రైలు, బస్ సేవలు కూడా నిలిచిపోయాయి. న్యూయార్క్ నగరంలోని సెంట్రల్ పార్కులో 15 అంగుళాల కంటే ఎక్కువ మంచు కురిసింది. మరికొన్ని ప్రాంతాల్లో రెండు అడుగులకుపైనే మంచు పేరుకుపోయింది. ఈ భారీ హిమపాతం కారణంగా పలుచోట్ల విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడింది. దీంతో లక్షలాది ఇళ్లు, వ్యాపార సముదాయాలు అంధకారంలో చిక్కుకుపోయాయి. విద్యుత్ సేవలను పునరుద్ధరించేందుకు సిబ్బంది ప్రయత్నిస్తున్నారని అధికారులు తెలిపారు.

# నేను ఎంతకాలం ఉంటానో తెలియదు: ట్రంప్

అమెరికా : తనపై జరుగుతోన్న వరుస హత్యాయత్నాలపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఆందోళన వ్యక్తం చేశారు. తనను హత్య చేయడానికి చాలా మంది ప్రయత్నాలు చేస్తున్నారని.. ప్రస్తుత పరిస్థితులు చూస్తుంటే తాను ఎంత కాలం ఉంటానో కూడా తెలియట్లేదన్నారు. ఇటువంటి షూటర్లు సాధారణ అధ్యక్షుల జోలికి వెళ్లరని.. కేవలం అసాధారణ విజయాలు సాధించే అధ్యక్షులనే లక్ష్యంగా చేసుకుంటారని అన్నారు. ఈ సందర్భంగా అమెరికా మాజీ అధ్యక్షులు అబ్రహం లింకన్, జాన్ ఎఫ్. కెన్నడీ హత్య ఘటనలను ఉదాహరణగా పేర్కొన్నారు. ఇలాంటి ఎన్ని బెదిరింపులకు పాల్పడినా.. తాను తీసుకునే నిర్ణయాలపై ఏ మాత్రం వెనక్కి తగ్గబోనన్నారు. ఇటీవల ఫ్లోరిడాలోని తన నివాసంలోకి ఓ సాయుధ దుండగుడు చొరబడిన ఘటనపై స్పందిస్తూ ట్రంప్ ఈ వ్యాఖ్యలు చేశారు.



శనివారం అర్ధరాత్రి సమయంలో ఓ దుండగుడు ఫ్లోరిడాలోని ట్రంప్ నివాసంలోకి ప్రవేశించాడు. అతడి చేతిలో ఆయుధంతోపాటు ఇంధనం క్యాన్ ఉన్నట్లు సీక్రెట్ సర్వీస్ ఏజెంట్లు గుర్తించారు. వాటిని కిందపడేయాలని హెచ్చరించినా ఆ దుండగుడు వినకపోవడంతో భద్రతా సిబ్బంది అతడిని హతమార్చారు. కాగా.. ట్రంప్‌పై గతంలోనూ పలుమార్లు హత్యాయత్నాలు జరిగిన విషయం తెలిసిందే. 2024 జులైలో ఎన్నికల ప్రచారంలో ఉన్న ఆయనపై ఓ వ్యక్తి కాల్పులు జరిపాడు. ఆ ఘటనలో ట్రంప్ చెవి భాగం నుంచి తూటా దూసుకెళ్లింది. ఆ తర్వాత ఓసారి ట్రంప్ పామ్ బీచ్ గోల్ఫ్ కోర్స్‌లో రైఫిల్‌తో అనుమానాస్పదంగా ఉన్న ఓ వ్యక్తినీ పోలీసులు అరెస్టు చేశారు.

నినాదం
నిఖార్సైన జర్నలిజం

# మహిళా టీ20 వరల్డ్ కప్ షెడ్యూల్ ఖరారు..

## జూన్ 12 నుంచి ఇంగ్లండ్ గడ్డపై రణరంగం



**ఐసీసీ మహిళా టీ20 వరల్డ్ కప్ 2026 షెడ్యూల్ అధికారికంగా విడుదలైంది. ఇంగ్లండ్, వేల్స్ వేదికగా జరగనున్న ఈ మెగా టోర్నీ జూన్ 12 నుంచి జూలై 5 వరకు క్రికెట్ అభిమానులను ఉర్రూతలూగించనుంది. ఈసారి మొత్తం 12 జట్లు ప్రపంచకప్ వేటలో తలపడుతున్నాయి. గ్రూప్ దశలో జట్లను రెండు విభాగాలుగా విడగొట్టారు. గ్రూప్-1లో భారత్, పాకిస్థాన్, ఆస్ట్రేలియా, సౌతాఫ్రికా, బంగ్లాదేశ్, నెదర్లాండ్స్ ఉండగా.. గ్రూప్-2లో ఆతిథ్య ఇంగ్లండ్‌తో పాటు వెస్టిండీస్, న్యూజిలాండ్, శ్రీలంక, ఐర్లాండ్ , స్కాట్లాండ్ జట్లు ఉన్నాయి.**

భారత మహిళా జట్టు తన తొలి పోరును చిరకాల ప్రత్యర్థి పాకిస్థాన్‌తో జూన్ 14న ప్రారంభించనుంది. ఎడ్జ్‌బాస్టన్ వేదికగా జరిగే ఈ రసవత్తర పోరు భారత కాలమానం ప్రకారం రాత్రి 8 గంటలకు మొదలవుతుంది. ఆ తర్వాత టీమిండియా జూన్ 17న నెదర్లాండ్స్‌తో, జూన్ 21న సౌతాఫ్రికాతో, జూన్ 25న బంగ్లాదేశ్‌తో తలపడుతుంది. గ్రూప్ స్టేజ్‌లో చివరి మ్యాచ్ అత్యంత కీలకం కానుంది. జూన్ 28న లార్డ్స్ మైదానంలో పటిష్టమైన ఆస్ట్రేలియాతో భారత్ ఢీకొంటుంది. సెమీఫైనల్స్ జూన్ 30, జూలై 2 తేదీల్లో ది ఓవల్ మైదానంలో జరగనుండగా, గ్రాండ్ ఫైనల్ జూలై 5న చారిత్రాత్మక లార్డ్స్ క్రికెట్ గ్రౌండ్‌లో నిర్వహిస్తారు.

**ఐసీసీ మహిళా టీ20 వరల్డ్ కప్ 2026 పూర్తి షెడ్యూల్:**

| |
|---|
| జూన్ 12: ఇంగ్లండ్ వర్సెస్ శ్రీలంక (ఎడ్జ్‌బాస్టన్) |
| జూన్ 13: స్కాట్లాండ్ వర్సెస్ ఐర్లాండ్ (ఓల్డ్ ట్రాఫోర్డ్) |
| జూన్ 13: ఆస్ట్రేలియా వర్సెస్ సౌతాఫ్రికా (ఓల్డ్ ట్రాఫోర్డ్) |
| జూన్ 13: వెస్టిండీస్ వర్సెస్ న్యూజిలాండ్ (హాంప్‌షైర్ బౌల్) |
| జూన్ 14: బంగ్లాదేశ్ వర్సెస్ నెదర్లాండ్స్ (ఎడ్జ్‌బాస్టన్) |
| జూన్ 14: భారత్ వర్సెస్ పాకిస్థాన్ (ఎడ్జ్‌బాస్టన్) |
| జూన్ 16: న్యూజిలాండ్ వర్సెస్ శ్రీలంక (హాంప్‌షైర్ బౌల్) |
| జూన్ 16: ఇంగ్లండ్ వర్సెస్ ఐర్లాండ్ (హాంప్‌షైర్ బౌల్) |
| జూన్ 17: ఆస్ట్రేలియా వర్సెస్ బంగ్లాదేశ్ (హెడింగ్లీ) |
| జూన్ 17: భారత్ వర్సెస్ నెదర్లాండ్స్ (హెడింగ్లీ) |
| జూన్ 17: సౌతాఫ్రికా వర్సెస్ పాకిస్థాన్ (ఎడ్జ్‌బాస్టన్) |
| జూన్ 18: వెస్టిండీస్ వర్సెస్ స్కాట్లాండ్ (హెడింగ్లీ) |
| జూన్ 19: న్యూజిలాండ్ వర్సెస్ ఐర్లాండ్ (హాంప్‌షైర్ బౌల్) |
| జూన్ 20: ఆస్ట్రేలియా వర్సెస్ నెదర్లాండ్స్ (హాంప్‌షైర్ బౌల్) |
| జూన్ 20: పాకిస్థాన్ వర్సెస్ బంగ్లాదేశ్ (హాంప్‌షైర్ బౌల్) |
| జూన్ 20: ఇంగ్లండ్ వర్సెస్ స్కాట్లాండ్ (హెడింగ్లీ) |
| జూన్ 21: వెస్టిండీస్ వర్సెస్ శ్రీలంక (బ్రిస్టల్) |
| జూన్ 21: సౌతాఫ్రికా వర్సెస్ భారత్ (ఓల్డ్ ట్రాఫోర్డ్) |
| జూన్ 23: న్యూజిలాండ్ వర్సెస్ స్కాట్లాండ్ (బ్రిస్టల్) |
| జూన్ 23: శ్రీలంక వర్సెస్ ఐర్లాండ్ (బ్రిస్టల్) |
| జూన్ 23: ఆస్ట్రేలియా వర్సెస్ పాకిస్థాన్ (హెడింగ్లీ) |
| జూన్ 24: ఇంగ్లండ్ వర్సెస్ వెస్టిండీస్ (లార్డ్స్) |
| జూన్ 25: భారత్ వర్సెస్ బంగ్లాదేశ్ (ఓల్డ్ ట్రాఫోర్డ్) |
| జూన్ 25: సౌతాఫ్రికా వర్సెస్ నెదర్లాండ్స్ (బ్రిస్టల్) |
| జూన్ 26: శ్రీలంక వర్సెస్ స్కాట్లాండ్ (ఓల్డ్ ట్రాఫోర్డ్) |
| జూన్ 27: పాకిస్థాన్ వర్సెస్ నెదర్లాండ్స్ (బ్రిస్టల్) |
| జూన్ 27: వెస్టిండీస్ వర్సెస్ ఐర్లాండ్ (బ్రిస్టల్) |
| జూన్ 27: ఇంగ్లండ్ వర్సెస్ న్యూజిలాండ్ (ది ఓవల్) |
| జూన్ 28: సౌతాఫ్రికా వర్సెస్ బంగ్లాదేశ్ (లార్డ్స్) |
| జూన్ 28: ఆస్ట్రేలియా వర్సెస్ భారత్ (లార్డ్స్) |
| జూన్ 30: మొదటి సెమీఫైనల్ (ది ఓవల్) |
| జూలై 2: రెండో సెమీఫైనల్ (ది ఓవల్) |
| జూలై 5: గ్రాండ్ ఫైనల్ (లార్డ్స్) |

# 49 ఏళ్ల నిరీక్షణకు దక్కిన గౌరవం..

## వరల్డ్ ఛాంపియన్ జెర్సీలో టీమిండియా అమ్మాయిలు

**భారత మహిళా క్రికెట్ చరిత్రలో ఒక సువర్ణ అధ్యాయం ఆవిష్కృతమైంది. ప్రస్తుతం ఆస్ట్రేలియా పర్యటనలో ఉన్న మన టీమిండియా అమ్మాయిల జెర్సీపై మెరుస్తున్న ఆ ఒక్క నక్షత్రం ఇప్పుడు 150 కోట్ల భారతీయుల గుండెల్లో గర్వాన్ని నింపుతోంది.**



భారత మహిళా క్రికెట్ చరిత్రలో ఒక సువర్ణ అధ్యాయం ఆవిష్కృతమైంది. ప్రస్తుతం ఆస్ట్రేలియా పర్యటనలో ఉన్న మన టీమిండియా అమ్మాయిల జెర్సీపై మెరుస్తున్న ఆ ఒక్క నక్షత్రం ఇప్పుడు 150 కోట్ల భారతీయుల గుండెల్లో గర్వాన్ని నింపుతోంది. ఇటీవల జరిగిన టీ20 సిరీస్‌ను 2-1తో కైవసం చేసుకున్న భారత జట్టు, ఇప్పుడు వన్డే సిరీస్‌లో తలపడుతోంది. అయితే ఈ సిరీస్‌కు ఒక స్పెషాలిటీ ఉంది. 2025 వన్డే ప్రపంచ కప్‌లో విశ్వవిజేతగా నిలిచిన తర్వాత భారత్ ఆడుతున్న మొదటి వన్డే సిరీస్ ఇది. ప్రపంచ ఛాంపియన్ హోదాలో మైదానంలోకి అడుగుపెట్టిన మన మహిళా క్రికెటర్ల జెర్సీపై బీసీసీఐ లోగో మీద తొలిసారిగా ఒక స్టార్ దర్శనమిచ్చింది. వాస్తవానికి ఈ ఒక్క స్టార్ వెనుక దాదాపు 49 ఏళ్ల సుదీర్ఘ నిరీక్షణ, కఠోర శ్రమ దాగి ఉంది. భారత మహిళా జట్టు తన మొదటి అంతర్జాతీయ వన్డే మ్యాచ్‌ను 1978 జనవరి 1న ఇంగ్లాండ్‌తో ఆడింది. అప్పటి నుంచి ప్రపంచ కప్ అందుకోవాలనే కల దశాబ్దాల పాటు వాయిదా పడుతూ వచ్చింది. చివరకు 2025లో సౌతాఫ్రికాను ఓడించి భారత్ ఆ కలను నిజం చేసుకుంది. అంతర్జాతీయ క్రికెట్ నిబంధనల ప్రకారం.. ఒక జట్టు ఏ ఫార్మాట్‌లో ఎన్ని ప్రపంచ కప్‌లు గెలిస్తే, ఆ ఫార్మాట్ జెర్సీపై అన్ని నక్షత్రాలు ముద్రించుకునే అవకాశం ఉంటుంది. ఆ లెక్కన ఇప్పుడు మన మహిళా వన్డే జెర్సీపై అధికారికంగా మొదటి స్టార్ చేరింది. సోషల్ మీడియాలో ఈ కొత్త జెర్సీ ఫోటోలు విపరీతంగా వైరల్ అవుతున్నాయి. ఈ చారిత్రాత్మక విజయం నవీ ముంబైలోని డీవై పాటిల్ స్టేడియంలో నమోదైంది. 2025 వన్డే వరల్డ్ కప్ ఫైనల్లో భారత్ మొదట బ్యాటింగ్ చేసి 298 పరుగుల భారీ స్కోరు సాధించింది. లక్ష్య ఛేదనలో సౌతాఫ్రికా జట్టు భారత బౌలర్ల ధాటికి తలవంచి కేవలం 246 పరుగులకే పరిమితమైంది. అంతకుముందు సెమీఫైనల్లో పటిష్టమైన ఆస్ట్రేలియాను ఓడించి భారత్ ఫైనల్‌కు చేరడం విశేషం. దశాబ్దాలుగా ఆస్ట్రేలియా, ఇంగ్లాండ్ వంటి జట్ల ఆధిపత్యానికి చరమగీతం పాడుతూ, భారత మహిళా జట్టు ఇప్పుడు ప్రపంచ క్రికెట్‌ను శాసిస్తోంది. ఆ జెర్సీపై ఉన్న స్టార్ కేవలం ఒక గుర్తు మాత్రమే కాదు, అది భారత నారీ శక్తికి నిదర్శనం.

## ఓపెనర్లే కాదు.. ఫినిషర్ కూడా తుస్సుమన్నాడు.. రింకూ సింగ్ గణాంకాలు చూస్తే షాకే

**టీ20 వరల్డ్ కప్ 2026లో భారత జట్టు ప్రయాణం ప్రస్తుతం ఆశించినంత సాఫీగా సాగడం లేదు. ఇప్పటివరకు మనం కేవలం ఓపెనర్ల వైఫల్యం గురించి, ముఖ్యంగా నాలుగు మ్యాచ్‌ల్లో మూడు సార్లు డకౌట్ అయిన అభిషేక్ శర్మ గురించి మాట్లాడుకుంటున్నాం.**

టీ20 వరల్డ్ కప్ 2026లో భారత జట్టు ప్రయాణం ప్రస్తుతం ఆశించినంత సాఫీగా సాగడం లేదు. ఇప్పటివరకు మనం కేవలం ఓపెనర్ల వైఫల్యం గురించి, ముఖ్యంగా నాలుగు మ్యాచ్‌ల్లో మూడు సార్లు డకౌట్ అయిన అభిషేక్ శర్మ గురించి మాట్లాడుకుంటున్నాం. కానీ, టీమిండియాను అసలైన టెన్షన్‌లో పడేస్తుంది మాత్రం టీం ఫినిషర్ రింకూ సింగ్ ఫామ్. ఐపీఎల్ నుంచి టీమిండియా వరకు మెరుపు ఇన్నింగ్స్‌లతో ఆకట్టుకున్న రింకూ, ఈ మెగా టోర్నీలో మాత్రం దారుణంగా తడబడుతున్నాడు. ఎంతలా అంటే, అతను ఆడిన బంతుల కంటే చేసిన పరుగులు చాలా తక్కువగా ఉండటం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది.



సాధారణంగా టీ20 ఫార్మాట్‌లో బ్యాటర్లకు క్రీజులో కుదురుకోవడానికి ఎక్కువ సమయం ఉండదు. ఈ రోజుల్లో ఓపెనర్లే మొదటి బంతి నుంచే బాదాలని చూస్తుంటే, ఆఖర్లో వచ్చే ఫినిషర్ పాత్ర ఎంత కీలకమో అర్థం చేసుకోవచ్చు. ఇన్నింగ్స్ మొదట్లో ఉన్న స్కోరు వేగాన్ని పెంచడమో లేదా వికెట్లు పడి కష్టాల్లో ఉన్నప్పుడు జట్టును ఆదుకోవడమో చేయాల్సిన బాధ్యత ఫినిషర్ మీద ఉంటుంది. కానీ రింకూ సింగ్ విషయంలో ఇది రివర్స్ అవుతోంది. అతను క్రీజులోకి వచ్చి స్కోరు వేగాన్ని పెంచకపోగా, అనవసరంగా బంతులను వృథా చేస్తూ జట్టుపై ఒత్తిడి పెంచుతున్నాడనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ వరల్డ్ కప్‌లో రింకూ సింగ్ గణంకాలను ఒకసారి పరిశీలిస్తే ఎవరైనా షాక్ అవ్వాల్సిందే. అమెరికాతో జరిగిన మ్యాచ్‌లో 14 బంతులు ఆడిన రింకూ కేవలం 6 పరుగులే చేశాడు. అంటే ఒక ఫినిషర్ నుంచి ఆశించే స్ట్రైక్ రేట్ అక్కడ మచ్చుకైనా కనిపించలేదు. నమీబియాపై 6 బంతుల్లో 1 పరుగు, పాకిస్థాన్‌పై 4 బంతుల్లో 11 పరుగులు, నెదర్లాండ్స్‌పై 3 బంతుల్లో 6 పరుగులు చేశాడు. పాక్, నెదర్లాండ్స్ మ్యాచ్‌ల్లో నాటౌట్‌గా నిలిచినప్పటికీ, మ్యాచ్ ఫినిషింగ్ టచ్ ఇవ్వడంలో మాత్రం విఫలమయ్యాడు. మొత్తం 5 మ్యాచ్‌ల్లో కలిపి అతను కేవలం 24 పరుగులు మాత్రమే చేశాడు. ఇందుకోసం ఏకంగా 29 బంతులు ఆడాడు. ముఖ్యంగా సూపర్-8 రౌండ్‌లో సౌతాఫ్రికాతో జరిగిన కీలక మ్యాచ్‌లో రింకూ ఆడిన తీరు అభిమానులను తీవ్ర నిరాశకు గురిచేసింది. ఆ మ్యాచ్‌లో కనీసం ఖాతా కూడా తెరవకుండానే, కేశవ్ మహారాజ్ వేసిన బంతిని అనవసరంగా బాదబోయి క్యాచ్ అవుట్ అయ్యాడు. ఒక బాధ్యతాయుతమైన ఇన్నింగ్స్ ఆడి జట్టుకు గౌరవప్రదమైన స్కోరు అందించాల్సిన సమయంలో రింకూ ఇలా వికెట్ పారేసుకోవడం చర్చకు దారితీసింది.

# గంభీర్ ఈ 3 తప్పిదాలు రిపీటైతే..

## సెమీస్ చేరకుండానే టీమిండియా ఔట్..?




**భారత జట్టు సూపర్ 8లో తొలి మ్యాచ్ ఓడిపోయింది. దీంతో తర్వాత జింబాబ్వే జట్టుతో జరగబోయే మ్యాచ్ ఎంతో కీలకంగా మారింది. సౌతాఫ్రికాతో చేసిన 3 తప్పులు మరోసారి రిపీటైతే భారత జట్టు సెమీస్ చేరకుండానే ఇంటికి పోనుంది.**

IND vs ZIM: గంభీర్ ఈ 3 తప్పిదాలు రిపీటైతే.. సెమీస్ చేరకుండానే టీమిండియా ఔట్..?

టీ20 వరల్డ్ కప్ 2026 సూపర్-8 మ్యాచ్‌లో దక్షిణాఫ్రికా చేతిలో భారత్‌కు 76 పరుగుల భారీ ఓటమి ఎదురైంది. ముందుగా బ్యాటింగ్ చేసిన సౌతాఫ్రికా 7 వికెట్ల నష్టానికి 187 పరుగులు చేసింది. లక్ష్య ఛేధనలో భారత్ 111 పరుగులకే ఆలౌట్ అయి మ్యాచ్‌ను కోల్పోయింది. ఇప్పుడు సూపర్-8 దశలో టీమిండియా తదుపరి మ్యాచ్ ఫిబ్రవరి 26న జింబాబ్వేతో జరగనుంది. ఇది భారత్‌కు 'చావో రేవో' తరహా మ్యాచ్‌గా మారింది.

ఈ కీలక మ్యాచ్‌కు ముందు హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్ చేసిన మూడు పెద్ద వ్యూహాత్మక తప్పిదాలపై చర్చ సాగుతోంది. అవే తప్పిదాలు మళ్లీ పునరావృతమైతే, టీమిండియా టోర్నమెంట్ నుంచే బయటపడే ప్రమాదం ఉంది. ఆ మూడు తప్పిదాలేంటో ఓసారి చూద్దాం..

### 1. అక్షర్ స్థానంలో వాషింగ్టన్ సుందర్..

గత రెండు మ్యాచ్‌ల్లో టీమ్ మేనేజ్‌మెంట్ వైస్ కెప్టెన్ అక్షర్ పటేల్‌ను ప్లేయింగ్ ఎలెవన్ నుంచి తప్పించి వాషింగ్టన్ సుందర్‌కు అవకాశం ఇచ్చింది. అయితే, ఈ నిర్ణయం ఆశించిన ఫలితాన్ని ఇవ్వలేదు. దక్షిణాఫ్రికాతో మ్యాచ్‌లో సుందర్ బ్యాటింగ్‌లో 11 బంతుల్లో 11 పరుగులు మాత్రమే చేశాడు. బౌలింగ్‌లో కూడా వికెట్ తీయలేకపోయాడు.

జట్టు సమతౌల్యం పరంగా ఇది సరైన నిర్ణయమా అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. అక్షర్ పటేల్ ఆర్థికంగా బౌలింగ్ చేయడమే కాకుండా అవసరమైనప్పుడు వేగంగా పరుగులు చేసే సామర్థ్యం కలిగిన ఆల్‌రౌండర్. కీలక మ్యాచ్‌ల్లో అతని అనుభవం టీమిండియాకు ఎంతో అవసరం.

చెన్నై లాంటి స్పిన్‌కు అనుకూలమైన పిచ్‌లపై అక్షర్ లాంటి ఆల్‌రౌండర్ ఉండటం జట్టు బలాన్ని పెంచుతుంది. జింబాబ్వేతో కీలక మ్యాచ్‌లో కూడా అక్షర్‌కు అవకాశం ఇవ్వకపోతే, దాని ప్రభావం టీమిండియాపై పడే అవకాశముంది.

### 2. అభిషేక్ శర్మ - రింకూ సింగ్‌పై ఎక్కువగా నమ్మకం పెట్టుకోవడం..

అభిషేక్ శర్మ, రింకూ సింగ్‌పై టీమ్ మేనేజ్‌మెంట్ వరుసగా నమ్మకం చూపుతోంది. కానీ తాజా ప్రదర్శనలు ఈ నిర్ణయాన్ని ప్రశ్నించేలా ఉన్నాయి. అభిషేక్ శర్మ తొలి మూడు మ్యాచ్‌ల్లో ఖాతా కూడా తెరవలేకపోయాడు. దక్షిణాఫ్రికాతో మ్యాచ్‌లో కేవలం 15 పరుగులకే ఔటయ్యాడు. టాప్ ఆర్డర్ విఫలం కావడం వల్ల భారత్ ఆరంభంలోనే ఒత్తిడిలో పడుతోంది.

ఇక ఫినిషర్ పాత్రలో రింకూ సింగ్ కూడా ప్రభావం చూపలేకపోయాడు. గత ఐదు ఇన్నింగ్స్‌ల్లో కేవలం 24 పరుగులు మాత్రమే చేశాడు. అతని స్ట్రైక్‌రేట్ సుమారు 82.76 మాత్రమే ఉండటం టీ20 క్రికెట్‌కు చాలా తక్కువ. సగటు కూడా కేవలం 8.00 మాత్రమే. ఇలాంటప్పుడు జింబాబ్వే (×చీణ జం ×వీ)తో మ్యాచ్‌లో కూడా ఇదే కాంబినేషన్ కొనసాగిస్తే టీమిండియాకు నష్టం కలిగే ప్రమాదం ఉంది.

### కుల్దీప్ యాదవ్‌ను బెంచ్‌పై ఉంచడం..

ప్రపంచ స్థాయి స్పిన్ బౌలర్లలో ఒకడిగా గుర్తింపు పొందిన కుల్దీప్ యాదవ్‌కు ప్లేయింగ్ ఎలెవన్‌లో అవకాశం ఇవ్వకపోవడం తీవ్ర విమర్శలకు దారి తీస్తోంది. పెద్ద టోర్నమెంట్‌ల్లో అతని అనుభవం, వెరైటీ, మధ్య ఓవర్లలో వికెట్లు తీసే సామర్థ్యం ఎంతో కీలకం. భారత బౌలింగ్ విభాగం ప్రత్యర్థి బ్యాట్స్‌మెన్‌పై ఒత్తిడి పెంచడంలో ఇబ్బంది పడుతున్న వేళ, వికెట్ తీసే స్పిన్నర్ లేకపోవడం స్పష్టంగా కనిపించింది. చెన్నై వంటి పిచ్‌లపై స్పిన్‌కు సహకారం లభించే అవకాశం ఎక్కువగా ఉంటుంది. అలాంటి పరిస్థితుల్లో కుల్దీప్‌ను బయట ఉంచడం వ్యూహాత్మకంగా భారంగా మారవచ్చు. జింబాబ్వే (×చీణ జం ×వీ)తో మ్యాచ్‌లో కూడా అతడికి అవకాశం ఇవ్వకపోతే, ఇది టీమిండియాకు పెద్ద రిస్క్‌గా మారుతుంది.

# స్కిల్ మీటర్ కామెడీ..మిల్లర్ కన్నా తిలక్ వర్మ పవర్ ఎక్కువట..బ్రాడ్‌కాస్టర్లపై ఫ్యాన్స్ ఫైర్



అహ్మదాబాద్‌లోని నరేంద్ర మోదీ స్టేడియం వేదికగా జరిగిన టీ20 వరల్డ్ కప్ 2026 సూపర్ 8 సమరంలో భారత్ ఓటమి కంటే, బ్రాడ్‌కాస్టర్లు చూపించిన ఒక వింత ప్రస్తుతం సోషల్ మీడియాలో పెద్ద దుమారాన్నే రేపుతోంది. సౌతాఫ్రికాతో జరిగిన ఈ మ్యాచ్‌లో భారత్ 76 పరుగుల తేడాతో ఘోర పరాజయాన్ని చవిచూసింది. సౌతాఫ్రికా బ్యాటర్ డేవిడ్ మిల్లర్ తన విధ్వంసకర ఇన్నింగ్స్‌తో భారత్‌ను ముంచేశాడు. అయితే మ్యాచ్ మధ్యలో బ్రాడ్‌కాస్టర్లు వాడే స్కిల్ మీటర్ ఆటగాళ్ల పవర్ హిట్టింగ్ కెపాసిటీ పోలుస్తూ చూపిన రేటింగ్స్ చూసి క్రికెట్ అభిమానులు నోరెళ్ల బెడుతున్నారు. అసలు ఆ మీటర్ ఎలా పనిచేస్తుందో అర్థం కాక జుట్టు పీక్కుంటున్నారు.

వివరాల్లోకి వెళ్తే.. పవర్ హిట్టింగ్‌లో ప్రపంచంలోనే అత్యంత ప్రమాదకరమైన బ్యాటర్లలో ఒకడైన డేవిడ్ మిల్లర్‌కు ఈ స్కిల్ మీటర్ కేవలం 64 పాయింట్లు మాత్రమే ఇచ్చింది. అదే సమయంలో భారత యువ ఆటగాడు తిలక్ వర్మకు ఏకంగా 97 పాయింట్లు కేటాయించింది. ఈ పోలిక చూసిన నెటిజన్లు బ్రాడ్‌కాస్టర్లపై ఓ రేంజ్‌లో విరుచుకుపడుతున్నారు. ఈ మ్యాచ్‌లోనే మిల్లర్ 35 బంతుల్లో 63 పరుగులు చేసి (7 ఫోర్లు, 3 సిక్సర్లు) తన పవర్ ఏంటో చూపించాడు. మరోవైపు తిలక్ వర్మ కేవలం 1 పరుగుకే అవుట్ అయ్యాడు. ఈ వరల్డ్ కప్‌లో తిలక్ ఫామ్ కూడా అంతంతమాత్రంగానే ఉంది. ఐదు మ్యాచ్‌ల్లో కలిపి అతను 107 పరుగులు మాత్రమే చేశాడు, సగటు 21.40 కాగా స్ట్రైక్ రేట్ కేవలం 118గా ఉంది. ఇంత తక్కువ గణాంకాలు ఉన్న ఆటగాడికి, మిల్లర్ కంటే ఎక్కువ పవర్ హిట్టింగ్ పాయింట్లు ఎలా ఇస్తారని ఫ్యాన్స్ ప్రశ్నిస్తున్నారు. కేవలం మిల్లర్ విషయంలోనే కాదు, వెస్టిండీస్ హార్డ్ హిట్టర్ రోవ్‌మన్ పావెల్ విషయంలోనూ ఇలాంటి వింతే జరిగింది. జింబాబ్వేపై జరిగిన మ్యాచ్‌లో పావెల్ 35 బంతుల్లో 59 పరుగులు చేసి జట్టును గెలిపించాడు. ఆ మ్యాచ్‌లో అతను ఏకంగా 106 మీటర్ల భారీ సిక్సర్‌ను కూడా బాదాడు. కానీ స్కిల్ మీటర్ మాత్రం పావెల్‌కు కేవలం 94 పాయింట్లు ఇచ్చింది. అంటే 100 మీటర్ల పైగా సిక్సర్లు కొట్టే పావెల్ కంటే, తిలక్ వర్మ పవర్ హిట్టింగ్ స్కిల్స్ ఎక్కువని ఆ మీటర్ చెప్పకనే చెప్పింది. ఈ విడ్డూరాన్ని చూసిన క్రికెట్ ప్రేమికులు ఇది స్కిల్ మీటరా లేక కామెడీ మీటరా? అంటూ ట్రోల్స్ చేస్తున్నారు. అసలు ఈ పవర్ హిట్టింగ్ పాయింట్లను ఏ ప్రాతిపదికన లెక్కిస్తారనే దానిపై బ్రాడ్‌కాస్టర్ల నుంచి ఇప్పటి వరకు ఎలాంటి క్లారిటీ లేదు. సాధారణంగా స్ట్రైక్ రేట్, సిక్సర్లు బాదే కెపాసిటీ, బంతిని ఎంత వేగంగా హిట్ చేస్తున్నారు అనే అంశాలను పరిగణనలోకి తీసుకోవాలి. కానీ క్షేత్రస్థాయిలో అదరగొడుతున్న మిల్లర్, పావెల్ వంటి దిగ్గజాలకు తక్కువ పాయింట్లు ఇచ్చి, ఫామ్ కోసం కష్టపడుతున్న యువ ఆటగాళ్లకు అధిక రేటింగ్ ఇవ్వడం సాంకేతిక లోపమా లేక విశ్లేషణ లోపమా అని ఫ్యాన్స్ మండిపడుతున్నారు. టీ20 క్రికెట్‌లో డేవిడ్ మిల్లర్ లాంటి కిల్లర్ ఆటగాడిని అవమానించడమేనని మరికొందరు అభిప్రాయపడుతున్నారు. మొత్తానికి ఈ స్కిల్ మీటర్ వివాదం వరల్డ్ కప్ వేడిని మరింత పెంచింది.

# ప్రజల పాలిట పాలకూట విషం

సంపాదకీయం

కల్తీకి కాదేదీ అర్హం అన్న రీతిలో... ఆహారా పదార్థాల కల్తీ విపరీతం అయ్యింది. అడపాదడపా దాడుల్లో కల్తీలు బయటపడుతున్నా కఠిన చర్యలు కనిపించడం లేదు. కల్తీ చేస్తున్న దగుల్బాజీల్లో భయం కనిపించడం లేదు. కల్తీ కల్లుకు బలవుతున్నారు. కల్తీ మద్యానికి బలవుతున్నారు. ఫుడ్ పాయిజనింగ్‌కు బలవుతున్నారు. చివరకు పాలు కూడా కల్తీ చేస్తున్నారు. యూరియా లాంటివి కలిపి కృత్రిమ పాలతో ప్రజల ప్రాణాలు తోడేస్తున్నారు. నిత్యం తాగే పాలను సైతంకల్తీ చేస్తున్న ఘటన వెలుగులోకి రావడం దారుణం. కల్తీ పాల కారణంగా ఇప్పటికే ఐదుగురు మృత్యువాత పడ్డారు. మరికొందరు ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు. రాజమహేంద్రవరంలో కల్తీ పాలు తాగి ఐదుగురు మరణించడం బాధాకరం. స్వచ్ఛతకు మారుపేరుగా పాలను పేర్కొంటారు. అటువంటి పాలను అమితమైన లాభార్జన కోసం కాలకూట విషం కావించడం అమానవీయం. ఒకప్పుడు పాలల్లో నీళ్లు కలపడాన్ని పెద్ద నేరంగా పరిగణించేవారు. ఇప్పుడు పాలంటే హడలెత్తే స్థితికి కల్తీ దందా చేరుకోవడం ఆందోళన కలిగిస్తుంది. పాలు ప్రజలకు నిత్యావసర వస్తువు. పసికందుల దగ్గర నుంచి వృద్ధుల వరకు పాలే జీవనాధారం. పాలు తాగితే చాలా వరకు మన శరీరానికి కావాల్సిన సంపూర్ణ పోషకాలు సమకూరుతాయన్నది ఆరోగ్య నిపుణుల మాట. అటువంటి పాల వ్యాపారంపై ప్రభుత్వ నియంత్రణ అంతంత మాత్రమే. ఎవరైనా డెయిరీ పెట్టవచ్చు. పాలు సరఫరా చేయవచ్చు. అందులో ఏం కలుస్తున్నాయో తెలియడం లేదు. నేరుగా గేదె పాలు పోస్తున్నారన్న నమ్మకంతో ప్రజలు డబ్బాల్లో వచ్చే పాలను ఆశ్రయిస్తున్నారు. ఫుడ్ సేఫ్టీ అధికారులు అడ్రస్ లేకుండా పోయారు. వాటిపై పర్యవేక్షణ ఎవరిదన్న విషయం తెలియదు. కాలం చెల్లిన, నాసిరకం, కల్తీ పాలను గుర్తించే వ్యవస్థ అసలు ఉందా అన్నదే అనుమానం. గతంలో రైతులు తమకు తాముగా నిర్వహించుకునే సహకార వ్యవస్థ బలంగా ఉన్నప్పుడు పాల కల్తీ ఉండేది కాదు. ఎప్పుడైతే ప్రైవేటు డెయిరీలు పుట్టగొడుల్లా పుట్టుకొచ్చాయో అప్పటి నుంచి కల్తీ విచ్చలవిడైందన్న ఆరోపణలు బాగా ముందుకొచ్చాయి. పాడి పంట.. గ్రామీణ ప్రాంతాల్లో రైతుతో విడదీయరాని బంధం. గ్రామీణ మహిళలే పాడిని నిర్వహిస్తారు. కానీ కష్టపడి పాలను ఉత్పత్తి చేసిన రైతుకు గిట్టుబాటు ధర దక్కడం లేదు. వారి వద్ద నుంచి పాలను సేకరించిన ప్రైవేటు డెయిరీలకు మాత్రం లాభాల పంట పండుతుంది. రోజూ ఉత్పత్తవుతున్న పాలల్లో ప్రైవేటు, సహకారం రెండూ కలిపినా కూడా సంఘటితరంగం కిందికొచ్చేవి సగం కూడా లేదన్నది ప్రభుత్వ అంచనా. ప్రభుత్వం దశలవారీగా సహకార రంగాన్ని నిర్వీర్యం చేయడంతో ప్రైవేటు ఆధిపత్యం అంతకంత కూ పెరుగుతోంది. డెయిరీల మధ్య అనారోగ్య పోటీ నెలకొంది. డెయిరీ ప్రైవేటీకరణ కాస్తా కొర్పొరేటీకరణ బాట పట్టింది. ఎప్పుడైతే పరిస్థితి మారిందో చిన్నా చితకా డెయిరీలు సైతం లాభాల కోసం అడ్డదారులు తొక్కుతూ ప్రజల ఆరోగ్యాలతో చెలగాటమాడుతున్నాయి. రాష్ట్రంలో పాడిపశువుల సంఖ్యపై అనుమానా లున్నాయి. ప్రజల ఆరోగ్యాలను హరించే సింథటిక్ పాలు, యూరియా వంటి రసాయనాలతో తయారు చేసిన పాలు మార్కెట్‌లోకి ప్రవేశిస్తున్నాయన్న ఫిర్యాదులొస్తున్నాయి. పాల వ్యాపారులు ఏకంగా కృత్రిమ పాలను ఉత్పత్తి చేస్తున్నట్లు కనిపిస్తుంది. దీనికితోడు తనిఖీ బాధ్యతను ఆయా సంస్థలకే వదిలేసినట్లు కనిపిస్తుంది. పాలతో సహా యావత్ ఫుడ్ సేఫ్టీ బాధ్యత ప్రభుత్వానిదే అయినా ఎక్కడా అజమాయిషీ కనిపించడం లేదు. . అందుకు పటిష్టమైన వ్యవస్థ అవసరం. లేదంటే ప్రజల ఆరోగ్యం ప్రమాదంలో పడుతుందనడానికి రాజయమండ్రి ఘటనే నిదర్శనం. రాజమహేంద్రవరం కేసులకు సంబంధించిన ఇప్పటికీ ఇద్దరు వెంటిలేటర్‌పై ఉండగా, ఎనిమిది మంది తీవ్ర అనారోగ్య సమస్యలతో ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు. ఒకే వ్యక్తి నుంచి పాలు కొనుగోలు చేసిన వారిలో ఈ వ్యాధి ముదరి ఆస్పత్రి పాలయ్యారు. అనూరియా అంటే మూత్ర విసర్జన ఆగిపోవడం వంటి జబ్బుతో పలువురు ఆస్పత్రిలో చేరారు. రాజమండ్రి నగర శివారుకు చెందిన డజను మంది అనూరియా లక్షణాలతో ఆదివారం ఒకేసారి ఆస్పత్రులల్లో చేరడంతో కలకలం లేచింది. పరిస్థితి డయాలసిస్, కిడ్నీల ఫెయిల్యూర్ వరకు వెళ్లడంతో స్థానిక ప్రజల్లో భయాందోళనలు నెలకొన్నాయి. అనారోగ్యం పాలైన వారు వృద్ధులు, చిన్నారులే కావడం పెద్ద విషాదం. అప్రమత్తమైన అధికార యంత్రాంగం కారణాలను అన్వేషించే పనిలో పడింది. కోరుకొండ మండలం పర్సాపురం గ్రామానికి చెందిన వరలక్ష్మి డెయిరీ నుంచి సరఫరా అయిన కల్తీ పాలే పలువురి అస్వస్థతకు మూలమని ప్రాథమికంగా గుర్తించారు. డెయిరీ నిర్వాహకుడిని పోలీసులు అదుపులోకి తీసుకొని కూపీ లాగుతున్నారు. కల్తీ పాల వ్యవహారంపై రాష్ట్ర ప్రభుత్వం స్పందించి సమగ్ర విచారణకు ఆదేశించడం తో పాటు బాధ్యులను కఠినంగా శిక్షిస్తామని పేర్కొంది. మృతుల కుటుంబాలకు రూ.పది లక్షల ఎక్స్‌గ్రేషియా, ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నవారి పూర్తి వైద్య ఖర్చులను ప్రభుత్వమే భరిస్తానని పేర్కొంది. ఈ మేరకు శాసనసభలో ముఖ్యమంత్రి చంద్రబాబు, శాసన మండలిలో హోం మంత్రి అనిత ప్రకటనలు చేశారు. దీనిని ఇంతటితోనే విదిలేస్తే సరిపోదు. పాల సరఫరాచేస్తున్న వారిపై నిఘా పెట్టాలి. కల్తీ పాల వ్యవహారాన్ని గుర్తించాలి. నిజానికి పాడిగేదెలు ఎన్ని ఉన్నాయి..ఎక్కడెక్కడ నుంచి పాలు వస్తున్నాయో వివరాలను ప్రభుత్వం వద్ద నమోదు చేసుకునేలా చేస్తే మంచిది. పాల కల్తీ జనాన్ని కలవరపరుస్తోంది. కాసుల కక్కుర్తితో కొందరు ఈ పాపానికి ఒడిగడుతున్నారు. అనుమతి లేని కేంద్రాలను నడుపుతూ జనం ఆరోగ్యంతో చెలగాటమాడుతున్నారు. పటిష్ఠ తనిఖీలు, కఠిన శిక్షలు లేకపోవడంతో పాల కల్తీకి అడ్డుకట్ట పడడం లేదు. జిల్లాల్లో అవసరాలకు, ఉత్పత్తికి భారీ వ్యత్యాసం కనిపిస్తోంది. ఇతర ప్రాంతాల నుంచి వచ్చే ప్యాకేజ్డ్ పాల ద్వారా కొంత అవసరాలు తీరుతుండగా.. మిగతా పాలు ఎక్కడివనే తీవ్ర అనుమానాలు రేకెత్తుతున్నాయి. వినియోగానికి అనుగుణంగా ఉత్పత్తి లేకపోవడంతో కొందరు కాసుల కక్కుర్తితో కల్తీకి పాల్పడుతున్నారు. రెండు లీటర్ల పాలల్లో యూరియా, బియ్యం పిండి, సోడా వంటివి కలిపి 5 నుంచి 6 లీటర్లుగా తయారు చేస్తున్నారు. ఆక్సిటోసిన్ ఇంజెక్షన్లపై నిషేధమున్నా.. పాల దిగుబడి పెంపునకు రహస్యంగా తెచ్చి గేదెలకు ఇస్తున్నారు. గ్లూకోజ్, సోడియం, హైడ్రాక్సైడ్, గంజి పౌడరు, జంతువుల కొవ్వు కొన్ని రకాల పాల పొడులను పాలలో కలిపేస్తున్నారు. రసాయనాలతో వ్యాధుల ముప్పు: కల్తీ పాలతో వ్యాధి నిరోధక శక్తి తగ్గిపోతుంది. చిక్కదనం కోసం వాడే యూరియా మూత్రపిండాలను దెబ్బతీస్తుంది. నిల్వ కోసం కలిపే వాడే ఫార్మలిన్ అనే రసాయనంతో జీర్ణకోశ వ్యవస్థ అస్తవ్యస్తమవుతుంది. రసాయనాలతో ఉదర, కాలేయ సంబంధిత సమస్యలొస్తాయి. రాజమండ్రిలో మాత్రమే ఇప్పుడు బయటపడ్డది. ప్రభుత్వం మేలుకోకుంటే మరిన్ని ఘటనలు రావచ్చు.

# విలువల కోసం జీవితాంతం పాటుపడిన కాటం

**ఫిబ్రవరి 25..**
**కాటం లక్ష్మీనారాయణ**
**వర్ధంతి**

ఆయన నిజాం వ్యతిరేక పోరాటయోధులలో ప్రముఖుడు.స్వార్థం అనే పదాన్ని దగ్గరకు రానీయకుండా, రాజకీయ పదవులకు ఏనాడూ పాకులాడ కుండా, కేవలం ప్రజలకు, విలువల కొరకు ఎంతటి వారినైనా, ఎదిరించి ధైర్యంగా నిర్మొహమాటంగా నిల బడటం ఆయనకే చెల్లింది. సంస్థా నాలలో స్వాతంత్ర్య యోధులను కేంద్ర ప్రభుత్వం గుర్తించక పోవడా న్ని అవమానంగా భావించి, పోరాడి సంస్థానాల లోని స్వాతంత్ర్య యోధులకు కూడా పెన్షన్ సౌకర్యం లభింప చేసిన ఘనత ఆయనదే. హైదరాబాదు స్వాతంత్ర్య సమర చరిత్రను ప్రామాణిక పద్ధతుల్లో గ్రంథస్థం చేయించిన కృషీవలుడు ఆయన. వెనుకబడిన వర్గాలకు రిజర్వేషన్లు చెల్లవని కోర్టు తీర్పు ఇవ్వగా దాంతో బలహీన వర్గాల నాయకులందరిని ఒక తాటిపైకి తెచ్చి, ఒక కార్యవర్గాన్ని ఏర్పరిచి దానికి కన్వీనరు అయి సుప్రీం కోర్టుకు వెళ్లి హైకోర్టు తీర్పును రద్దు చేయించిన గొప్పతనం ఆయనదే. ఆంధ్ర ప్రదేశ్ లో తెలుగు అకాడమి లాగ హింది అకాడమి ఉండాలని ఉద్యమించి ప్రభుత్వాన్ని ఒప్పించి స్థాపించి దానికి తానే ఉపాద్యక్షు లయ్యారు. ఆయనే పోరాట పటిమ కు, కార్యదీక్ష తకు నిలువుటద్దం గా నిలిచిన యోధుడు కాటం లక్ష్మీ నారాయణ.

కాటం లక్ష్మీనారాయణ (సెప్టెంబరు 19, 1924 – ఫిబ్రవరి 25, 2010) రంగారెడ్డి జిల్లా శంషాబాదులో, లక్ష్మయ్య, సత్తెమ్మ దంపతులకు 1924 వ సంవత్సరంలో సెప్టెంబరు 19 న జన్మించారు. అయన తాత కాటం నారాయణ స్థానిక జమీందా రుల అకృత్యాలను ఎదిరించిన ధైర్యవంతులు. తాత పేరుతో పాటు ధైర్య సాహసాలు కూడా పుణికి తెచ్చు కున్నారు. 1942 అక్టోబరు 12 న బూర్గుల రామకృష్ణారావు చాదర్ ఘాట్ విక్టరీ ప్లే గ్రౌండులో సత్యాగ్రహం చేయడానికి సన్నాహాలు చేసిన సందర్భంలో నైజాము పోలీసులు బూర్గుల రామకృష్ణారావును, లక్ష్మీనారా యణను అరెస్ట్ చేశారు. అప్పటికి నారాయణ వయస్సు పంతొమ్మిది. అప్పటి నుండి లక్ష్మీనారాయణ బూర్గుల రామకృష్ణారావుని గురువు గా బావించారు. పోలీసులు లక్ష్మీనారాయణను ఏడు నెలల పాటు చెంచల్ గూడ జైల్లో వుంచా రు. తర్వాత లక్ష్మీనారాయణ న్యాయవిద్య పూర్తి చేసి బూర్గుల వారి వద్దనే జూనియర్ లాయర్ గా చేరారు. బూర్గుల తో పాటు అన్ని కార్య కలాపలాలలో క్రియా శీలక పాత్ర పోషించారు. ఆనాటి సామాజి క సమస్యలలో కూడా పాలు పంచుకున్నారు. నిజాం ప్రభుత్వ ఆజ్ఞలను దిక్కరించి హింది పాఠశాలను స్థాపించాడు. ఖాది వ్యాప్తి, దళిత జనోద్ధరణ వంటి కార్యక్రమాలలో చురుకుగా పాల్గొన్నాతు. ఆచార్య రంగా ప్రేరణతో 1945లో లక్ష్మీ నారాయణ హైదరాబాదు యువ జన కాంగ్రేసు స్థాపించి తాను ప్రదాన కార్యదర్శిగా పనిచేశారు. లక్ష్మీ నారాయణ ఏదో ఒక ఉద్యమంలో పాల్గొనడం, అరెస్ట్ కావడం, తిరిగి రావడం, మళ్లి జైలుకెళ్లడం నిత్య కృత్యం అయింది.

**నిజాం పాలన అంతమై, నూతన రాష్ట్రం ఏర్పాటు అయ్యాక, ఆర్థిక, సాంకేతిక, వైజ్ఞానిక రంగాలలో రాష్ట్ర పునర్ నిర్మాణానికి 1949 డిసెంబరులో "జనత" పేరుతో ఒక పత్రికను ప్రారంబించారు. గతంలో రజాకార్ల చేతిలో హతుడైన షోయబుల్లా ఖాన్తో కలిసి పత్రికా రంగంలో పనిచేసిన అనుభవం ఇప్పు డితనికి బాగా ఉపకరించింది. అంతే గాక రైతుల సమస్యల పరిష్కారానికి 1952లో రాష్ట్ర కర్షక సంఘాన్ని స్థాపించారు."తెలుగు భూమి" అనే మరో పత్రికను 1969లో ప్రారంబించారు.**

. ఆంధ్ర ప్రదేశ్ లో తెలుగు అకాడమి లాగ హింది అకాడమి ఉండాలని ఉద్యమించి ప్రభుత్వాన్ని ఒప్పించి స్థాపించి దానికి తానే ఉపాద్యక్షు లయ్యారు.

1968లో హైకోర్టు వెనుకబడిన వర్గాలకు రిజర్వేషన్లు చెల్లవని తీర్పు ఇవ్వగా దాంతో బలహీన వర్గాల నాయకులందరిని ఒక తాటిపైకి తెచ్చి ఒక కార్యవర్గాన్ని ఏర్పరిచి దానికి కన్వీనరు అయి సుప్రీం కోర్టుకు వెళ్లి హైకోర్టు తీర్పును రద్దు చేయించారు. ఆ సందర్భంలో ఒక మహా సభ ఏర్పాటు చేయించారు. దానికి లక్షలాది మంది రాగా నాటి ప్రధాన మంత్రి ఇందిరాగాంధి కూడా రావడం విశేషం. లక్ష్మి నారాయణ సాధించిన ఘన విజయాలలో ఇది ఒకటి.

స్వాతంత్ర్య ఉద్యమాలలో పాల్గొన్న యోధులకు పెన్షన్ ఒక వరం లాంటిది అని నమ్మేవారు లక్ష్మి నారాయణ. స్వతంత్ర భారత్ లో ఈ అవకాశాన్ని అందరు వినియోగించు కుంటున్నా.... నిజాం పాలిత ప్రాంతాల యోధులకు ఆ అవకాశం రాలేదు. దీనిపై లక్ష్మి నారాయణ కేంద్ర ప్రభుత్వంతో చర్చలు జరిపారు. కేంద్రం అంగీకరిం చక పోవడంతో లక్ష్మినారాయణ "తెలంగాణ సమర యోధుని సత్యా గ్రహం" అని రాసిన ఒక అట్టను మెడలో వేసుకుని ప్రధాని ఇంటి ముందు నిరాహార దీక్ష చేసారు. ఢిల్లీ పత్రికలు ప్రముఖంగా ఈ అంశాన్ని ప్రచురించాయి. దాంతొ ఇందిరా గాంధి లక్ష్మిణాయణను పిలిపించి కారణం అడగగా..... "సంస్థానాలలో స్వాతంత్ర్య యోధులను మీరు గుర్తించక పోవడాన్ని మేము అవమానంగా భావిస్తున్నాము. బ్రిటిష్ ఆంధ్ర స్వాతంత్ర్య యోధులు ఒక బ్రిటిష్ వారితోనె పోరాడారు. కాని సంస్థాన లోని యోధులు అటు సంస్థానాధీశులతోను, ఇటు బ్రిటిష్ వారితోను పోరాడారు. 15 ఆగస్టు మాకు స్వాతంత్ర్య దినం కాదా? హైదరా బాదు విముక్తి జరిగిన సెప్టెంబరు 17 ను స్వాతంత్ర్య దినంగా జరుపుకో మంటారా? ఒక్క హైదరాబాదు సంస్థాన ప్రజలే కాదు పలు సంస్థానాల ప్రజలు భారతీ యులు కారా? అవునా? కాదా? ముందు ఇది తేల్చండి? " అని సూటిగా, ధైర్యంగా ఇందిరా గాంధిని ప్రశ్నించి యోధుడు లక్ష్మి నారాయ ణ. దాంతో సంస్థానాల లోని స్వాతంత్ర్య యోధులకు కూడా పెన్షన్ సౌకర్యం లభించింది. ఈ యోధుడు సాధించిన అతి పెద్ద ఘన కార్యం. నేటికీ ప్రామాణిక గ్రంథంగా ఉన్న 844 పేజీల హైదరాబాదు స్వాతంత్ర్య సమర చరిత్రను ప్రామాణిక పద్ధతుల్లో గ్రంథస్థం చేయించారు... దాన్ని అప్పటి భారత రాష్ట్ర పతి జైల్ సింగ్ చేత ఆవిష్కరింప జేసారు. పి.వి.నరసింహ రావు, టి. అంజ య్య, కాసు బ్రంహానంద రెడ్డి, భవనం వెంకట్రామ రెడ్డి, నలుగురు ముఖ్య మంత్రులతో ఒక పెద్ద సభను నిర్వహించారు. అయన నిర్వహించిన సభలకు ప్రధాన మంత్రులు, రాష్ట్రపతులు, పీఠాధి పతులు, స్వాతంత్ర సమర యోధు లు, దలైలామ వంటి వారు కూడా పాల్గొనే వారు. ఆ మహా యోధు డు 2010 వ సంవత్సరం ఫిబ్రవరి 25 నాడు ఈ లోకాన్ని వదిలి వెళ్లారు.



**రామ కిష్టయ్య సంగన భట్ల,**
**సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్**
**కాలమిస్ట్..**

# ఎంతకాలం ఉంటానో తెలియదు

**అయినా వెనకడుగు వేసే ప్రసక్తి లేదు**
**నన్ను చంపడానికి అందరూ కాచుక్కూచున్నారు**
**అమెరికా అధ్యక్షుడు ట్రంప్ వ్యాఖ్య**

**వాషింగ్టన్, నినాదం:**
నేను ఎంతకాలం ఉంటానో తెలియట్లేదు' అని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అన్నారు. ఇటీవల ఫ్లోరిడాలోని తన నివాసంలోకి ఓ సాయుధ దుండగుడు చొరబడిన ఘటనపై స్పందిస్తూ ట్రంప్ ఈ వ్యాఖ్యలు చేశారు. మార్‌ఎ‌లాగో రిసార్ట్‌లోకి తుపాకీతో చొరబడేందుకు ప్రయత్నించిన ఆగంతుకుడిని సీక్రెట్ సర్వీస్ ఏజెంట్లు కాల్చి చంపిన ఘటనపై డొనాల్డ్ ట్రంప్ తొలిసారి స్పందించారు. ఈ భద్రతా లోపంపై ఆయన కాస్త ఆందోళన, మరికాస్త వ్యంగ్యంగా మాట్లాడుతూ చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు హాట్ టాపిక్ అయ్యాయి. వైట్ హౌస్‌లో జరిగిన ఒక కార్యక్రమంలో పాల్గొన్న ట్రంప్.. నేను ఇంకా ఎంతకాలం ఇక్కడ ఉంటానో నాకు తెలియదు. నా కోసం తుపాకులు పట్టుకుని ఎంతమంది వేచి చూస్తున్నారో చూశారుగా ?‘ అని వ్యాఖ్యానించారు. గొప్ప నాయకులకే ఇలాంటి ముప్పు ఉంటుందని, అబ్రహం లింకన్, కెన్నడీ వంటి 'ప్రభావశీల' అధ్యక్షులనే లక్ష్యంగా చేసుకుంటారని చెప్పారు. బహుశా నేను కొంచెం తక్కువ ప్రభావశీల నాయకుడిగా ఉంటే బాగుండేదేమో.. కాసేపు సాధారణ అధ్యక్షుడిలా ఉందాం అని చమత్కరించారు. ఫిబ్రవరి 22 తెల్లవారుజామున 1:30 గంటల సమయంలో ఆస్టిన్ టక్కర్ మార్టిన్ (21) అనే యువకుడు షాట్ గన్, ఇంధనం క్యాన్‌తో మార్‌ఎ‌లాగో ప్రహరీని దాటేందుకు ప్రయత్నించాడు. భద్రతా దళాలు హెచ్చరించినప్పటికీ, అతడు లొంగకుండా తుపాకీని ఎక్కుపెట్టడంతో సీక్రెట్ సర్వీస్ ఏజెంట్లు కాల్పులు జరిపారు. ఈ ఘటనలో మార్టిన్ అక్కడికక్కడే మరణించాడు. ఆ సమయంలో ట్రంప్ దంపతులు వైట్ హౌస్‌లో ఉన్నారు. గతంలో కూడా ట్రంప్‌పై రెండుసార్లు హత్యాయత్నాలు జరిగిన విషయం తెలిసిందే. తాజా ఘటనలో చనిపోయిన యువకుడు ఎప్ స్టీన్ ఫైల్స్ విడుదలకు సంబంధించి ప్రభుత్వంపై అసహనంతో ఉన్నట్లు కొన్ని టెక్ట్స్ మెసేజ్‌ల ద్వారా వెల్లడయ్యింది.తనపై జరుగుతోన్న వరుస హత్యాయత్నాలపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఆందోళన వ్యక్తం చేశారు. తనను హత్య చేయడానికి చాలా మంది ప్రయత్నాలు చేస్తున్నారని.. ప్రస్తుత పరిస్థితులు చూస్తుంటే తాను ఎంత కాలం ఉంటానో కూడా తెలియట్లేదన్నారు. ఇటువంటి షూటర్లు సాధారణ అధ్యక్షుల జోలికి వెళ్లరని.. కేవలం అసాధారణ విజయాలు సాధించే అధ్యక్షులనే లక్ష్యంగా చేసుకుంటారని అన్నారు. ఇలాంటి ఎన్ని బెదిరింపులకు పాల్పడినా.. తాను తీసుకునే నిర్ణయాలపై ఏ మాత్రం వెనక్కి తగ్గబోనన్నారు.2024 జులైలో ఎన్నికల ప్రచారంలో ఉన్న ఆయనపై ఓ వ్యక్తి కాల్పులు జరిపాడు. ఆ ఘటనలో ట్రంప్ చెవి భాగం నుంచి తూటా దూసుకెళ్లింది. ఆ తర్వాత ఓసారి ట్రంప్ పామ్ బీచ్ గోల్ఫ్ కోర్స్‌లో రైఫిల్‌తో అనుమానాస్పదంగా ఉన్న ఓ వ్యక్తినీ పోలీసులు అరెస్టు చేశారు.

**నెయ్యి సేకరణలో 2020లో**

# నిబంధనలు మార్పు

**కల్తీ వ్యవహారంపై తొలుత తిరుపతి ఈస్ట్ పిఎస్‌లో కేసు**
**అసెంబ్లీలో కల్తీ లడ్డూ కేసు వివరాలు వెల్లడించిన ఆనం**

అమరావతి, నినాదం: తిరుమల లడ్డూ కల్తీ వ్యవహారంపై తొలుత తిరుపతి ఈస్ట్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైందని దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి తెలిపారు. అనంతరం సీనియర్ అధికారులతో ప్రత్యేక విచారణ బృందం ఏర్పాటైందని చెప్పారు. ఆ తర్వాత సీబీఐ డైరెక్టర్ పర్యవేక్షణలో సిట్‌ను పునర్ వ్యవస్థీకరించినట్లు వివరించారు. తిరుమల లడ్డూ కల్తీ అంశంపై శాసనసభలో నిర్వహించిన లఘు చర్చలో మంత్రి మాట్లాడారు. 2014నుంచి ఈ టెండర్ల ద్వారా అగ్‌మార్క్ స్పెషల్ ఆవు నెయ్యిని తితిదే సేకరిస్తోంది. కమిటీ సిఫార్సుల ఆధారంగా 2019లో టెండర్ నిబంధనలను బలోపేతం చేశారు. ఆ తర్వాత 2020లో సేకరణ నిబంధనలను మార్చారు. 5 నెలల వ్యవధిలోనే వాటిని సవరించినట్లు తేలింది. నిర్వహణ అనుభవాన్ని 3 ఏళ్ల నుంచి ఏడాదికి.. వార్షిక టర్నోవర్ అవసరాన్ని తగ్గించారు. తప్పనిసరి పాల సేకరణ నిబంధనను తొలగించారు. సమగ్ర అధ్యయనం, క్షేత్రస్థాయి పరిశీలన లేకుండా సడలింపు చేశారు. అనుభవం లేని డెయిరీల ప్రవేశానికి ఇది దోహదపడినట్లు సిట్ గమనించింది. భోలేబాబా, వైష్ణవి సంస్థలతో పాటు ఇతర నిందితుల డెయిరీలు తక్కువ ధరను కోట్ చేయడం ప్రారంభించాయి. భాగస్వామ్యాన్ని పెంచడమే లక్ష్యంగా పేర్కొన్నప్పటికీ బిడ్డర్ల సంఖ్య గణనీయంగా పెరగలేదు. కొన్ని నిర్దిష్ట సరఫరా దారులకు మాత్రమే అసమానంగా ప్రయోజనం చేకూర్చినట్లు ఈ సడలింపు ద్వారా తెలుస్తోంది‘అని ఆనం రామనారాయణ రెడ్డి వివరించారు.

# భారతదేశంలో పర్యావరణ... ఉద్యమాలు సూచనలు

**భారతదేశంలో పర్యావరణ ఉద్యమాలు 1990 నుంచి దేశమంతటా పర్యావరణానికి సంబంధించిన సంఘర్షణలు పోరాటాలు నిరసనలు, ఉద్యమాలు ఏర్పడుతూనే ఉన్నాయి. 1992 నుండి భారతదేశం లో పర్యావరణం వాదం ఒక వ్యవస్థిత ఉద్యమంగా కొనసాగుతుంది. దీనికంటే ముందు డిసెంబర్ 1984లో జరిగిన భోపాల్ దుర్ఘటన ప్రజలలో పారిశ్రామికీకరణ ఫలితాల పట్ల తీవ్రమైన భయాన్ని ఏర్పరిచింది. 1980లో భారత ప్రభుత్వం పర్యావరణ శాఖను స్థాపించింది. ఆ తర్వాత పర్యావరణం అడవుల మంత్రిత్వ శాఖ గా. 1997లో భారత అభివృద్ధి నివేదిక ప్రకారం దేశంలోని వివిధ ప్రాంతాలలో పర్యావరణ సమస్యలు తీవ్రమయ్యాయి. భారతదేశంలోని ప్రధాన పర్యావరణ సమస్యలు వాయు జల కాలుష్యాలు ముఖ్యంగా మెట్రోపాలిటన్ పారిశ్రామిక మండలాలలో వ్యర్థ పదార్థాలను వదిలివేయడం, సానిటేషన్ సౌకర్యాలు లేకపోవడం ఆరోగ్యం శిశు మరణాలు, చరణాల రేటు ప్రభావిత మవడమే గాక జీవవైవిద్యం దెబ్బతింటుంది.**

పర్యావరణ ఉద్యమాలు: 1. చిప్కో ఉద్యమం: ఉత్తరఖండ్లో 1970లో ప్రారంభమైంది. దీనిలో ప్రజలు పెద్ద ఎత్తున చెట్లను కౌగిలించుకొనుట ఈ ఉద్యమ ప్రారంభిక. ఉత్తరప్రదేశ్ లోని పౌరి చమోళి ఉత్తరకాశి డెహ్రాడూల్ అల్మోరాంఘర్ నైనాల్ అనే 8 జిల్లాల్లో వ్యాపించింది. ఈ ఉద్యమాన్ని జాతీయ అంతర్జాతీయ స్థాయిలలో ప్రచారమైన తొలి గ్రాస్ రూట్ ఉద్యమంగా చెప్పవచ్చు. ఉత్తరఖండ్లోని మూడు గ్రామాలలో వ్యవసాయ పనిముట్ల తయారు చేయడానికి చెట్లను కొట్టడానికి గ్రామస్తులకు అటవీశాఖ అనుమతి నిరాకరించడంతో ఈ ఉద్యమం ప్రారంభమైంది. 1973లో అలహాబాద్ లోని ఆటవస్తుల ఫ్యాక్టరీకి చెందిన కొందరి వ్యక్తులు పది చెట్లను కొట్టడానికి గోకేశ్వరికి వచ్చారు. గ్రామస్తులు దీన్ని వ్యతిరేకిస్తూ చెట్లను కొట్టకుండా వాటిని కౌగిలించుకున్నారు. ఇదే సంఘటన రాంపూర్ పటలులో కూడా జరిగింది .చెట్లను రక్షించడానికి గౌరీదేవి నాయకత్వంలో ఎందరో ఉద్యమించారు. సుందర్లాల్ బహుగుణ ఈ ఉద్యమానికి సారథ్యం వహించారు. హిమాలయ ప్రాంతంలో 15 సంవత్సరాల పాటు చెట్లు కొట్టరాదని ప్రభుత్వం నిషేధించడంతో ఈ ఉద్యమం విజయం సాధించింది.

అప్పికో ఉద్యమం: కర్ణాటకలోని కొన్ని ప్రాంతాలలో వాణిజ్య అడవులకు వ్యతిరేకంగా ఈ ఉద్యమం ఏర్పడింది. 8 సెప్టెంబర్ 1983లో లక్ష్మీనరసింహ యువక మండలి ఆధ్వర్యంలో సల్కనీ బెలెద్దే మొనోడు ఇతర ప్రాంతాల నుంచి స్త్రీ పురుషులు కాలుష్య కుదూర్ అడవికి 5 మైల్లు నడిచారు. చెట్లను కొట్టనివ్వకుండా వాటిని కౌగిలించుకున్నారు. అటవీశాఖ ప్రయోజనాల కోసం ఈ చెట్లను కొట్టవద్దని ఉత్తర్వులు జారీ చేసింది. గిరిజనుల వ్యతిరేకత తర్వాత ఈ చెట్లు కొట్టే ఉత్తర్వును రద్దు చేశారు. అడవిలోని చెట్లను ఎక్కువగా కొట్టడానికి ఉద్యమం ఆపగలిగింది. అప్పికో ఉద్యమం వాణిజ్య అడుగులకు వ్యతిరేకమైన ఒక అహింసా హితమైన ఉద్యమంగా గుర్తింపు పొందిందిం.

సైలెంట్ రివల్ వ్యాలీ ప్రాజెక్ట్: కేరళలోని పాల్గట్ జిల్లాలోని సైలెంట్ వ్యాలీలో కాంతి పూహ నదిపై ఈ ప్రాజెక్టును నిర్మించాలని భావించారు. దీనివల్ల 240 మెగావాట్ల విద్యుత్తు ఉత్పత్తి అవుతుందని పదివేల హెక్టార్ల భూమికి నీటి పారుదల లభిస్తుంది అని అంచనా. అయితే సైలెంట్ వ్యాలీలోని జీవవైవిద్యానికి వివిధ నశిస్తున్న మొక్కలు జంతువులకు ప్రాజెక్టు హానికరమని ప్రజలు ఎదురు తిరిగారు. ఈ ఉద్యమం ఈ ప్రదేశాన్ని జీవవైవిద్య రిజర్వుగా ప్రకటించి ఈ ప్రాజెక్టును వదిలివేయాలని ఒక కమిటీ డిమాండ్ చేస్తూ ప్రభుత్వానికి నివేదిక సమర్పించడంతో ఈ ఉద్యమం ప్రారంభమైంది.

తెహ్రిడాంకు వ్యతిరేక ఉద్యమం: ఉత్తరాంచల్లోని తెహ్రిలోని భగీరథి బిలంగన నదుల పై ప్రధాన డ్యామ్ నిర్మించాలని భావించారు. ఈ ప్రాజెక్టు ఎత్తు 260 మీటర్లు. విద్యుత్ శక్తి 350 మెగావాట్లు. ఇరిగేషన్ సౌకర్యం 27 వేల హెక్టార్లకు లభిస్తుందని అంచనా. అయితే 1985లో తెహరి బంద్ విరోధ సంఘర్షణ సమితి టీబీవీఎస్ఎస్ దీని సవాల్ చేస్తూ సుప్రీంకోర్టులో కేసు వేసింది. సుందర్ లాల్ బహుగుణ, వీరేంద్ర సక్లాని, ఈ ఉద్యమానికి సారథ్యం వహించారు. 1986లో యూనియన్‌కి చెందిన బృందం ఈ ప్రాంతాన్ని పరిశీలించి భూకంపాలు రావడానికి అవకాశం అన్న ప్రాంతమని పేర్కొన్నది. ఎన్విరానె్మంట్ అప్రైజల్ కమిటీ ఈ ప్రాజెక్టు ఆపేయాలని ఏకగ్రీవంగా భావించింది.

నర్మదా బచావో ఆందోళన్ : మధ్య భారత దేశంలోని నర్మదా నది లోతులో ఈ ప్రాజెక్టును తలపెట్టారు. ఈ ప్రాజెక్టులో 31 మేజర్ డ్యాములు 135 మీడియం 3 మైనర్ డ్యాములను నిర్మించాలని అంచనా. ఈ 31 మేజర్ డ్యామ్లలో మధ్యప్రదేశ్లోని నర్మదా సాగర్ ప్రాజెక్ట్ గుజరాత్ లోని సర్దార్ సరోవర్ ప్రాజెక్టు విమర్శలకు గురైంది. నర్మదావ్యాలి ప్రాజెక్టు మధ్య భారతదేశంలోని మధ్యప్రదేశ్ గుజరాత్ మహారాష్ట్రకు లాభాన్ని చేకూర్చుతుందని తెలుపుతారు. నర్మదా బచావో ఆందోళన్ మేధాపాట్కర్ ఆధ్వర్యంలో జరిగింది ఈ ప్రాజెక్టు నిర్మాణాన్ని వ్యతిరేకించింది మూడు రాష్ట్రాలలోని ప్రాజెక్టులకు వ్యతిరేకంగా అనేక ఉద్యమాలు కొనసాగాయి.

సర్దార్ సరోవర్ ప్రాజెక్టు: నర్మదా వాలి ప్రాజెక్టులో భాగంగా 1985లో సర్దార్ సర్వావర్ ప్రాజెక్టును గుజరాత్ పరిసర ప్రాంతాలలో నీటి వసతిపాదన వరదలు కరువ నియంత్రణ కోసం చేపట్టారు. ఈ ప్రాజెక్టు నిర్మాణంలో 245 గ్రామాలు ముంపునకు గురవుతాయి. వేలాది మంది గిరిజనులు నిర్వాసితులు అవుతారు. వేలాదిమంది అటవీ ఉపాధి కోల్పోతారు. దీనివల్ల రెండు లక్షల 50 వేల మందికి పునరావసం కల్పించాల్సి ఉంటుంది. నర్మదా గతి నవనిర్మాణ సమితి నర్మదా ధారణ గ్రస్త సమితి నర్మదా సందర్శన సమితి మధ్యప్రదేశ్ గుజరాత్ మహారాష్ట్రలోని లోక్ అధికార సంఘం లాంటి సంస్థలు 1985 నుంచి దీనికి వ్యతిరేకంగా ఉద్యమిస్తున్నారు. 1989 గ్రస్త సమితి మహారాష్ట్ర గతి నవనిర్మాణ సమితి నర్మదా అసిల్ గెలస్తా సంఘర్షణ సమితి మరికొన్ని సంస్థలు నర్మదా బచావ్ ఆందోళన(ఎన్బీఏ) అనే సంస్థగా విలీనమయ్యాయి .ఈ ఉద్యమానికి మేధా పట్కర్ సారధి. నిరాహార దీక్షలు పబ్లిక్ మీటింగ్లు ప్రదర్శనలు జల దీక్ష లాంటి అహింస ఉద్యమం పాటించి ఈ ఉద్యమాన్ని చేపట్టారు. బాబా ఆమ్టే సుందర్లాల్ బహుగుణ అరుంధతి రాయి వంటి స్పెషల్ యాక్టివేషన్ కార్యకర్తలు ఈ ఉద్యమంలో క్రియాశీలక పాత్ర పోషించారు. ఈ విధంగా భారత దేశంలోని ఇతర రాష్ట్రాల లోన డ్యాములకు వ్యతిరేకంగా ఆందోళనలు పోరాటాలు ఉద్యమాలు కొనసాగుతున్నాయి. కోయిల్ కరో (బీహార్ )సబర్నరేఖ (బీహార్) ఇచ్చంపల్లి( తెలంగాణ) పోలవరం (తెలంగాణ ఆంధ్ర ప్రదేశ్) లకు వ్యతిరేకంగా అనేక ఉద్యమాలు కొనసాగుతున్నాయి. ఈ విధంగా భారత దేశంలో పర్యావరణ ఉద్యమాలు పర్యావరణానికి సంబంధించిన సంఘర్షణలు పోరాటాలు నిరసనలు ఏర్పడుతూనే ఉన్నాయి. ఈ విధంగా దేశంలోని వివిధ ప్రాంతాలలో పర్యావరణ సమస్యలు తీవ్రమయ్యాయి. భారతదేశంలోని ప్రధాన పర్యావరణ సమస్యలు వాయువు జల కాలుష్యాలు ముఖ్యంగా మెట్రోపాలిటన్ పారిశ్రామిక మండలాలలో సరైన వ్యర్థ పదార్థాలను వదిలివేయడం సానిటేషన్ సౌకర్యాలు లేకపోవడంతో ఆరోగ్యం శిశు మరణాలు జననాల రేటు ప్రభావితమైన కాక జీవవైవిద్య దెబ్బతింటుంది. ఇది పేద వారికి జీవనోపాధి నశిస్తుంది. ఫలితంగా భారతదేశంలో పర్యావరణ ఉద్యమాల కు అంకురార్పణ జరిగింది.

**పందిరి శ్రీనివాసులు**
**ఎంఏ( జాగ్రఫీ) బిఈడి, ఎంసీజే (జర్నలిజం) పిజిడిసిజే (జర్నలిజం). ఉస్మానియా యూనివర్సిటీ**





# వెల్లుల్లి టీతో రక్తపోటు నియంత్రణ

వెల్లుల్లిలో అనేక ఔషధ గుణాలు ఉంటాయన్న సంగతి అందరికీ తెలిసిందే. దాదాపు అధిక శాతం మంది చేసే అన్ని రకాల వంటకాల్లోనూ దీనిని ఉపయోగిస్తూనే ఉంటారు. వెల్లుల్లి వంటలకు రుచిని పెంచడంతో పాటు ఆరోగ్యానికి కూడా ఎంతో మేలు చేస్తుంది. వెల్లుల్లిలో యాంటీ ఆక్సిడెంట్లతో పాటు అల్లిసిన్ అనే సమ్మేళనం ఉంటుంది. వెల్లుల్లి యాంటీ బ్యాక్టీరియల్, యాంటీ వైరల్ లక్షణాలను కూడా కలిగి ఉంటుంది. ఇన్ఫెక్షన్ లు దరి చేరకుండా ఉంటాయి. వెల్లుల్లిని తీసుకోవడం వల్ల జీర్ణశక్తి మెరుగుపడుతుంది. శరీర రోగనిరోధక శక్తి పెరుగుతుంది. గుండె జబ్బుల ప్రమాదం తగ్గుతుంది. ముఖ్యంగా రక్తపోటును అదుపులో ఉంచడంలో వెల్లుల్లి ఎంతో ప్రయోజనకరంగా ఉంటుంది.

**రక్తపోటు అదుపులో..**

వెల్లుల్లిని నేరుగా తినలేరు. ఇది చాలా ఘాటుగా ఉంటుంది. కనుక రక్తపోటుతో బాధపడే వారు వెల్లుల్లితో టీ తయారు చేసి తీసుకోవడం వల్ల మంచి ఫలితం ఉంటుంది. రక్తపోటుతో బాధపడే వారికి వెల్లుల్లి టీ ఏ విధంగా సహాయపడుతుందో ఇప్పుడు తెలుసుకుందాం. ధమనుల గోడలపై రక్తం బలం సాధారణం కంటే ఎక్కువగా ఉండే స్థితిని రక్తపోటు అంటారు. అధిక రక్తపోటును అదుపులో ఉంచడం చాలా అవసరం. దీనిని నియంత్రించకపోతే గుండెపోటు వచ్చే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. వెల్లుల్లిని తీసుకోవడం వల్ల రక్తపోటు అదుపులో ఉంటుంది. వెల్లుల్లిలో ఉండే అల్లిసిన్ రక్తపోటును తగ్గించడంలో సహాయపడుతుందని వైద్యులు చెబుతున్నారు. వెల్లుల్లిలోని సల్ఫర్ రక్తనాళాల్లో నైట్రిక్ఆక్సైడ్ ఉత్పత్తిని పెంచుతుంది. దీంతో రక్తనాళాలు వ్యాకోచించి రక్తపోటు తగ్గుతుంది. ధమనులు గట్టిపడడం, స్ట్రోక్ వంటి ప్రమాదాలు వచ్చే అవకాశం కూడా తగ్గుతుంది.

**ఎలా తయారు చేయాలంటే..**

480 మిల్లీగ్రాముల నుండి 960 మిల్లీగ్రాముల మోతాదులో వెల్లుల్లిని తీసుకున్న వారిలో సిస్టోలిక్ రక్తపోటు గణనీయంగా తగ్గిందని నిపుణులు అధ్యయనాల ద్వారా వెల్లడించారు. ఈ విధంగా వెల్లుల్లి రక్తపోటును తగ్గించడంలో ఎంతో సహాయపడుతుందని వైద్యులు చెబుతున్నారు. ఇక వెల్లుల్లి టీని తయారు చేసుకోవడం కూడా చాలా సులభం. దీని కోసం 3 వెల్లుల్లి రెబ్బలు, 3 కప్పుల నీరు తీసుకోవాలి. తరువాత ఒక గిన్నెలో నీరు పోసి అందులో వెల్లుల్లి రెబ్బలను దంచి వేసుకోవాలి. తరువాత ఈ నీటిని 4 నుండి 5 నిమిషాల పాటు మరిగించి స్టవ్ ఆఫ్ చేసుకోవాలి. తరువాత వడకట్టి అందులో రుచి కోసం తేనె లేదా నిమ్మరసం కలిపి తీసుకోవాలి. ఇలా తీసుకోవడం వల్ల రక్తపోటు అదుపులో ఉంటుంది. అంతేకాకుండా శరీర ఆరోగ్యానికి కూడా మేలు కలుగుతుందని వైద్యులు చెబుతున్నారు.

# స్ట్రాబెర్రీలో అద్భుతమైన పోషకాలు

***రోజూ స్ట్రాబెర్రీలను తినడం వల్ల కలిగే అద్భుతమైన లాభాలు ఇవే..! మన ఆరోగ్యానికి మేలు చేసే పండ్లలో స్ట్రాబెర్రీలు ఒకటి. ఇవి అనేక పోషకాలతో నిండి ఉంటాయి. వీటిని తీసుకోవడం వల్ల మన ఆరోగ్యానికి ఎంతో మేలు కలుగుతుంది. వీటిలో విటమిన్ సి, మాంగనీస్, ఫోలేట్, పొటాషియం వంటి పోషకాలతో పాటు యాంటీ ఆక్సిడెంట్లు, ఫైబర్ కూడా పుష్కలంగా ఉంటాయి.***



మన ఆరోగ్యానికి మేలు చేసే పండ్లలో స్ట్రాబెర్రీలు ఒకటి. ఇవి అనేక పోషకాలతో నిండి ఉంటాయి. వీటిని తీసుకోవడం వల్ల మన ఆరోగ్యానికి ఎంతో మేలు కలుగుతుంది. వీటిలో విటమిన్ సి, మాంగనీస్, ఫోలేట్, పొటాషియం వంటి పోషకాలతో పాటు యాంటీ ఆక్సిడెంట్లు, ఫైబర్ కూడా పుష్కలంగా ఉంటాయి. ఆక్సీకరణ ఒత్తిడిని తగ్గించడంలో, గుండె ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలో, మెదడు పనితీరును పెంచడంలో, జీర్ణక్రియకు ఇలా అనేక రకాలుగా స్ట్రాబెర్రీలు మనకు సహాయపడతాయి. ఆహారంలో భాగంగా స్ట్రాబెర్రీలను తీసుకోవడం వల్ల మనకు కలిగే ఆరోగ్య ప్రయోజనాల గురించి ఇప్పుడు తెలుసుకుందాం.

**గుండె ఆరోగ్యానికి..**

స్ట్రాబెర్రీల్లో విటమిన్ సి, ఆంథోసైనిన్లు, ఎలాజిక్ ఆమ్లం వంటి యాంటీ ఆక్సిడెంట్లు ఎక్కువగా ఉంటాయి. ఇవి శరీరానికి ఫ్రీరాడికల్స్ వల్ల కలిగే నష్టాన్ని తగ్గిస్తాయి. దీంతో గుండె జబ్బులు, క్యాన్సర్, మధుమేహం వంటి దీర్ఘకాలిక వ్యాధులు వచ్చే అవకాశం తక్కువగా ఉంటుంది. స్ట్రాబెర్రీలను తీసుకోవడం వల్ల శరీరంలో రోగనిరోధక శక్తి పెరుగుతుంది. ఇన్ఫెక్షన్ లతో పోరాడే సామర్థ్యం పెరుగుతుంది. స్ట్రాబెర్రీల్లో ఫైబర్, ఫ్లేవనాయిడ్లు, పొటాషియం వంటి పోషకాలు ఉంటాయి. ఇవి గుండె ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయి. వీటిని తీసుకోవడం వల్ల రక్తపోటు అదుపులో ఉంటుంది. గుండె జబ్బుల ప్రమాదం తగ్గుతుంది. గుండె ఆరోగ్యం మెరుగుపడుతుంది. అలాగే స్ట్రాబెర్రీల్లో మెదడు ఆరోగ్యాన్ని మెరుగుపరిచే సమ్మేళనాలు ఉన్నాయి. ఇవి మెదడు ఆక్సీకరణ ఒత్తిడిని తగ్గించి ఫ్రీరాడికల్స్ వల్ల మెదడు కణాలు దెబ్బతినకుండా కాపాడడంలో సహాయపడతాయి. దీంతో అభిజ్ఞా క్షీణత ప్రమాదం తగ్గుతుంది. దీర్ఘకాలిక మెదడు సంబంధిత సమస్యలు వచ్చే అవకాశాలు కూడా తక్కువగా ఉంటాయి.



**కంటి సమస్యలకు..**

అదే విధంగా స్ట్రాబెర్రీలను తీసుకోవడం వల్ల కంటి ఆరోగ్యం మెరుగుపడుతుంది. వయసు పైబడడం వల్ల వచ్చే మాక్యులర్ క్షీణత ప్రమాదం తగ్గుతుంది. దృష్టి సంబంధిత సమస్యలు రాకుండా ఉంటాయి. స్ట్రాబెర్రీల్లో శోథ నిరోధక సమ్మేళనాలు ఉంటాయి. ఇవి శరీరంలో దీర్ఘకాలిక వాపులను తగ్గించడంలో సహాయపడతాయి. స్ట్రాబెర్రీల్లో క్యాలరీలు తక్కువగా ఉంటాయి. ఫైబర్ ఎక్కువగా ఉంటుంది. కనుక వీటిని తీసుకోవడం వల్ల కడుపు నిండిన భావన కలుగుతుంది. తద్వారా శరీర బరువు కూడా అదుపులో ఉంటుంది. బరువు తగ్గాలనుకునే వారు స్ట్రాబెర్రీలను తీసుకోవడం వల్ల మంచి ఫలితం ఉంటుంది. అలాగే స్ట్రాబెర్రీలు తక్కువ గ్లైసెమిక్ ఇండెక్స్ ను కలిగి ఉంటాయి. కనుక వీటిని తీసుకోవడం వల్ల రక్తంలో చక్కెర స్థాయిలు వేగంగా పెరగకుండా ఉంటాయి. ఇక స్ట్రాబెర్రీల్లో ఫైబర్ అధికంగా ఉంటుంది. కనుక వీటిని తీసుకోవడం వల్ల జీర్ణక్రియ మెరుగుపడుతుంది. ప్రేగు కదలికలు మెరుగుపడతాయి. మలబద్ధకం తగ్గుతుంది. ఈ విధంగా స్ట్రాబెర్రీలు మన ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయని వీటిని తీసుకోవడం వల్ల మన ఆరోగ్యానికి ఎంతో మేలు కలుగుతుందని వైద్యులు చెబుతున్నారు.

# సమతుల్య శక్తికి అరటి పండ్లు.. ఖర్జూరాలు



వ్యాయామం చేయడానికి ముందు, చేసిన తరువాత అలాగే కొన్ని సందర్భాల్లో శరీరానికి తక్షణ శక్తి అవసరమవుతుంది. తక్షణ శక్తి అవసరమైన సందర్భాల్లో చాలా మందికి వెంటనే గుర్తుకు వచ్చేవి అరటిపండ్లు, ఖర్జూరాలు. ఇవి సరసమైన ధరల్లో లభించడంతో పాటు తీసుకువెళ్లడం కూడా చాలా సులభం. ఇవి కార్బోహైడ్రేట్లతో నిండి ఉంటాయి. శరీరం శక్తి కోసం వీటిని గ్లూకోజ్ గా మారుస్తాయి. దీంతో మనకు తక్షణ శక్తి లభిస్తుంది. అయితే ఖర్జూరం, అరటిపండ్లల్లో తక్షణ శక్తి ఇవ్వడంలో ఏవి బాగా పని చేస్తాయి. శక్తి వేటిలో ఎంత త్వరగా విడుదల అవుతుంది, శక్తి ఎంతకాలం ఉంటుంది.. వంటి విషయాల గురించి ఇప్పుడు తెలుసుకుందాం.

**ఖర్జూరాల్లో శక్తి అధికం..**

ఖర్జూరాలు చిన్నవిగా ఉంటాయి. కానీ చాలా శక్తివంతంగా పనిచేస్తాయి. గ్లూకోజ్, ఫ్రక్టోజ్ వంటి సహజ చక్కెరలు వీటిలో అధికంగా ఉంటాయి. ఇవి నీటి శాతాన్ని తక్కువగా కలిగి ఉంటాయి. కనుక పోషకాలు కేంద్రీకృతమై ఉంటాయి. ఇవి సులభంగా జీర్ణమవుతాయి. కనుక శరీరం వీటిని త్వరగా గ్రహిస్తుంది. ఇక వీటిని వ్యాయామాలకు ముందు, దీర్ఘ వ్యాయామాలలు లేదా క్రీడల సమయంలో, శరీరానికి త్వరగా శక్తి అవసరమైనప్పుడు తీసుకోవచ్చు. ఇవి శరీర బరువును అంతగా పెంచవు కానీ శక్తిని అందిస్తాయి కనుక అథ్లెట్లు వీటిని ఎక్కువగా తీసుకుంటూ ఉంటారు.

**సమతుల్య శక్తికి అరటి పండ్లు..**

అలాగే అరటిపండ్ల విషయానికి వస్తే ఇవి సమతుల్య శక్తిని అందిస్తాయి. ఇవి అందించే శక్తి ఎక్కువ కాలం పాటు ఉంటుంది. అరటిపండ్లు సాధారణ, సంక్లిష్ట కార్బోహైడ్రేట్ల మిశ్రమం. వీటిలో నీటి శాతం, ఫైబర్ ఎక్కువగా ఉంటుంది కనుక ఇవి నెమ్మదిగా జీర్ణమవుతాయి. వ్యాయామానికి 30 నుండి 60 నిమిషాల ముందు వీటిని తీసుకోవడం మంచిది. అరటిపండ్లు శక్తి స్థాయిలను త్వరగా గరిష్ట స్థాయికి చేరుకోకుండా స్థిరంగా ఉంచడంలో సహాయపడతాయి. ఖర్జూరాలు తక్షణ శక్తిని అందిస్తాయి. అరటిపండ్లు మితమైన, స్థిరమైన శక్తిని అందిస్తాయి.






# బ్యాంకులు ప్రధాన వ్యాపారంపై దృష్టి పెట్టాలి

## మిస్–సెల్లింగ్‌కు దూరంగా ఉండాలి: ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్

వినియోగదారులకు బీమా వంటి ఆర్థిక ఉత్పత్తులను తప్పుడు వివరాలతో బ్యాంకుల్లోనే విక్రయించడం (మిస్–సెల్లింగ్)పై ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. 'బ్యాంకులు తమ ప్రధాన వ్యాపారంపై దృష్టి పెట్టాలి. అవసరం లేకపోయినా బీమా ఉత్పత్తులు విక్రయించడానికే బ్యాంకులు ఎక్కువ సమయం కేటాయిస్తున్నాయి. బ్యాంకుల నియంత్రణ సంస్థ ఆర్‌బీఐ, బీమా నియంత్రణ సంస్థ ఐఆర్‌డీఏఐ మధ్య ఉన్న నిర్వహణ పరమైన దూరం వల్ల ఎవరికీ జవాబుదారీతనం లేకుండా పోయింది' అని పేర్కొన్నారు. బడ్జెట్ తర్వాత నిర్వహించిన రిజర్వ్‌బ్యాంక్ (ఆర్‌బీఐ) సెంట్రల్ బోర్డ్ సమావేశం అనంతరం ఆర్థిక మంత్రి విలేకరులతో మాట్లాడారు. మిస్–సెల్లింగ్‌ను ఉపేక్షించేది లేదంటూ ఆర్‌బీఐ ఇచ్చిన ముసాయిదా మార్గదర్శకాలపై సంతోషంగా ఉందన్నారు. 'ఇకపై ఇలాంటి పనులు చేయలేరు అనే సందేశం బ్యాంకులకు వెళ్లాలి' అని మంత్రి పేర్కొన్నారు. బ్యాంకులు డిపాజిట్లు, రుణాలపైనే దృష్టి సారించాలని ఆమె సూచించారు. గృహరుణం తీసుకునేందుకు ఇల్లు/స్థలం తాకట్టు పెడుతుండగా, మళ్లీ బీమా తీసుకోమనీ బ్యాంకులు ఒత్తిడి చేస్తుండటాన్ని మంత్రి ప్రశ్నించారు.

**పీఎస్‌బీల విలీన ప్రణాళిక ప్రస్తుతం లేదు**

ప్రభుత్వరంగ బ్యాంకు (పీఎస్‌బీ)ల విలీనం కోసం ప్రభుత్వం వద్ద ప్రస్తుతానికి ప్రణాళికేమీ లేదని ఆర్థిక మంత్రి స్పష్టం చేశారు. వికసిత్ భారత్ కోసం బ్యాంకింగ్‌పై నియమించిన ఉన్నతస్థాయి కమిటీ నివేదిక ఇచ్చాక, ఈ రంగాన్ని మరింత పటిష్ఠం చేసే చర్యలు తీసుకుంటామని వివరించారు.
పసిడి దిగుమతులను నిశితంగా గమనిస్తున్నాం
ప్రపంచవ్యాప్తంగా కేంద్ర బ్యాంకులు భారీగా కొనుగోళ్లు చేస్తుండటం వల్లే పసిడి, వెండి ధరలు పెరుగుతున్నాయని నిర్మలా సీతారామన్ పేర్కొన్నారు. విలువైన లోహాల దిగుమతులను ప్రభుత్వం, రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బీఐ) సునిశితంగా గమనిస్తున్నాయని, ప్రస్తుతం ఇవి 'ఆందోళనకర స్థాయి'లో ఏమీ లేవని అన్నారు. ఆభరణాల రూపంలో లేదా ఆస్తిగా



భారతీయ కుటుంబాలకు బంగారం ఎప్పుడూ ఇష్టమైన పెట్టుబడి అని, దేశీయ అవసరాల కోసం మన దేశం పసిడిని దిగుమతి చేసుకుంటోందని మంత్రి స్పష్టం చేశారు. పండగల సీజన్, అక్షయ తృతీయ వంటి సమయాల్లో దేశీయంగా పసిడికి గిరాకీ పెరుగుతుందన్నారు.

**అయిదేళ్లలో రూ.10 లక్షల కోట్ల ఆస్తుల నగదీకరణ**

రాబోయే అయిదేళ్లలో ప్రజా ఆస్తుల నగదీకరణ (ఎన్ఎంపీ) ద్వారా, రూ.10 లక్షల కోట్లు సమీకరించాలని నిర్ణయించినట్లు నిర్మలా సీతారామన్ తెలిపారు. ఇందుకోసం ఎన్ఎంపీ –2ను ఆమె ప్రకటించారు. 2021లో ప్రకటించిన ఎన్ఎంపీ–1 కింద 2022–25లో రూ.6 లక్షల కోట్లు సమీకరించాలని నిర్ణయించగా, అందులో 89 శాతానికి సమానంగా రూ.5.3 లక్షల కోట్లు ఖజానాకు చేరాయన్నారు.

# భారీ నష్టాల్లో ముగిసిన దేశీయ స్టాక్ మార్కెట్లు

**మార్కెట్లపై ట్రంప్ దెబ్బ... కుప్పకూలిన సెన్సెక్స్**




**1068 పాయింట్లు పతనమైన సెన్సెక్స్**

**288 పాయింట్లు కోల్పోయిన నిఫ్టీ**

**రెండేళ్ల కనిష్ఠ స్థాయికి పడిపోయిన ఐటీ రంగ షేర్లు**

అమెరికా వాణిజ్య విధానాలపై తాజాగా తలెత్తిన ఆందోళనలతో దేశీయ స్టాక్ మార్కెట్లు మంగళవారం భారీ నష్టాలను చవిచూశాయి. గత నాలుగు రోజుల్లో ఎన్నడూ లేనంతగా అమ్మకాల ఒత్తిడి పెరగడంతో సూచీలు కుప్పకూలాయి. బ్యాంకింగ్, ఇన్‌ఫ్రా, ఐటీ రంగ షేర్లలో భారీ అమ్మకాలు జరగడంతో సెన్సెక్స్ 1,068.74 పాయింట్లు నష్టపోయి 82,225.92 వద్ద ముగిసింది. నిఫ్టీ 288.35 పాయింట్లు తగ్గి 25,424.65 వద్ద స్థిరపడింది.

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కొత్తగా 15 శాతం తాత్కాలిక టారిఫ్‌లు విధిస్తామని హెచ్చరించడంతో ప్రపంచవ్యాప్తంగా వాణిజ్య ఉద్రిక్తతలు మళ్లీ రాజుకుంటాయన్న భయాలు మొదలయ్యాయి. గతంలో ఆయన విధించిన టారిఫ్‌లు చట్టవిరుద్ధమని అమెరికా సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చినప్పటికీ, ట్రంప్ తాజా హెచ్చరికలు చేయడంతో అంతర్జాతీయ మార్కెట్ల సెంటిమెంట్ దెబ్బతింది. దీని ప్రభావం భారత మార్కెట్లపై కూడా ప్రతికూలంగా పడింది.

ఈ అమ్మకాల ఒత్తిడిలో ఐటీ షేర్లు అత్యధికంగా నష్టపోయాయి. అమెరికా టెక్నాలజీ వ్యయంపై ఆందోళనలు, బలహీనమైన గ్లోబల్ సంకేతాలతో నిఫ్టీ ఐటీ ఇండెక్స్ 4.74 శాతం పతనమై 30,053.50 వద్ద ముగిసింది. ట్రేడింగ్ సమయంలో ఈ సూచీ రెండేళ్ల కనిష్ఠ స్థాయిని కూడా తాకింది. ఐటీ తర్వాత రియాల్టీ రంగం 2.54 శాతం నష్టపోయింది. అయితే, మెటల్ ఇండెక్స్ మాత్రం మార్కెట్ పతనంలోనూ కాస్త మెరుగ్గా నిలిచింది.

విశ్లేషకుల ప్రకారం, నిఫ్టీకి 25,500–25,600 స్థాయి కీలక నిరోధకంగా ఉంది. దీనిపైన నిలదొక్కుకుంటేనే మార్కెట్ పుంజుకునే అవకాశం ఉంటుంది. ఒకవేళ 25,300 స్థాయికి దిగువకు పడిపోతే, అమ్మకాల ఒత్తిడి మరింత పెరగవచ్చని భావిస్తున్నారు. ప్రపంచవ్యాప్తంగా నెలకొన్న అనిశ్చితి, ఏఐ టెక్నాలజీపై ఆందోళనల కారణంగా మార్కెట్లు సమీప భవిష్యత్తులో అస్థిరంగానే కొనసాగవచ్చని నిపుణులు అంచనా వేస్తున్నారు.

# ప్రైవేటు రంగానికి నిధుల లభ్యత: ఆర్‌బీఐ

జీడీపీలో ప్రభుత్వ నికర రుణభారం 2026–27 ఆర్థిక సంవత్సరంలో 3 శాతానికి తగ్గనుండడంతో.. ప్రైవేటు రంగానికి నిధుల లభ్యత పెరగనున్నట్లు ఆర్‌బీఐ బులెటిన్ తెలిపింది. 2026–27 బడ్జెట్‌లో ప్రభుత్వం స్థూల రుణ సమీకరణను రూ.17.3 లక్షల కోట్లుగా.. నికర రుణ సమీకరణ జీడీపీలో 3 శాతంగా పేర్కొనడాన్ని ప్రస్తావించింది. ఇది క్రమంగా కరోనా ముందస్తు స్థాయిలకు తగ్గించుకోవడంగా ఆర్‌బీఐ బులెటిన్ పేర్కొంది. రూ.17.3 లక్షల కోట్ల స్థూల రుణ సమీకరణ అంచనాలకు మించి ఉందని, ప్రైవేటు రంగానికి నిధుల లభ్యత తగ్గుతుందంటూ ఓ వర్గం ప్రజల్లో నెలకొన్న ఆందోళలను ఈ సందర్భంగా ప్రస్తావించింది. ఆర్‌బీఐ డేటా ప్రకారం 2019–20లో జీడీపీలో ప్రభుత్వ నికర మార్కెట్ రుణ సమీకరణ రూ.4.73 లక్షల కోట్లు (2.4 శాతం)గా ఉండడం గమనార్హం. 2020–21లో కరోనా విపత్తు కారణంగా ఏకంగా రూ.10.33 లక్షల కోట్లకు పెరిగింది. కరోనా




ముందస్తు స్థాయిలకు నికర మార్కెట్ రుణ సమీకరణ తగ్గించుకుంటున్నందున ప్రైవేటు రంగానికి నిధుల లభ్యత పెరుగుతుందని, ఆర్థిక మార్కెట్లపై ఒత్తిడి తగ్గుతుందని ఆర్‌బీఐ బులెటిన్ స్పష్టం చేసింది. ఇక 2024–25 ప్రభుత్వ నికర మార్కెట్ రుణ సమీకరణ జీడీపీలో 3.5 శాతం (రూ.11.63 లక్షల కోట్లు), 2025–26లో 3.2 శాతం (రూ.11.32 లక్షల కోట్లు) చొప్పున ఉండడం గమనార్హం.

# భారీగా పడిపోయిన వెండి ధరలు

## వినియోగదారులకు భారీ ఊరట




హైదరాబాద్ బులియన్ మార్కెట్‌లో వెండి ధర భారీగా పతనమై వినియోగదారులకు కాస్త ఊరటనిచ్చింది. హైదరాబాద్ బులియన్ మార్కెట్‌లో మంగళవారం ధరలు ఊహించని విధంగా పతనమయ్యాయి. ఒక్క రోజులోనే వెండి కేజీపై ఏకంగా రూ.15,000 తగ్గింది. ఇక బంగారం ధరలు మాత్రం స్వల్ప పెరుగుదలను నమోదు చేశాయి. 24 క్యారెట్ల స్వచ్ఛమైన 10 గ్రాముల మేలిమి బంగారం ధర రూ.430 పెరిగి రూ.1,61,780కి చేరింది. ఇక ఆభరణాలలో వినియోగించే 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం రూ.400 మేర పెరిగి రూ.1,48,300 వద్ద కొనసాగుతోంది. గత కొన్ని రోజులుగా ఆకాశమే హద్దుగా పెరుగుతూ వచ్చిన వెండి ధర భారీగా దిగివచ్చింది. సోమవారం ధరతో పోలిస్తే ఇప్పుడు కేజీ వెండి రూ.2,85,000 వద్ద పలుకుతోంది. వెండి ఆభరణాలు కొనేవారికి, పెట్టుబడిదారులకు ఇది పెద్ద ఊరట అని చెప్పవచ్చు. అంతర్జాతీయ మార్కెట్‌లో చోటుచేసుకుంటున్న పరిణామాల ప్రభావం దేశీయ బులియన్ మార్కెట్‌పై స్పష్టంగా కనిపిస్తోంది. పసిడి ప్రియులు కొనుగోలు చేసే ముందు తాజా ధరలను ఒకసారి సరిచూసుకోవడం మంచిదని బిజినెస్ ఎక్స్‌పర్ట్స్ సూచిస్తున్నారు.

# స్పెషల్ సీమ చింతకాయలు..

## ఎక్కడైనా కనిపిస్తే అసలు వదలకండి.. తింటే కలిగే ఆరోగ్య ప్రయోజనాలు తెలిస్తే..





సీమచింతతో ఆరోగ్య ప్రయోజనాలు అనేకం ఉన్నాయి. ముఖ్యంగా బరువు తగ్గాలనుకునేవారికి మంచి ప్రత్యామ్నాయం అంటున్నారు ఆరోగ్య నిపుణులు. విటమిన్-సి సమృద్ధిగా ఉన్నందువల్ల సీమ చింతకాయ తింటే శరీరానికి అవసరమైన రోగనిరోధక శక్తి పెరుగుతుంది. ఇన్ఫెక్షన్ల నుంచి కాపాడుతుంది. ఇందులో విటమిన్, ఎ, బి, సిలతో పాటు మెగ్నీషియం, ఐరన్ ఇంకా ఇతర పోషకాలు పుష్కలంగా వుంటాయి. సీమ చింతలో ఫైబర్ పుష్కలంగా ఉంటుంది. విటమిన్- సి, ఎ, పొటాషియం, ఐరన్ లాంటి అనేకానేక విటమిన్లు, మినరల్స్ ఇందులో ఉన్నాయి. ఇందులోని డైటరీ ఫైబర్ జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది. మలబద్ధకాన్ని నివారిస్తుంది. జ్ఞాపకశక్తిని పెంచి, ఏకాగ్రతను కలిగించే గుణం వీటిలో వున్నాయి. చీమ చింతకాయలను మధుమేహులు కూడా తగు మోతాదులో తింటే ఏమి కాదంటున్నారు నిపుణులు. సీమ చింతకాయలలో గ్లైసిమిక్ ఇండెక్స్ తక్కువ. కాబట్టి, రక్తంలో చక్కెర స్థాయులను త్వరగా పెంచదు. అలా డయాబెటిస్ ఉన్నవారికీ సీమచింత మంచి ఆహారమే. బరువు తగ్గాలనుకునేవారికి చీమచింతకాయలు మంచి ఆహారం అంటున్నారు. చీమచింతలో క్యాల్షియం నిల్వలున్న కారణంగా ఎముక బలానికి ఉపయోగపడతాయి. మానసిక ఒత్తిడితో బాధపడేవారికి చీమ చింతకాయలు ఔషధంలా పనిచేస్తాయి. మోతాదుకి మించి వీటిని తింటే జీర్ణ సమస్యలు తలెత్తవచ్చు. సీమ చింతకాయలో విటమిన్-ఎ ఉంటుంది. దీంతో కంటిచూపు మెరుగ్గా ఉండేలా చూస్తుంది. కేలరీలు తక్కువ, ఫైబర్ ఎక్కువ. అలా బరువు తగ్గాలనుకునేవారికి సీమచింత మంచి ప్రత్యామ్నాయం. గర్భిణీలు, బాలింతలు వీటిని తినకుండా వుండటమే మంచిదని చెబుతున్నారు. వగరుగా వుండే చీమచింతకాయలు తింటే గొంతు పట్టుకుంటుంది కనుక వాటిని తినకూడదని చెబుతున్నారు.

## బాదం పప్పు నానబెట్టి తింటే మంచిదా? లేదంటే పచ్చిగా తింటే మంచిదా?



చాలా మందికి రోజూ ఉదయాన్నే నానబెట్టిన బాదంపప్పు తినడం అలవాటు. అయితే బాదంపప్పు నానబెట్టి తింటే మంచిదా.. లేదంటే అలాగే పచ్చిగా తింటే మంచిదా అనే సందేహం కూడా చాలా మందిలో ఉంటుంది. బాదంపప్పు తినడం వల్ల ఆరోగ్యానికి ఎంతో మేలు జరుగుతుంది. కానీ మీరు సరైన పద్ధతిలో తింటేనే ప్రయోజనాలు పొందవచ్చు. కాబట్టి బాదంపప్పును పచ్చిగా తినాలా? నానబెట్టి ఎలా తినాలా అనే విషయం ఇప్పుడు తెలుసుకుందాం.. బాదంలో విటమిన్లు, ఖనిజాలు, ఆరోగ్యకరమైన కొవ్వులు, ఫైబర్ పుష్కలంగా ఉంటుంది. అంతేకాకుండా బాదంలో కాల్షియం, ఫాస్పరస్ కూడా ఉన్నాయి. ఇవి శరీరానికి పోషకాలను అందిస్తాయి. బాదం పప్పును ఉదయాన్నే పరగడుపున తీసుకుంటే ప్రయోజనాలు పొందవచ్చు. ఇందుకోసంరాత్రి పడుకునే ముందు కొన్ని బాదంపప్పులను నీళ్లతో వేసి నానబెట్టాలి. తర్వాతవాటిని తొక్క తీసి ఉదయం పూటా ఖాళీ కడుపుతో తినాలి. అలాగే బాదంపప్పును స్నాక్‌గా కూడా తినవచ్చు. పచ్చి వాటి కంటే నానబెట్టిన బాదం శరీరానికి ఎక్కువ మేలు చేస్తుంది. అలాగే బాదం షేక్ చేసి కూడా తాగొచ్చు. కానీ బాదంలో కేలరీలు ఎక్కువగా ఉంటాయి. అందువల్ల బరువు పెరగడానికి దారితీయవచ్చు. అందుకే వీటిని పరిమితంగా మాత్రమే తీసుకోవాలి.నట్‌ఎలర్జీ ఉన్నవారు వాటిని తీసుకునే ముందు వైద్యుడిని సంప్రదించడం మర్చిపోకూడదు. ఎలర్జీ ఉన్న వారు వీటికి దూరంగా ఉండటం బెటర్.



## కొబ్బరి నీళ్లు ఏ టైమ్‌లో తాగాలి..?

## డాక్టర్లు ఏం చెబుతున్నారంటే





సమ్మర్ సీజన్‌లో ఇష్టమైన పండ్లు తింటే ఆ మజాయే వేరు. మామిడి పండ్లు, ముంజలను తినడానికి చాలామంది ఇష్టం చూపుతారు. అయితే వేసవిలో శరీరాన్ని హైడ్రేట్‌గా ఉంచుకోవడం చాలా ముఖ్యం కూడా. అందుకే బాడీని కూల్ చేసే వాటిని తీసుకోవాలి. అందులో మొదటిది కొబ్బరినీళ్లు. ఒక కొబ్బరి బోండం నీళ్లు తాగితే రోజంతా హుషారుగా ఉండవచ్చు. అదే సమయంలో బాడీని కూల్ చేస్తుంది కూడా. కొబ్బరి నీళ్లలో కాల్షియం, మాంగనీస్ లాంటివి ఉంటాయి. సమ్మర్‌లో కొబ్బరి నీళ్లు తాగడం వల్ల అనేక రకాల బెనిఫిట్స్ ఉన్నాయి. అయితే చాలామంది సమయ పాలన లేకుండా కొబ్బరి నీళ్లు తాగుతుంటాయి. అయితే సమయంలో తాగడం అనేది కూడా తెలుసుకోవాలి. కొబ్బరినీళ్లు ఏ సమయంలో తాగాలి అనే ప్రశ్న చాలమంది ఉంది. కొంతమంది ఖాళీ కడుపుతో తీసుకుంటే.. మరికొందరు మధ్యాహ్నం తాగడం మంచిదని భావిస్తుంటారు. ఈ విషయమై జైపూర్‌కు చెందిన డైటీషియన్ మాట్లాడుతూ భోజనంతో లేదా తర్వాత అసలు తాగకూడు. గుండెల్లో మంట సమస్య ఉన్నవారు ఖాళీ కడుపుతో కొబ్బరి నీటిని తాగాలి. అయితే, ఖాళీ కడుపుతో ఈ హెల్తీ డ్రింక్ తాగడం వల్ల అనేక ఇతర ప్రయోజనాలు ఉన్నాయి. ఉదయాన్నే తాగడం వల్ల జీవక్రియ పెరుగుతుంది. అంతేకాదు బరువును తగ్గిస్తుంది కూడా. కడుపు ఆరోగ్యంగా ఉంటే శరీరం అనేక వ్యాధులు, ఇతర అనారోగ్య సమస్యల నుండి రక్షించబడుతుంది. అయితే సమస్యలతో భాధపడేవారు నిపుణుల సలహా మేరకు మధ్యాహ్నం కూడా తాగవచ్చు. సమ్మర్ సీజన్ కాబట్టి కొబ్బరి నీరు తీసుకోవడం ముఖ్యం. కానీ కిడ్నీ సంబంధిత ఆరోగ్య సమస్యలతో బాధపడేవారు కొబ్బరినీళ్లు తాగకూడదు. ఇది అధిక మొత్తంలో పొటాషియం ఉంటుంది కాబట్టి మూత్రపిండాలు దెబ్బతినే ప్రమాదం పెరుగుతుంది. అలాంటివారు డాక్టర్ల సలహా తీసుకోవాల్సి ఉంటుంది.

## ఆరోగ్యానికి మేలు చేసే సోంపు షర్బత్..

### శరీర ఉష్ణోగ్రతను ఇసులా కరిగించే సూపర్ డ్రింక్ మీ కోసం..





ఎండ వేడిమి రోజురోజుకూ పెరుగుతోంది. ఏసీలు, కూలర్లు, శీతల పానీయాల వినియోగం పెరిగింది. ఐస్‌క్రీమ్‌ల నుండి స్మూతీస్ వరకు, లస్సీ నుండి ఇంట్లో తయారుచేసిన నిమ్మరసం, మజ్జిగ వరకు అందరూ ఆరోగ్యకరమైన, శరీరానికి చలువ చేసే ఆహారాన్ని కోరుకుంటున్నారు.. బాటిల్, రిఫ్రిజిరేటెడ్ పానీయాలు కెమికల్ ఆధారంగా తయారు చేస్తారు. కాబట్టి అవి వాటి ప్రత్యేక రుచిని కలిగి ఉంటాయి. కానీ, ఇంట్లో తయారుచేసిన జ్యూస్‌లు మరింత రుచిని కలిగి ఉంటాయి. అలాంటిదే వేసవిలో మనకు చలువు చేసే ఒక పానీయం ఉంది. ఇంట్లోనే ఈజీగా తయారు చేసుకోగల ఈ షర్బత్ ఎండవేడిమి, మంటను తగ్గించి మిమ్మల్నీ కూల్‌గా ఉంచుతుంది. అదేంటో ఇక్కడ తెలుసుకుందాం. సాధారణంగా మనమందరం సోంపును మౌత్ ఫ్రెషనర్‌గా ఉపయోగిస్తాము. చాలా మంది దీనిని వివిధ డెజర్ట్‌లకు కూడా కలుపుతారు. సోంపు షర్బత్ అనేది ప్రజలందరికీ ఎంతగానో నచ్చే చల్లని జ్యూస్. ఇది సాధారణంగా పసుపు రంగులో ఉంటుంది. దాని ప్రత్యేకమైన రుచి, వాసనకు పేరుగాంచింది. ఇది వేసవిలో చాలా ఉపయోగకరంగా ఉంటుంది. దీన్ని తయారు చేయడానికి ఎక్కువ శ్రమపడాల్సిన అవసరం కూడా ఉండదు. ఇది శరీరంలోని వేడి నుండి ఉపశమనాన్ని అందజేయడమే కాకుండా ఆరోగ్య ప్రయోజనాలను అందిస్తుంది. సోంపు షర్బత్‌ను తయారు చేయడానికి ప్రధాన పదార్థాలు సోంపు గింజలు, నిమ్మకాయ రసం, చక్కెర, నీరు. ఇకపోతే, ముందుగా ఈ సోంపు ఆరోగ్య ప్రయోజనాలను పరిశీలించినట్టయితే.. 1. జీర్ణక్రియలో.. ఇది జీర్ణక్రియను ప్రోత్సహించడానికి వేసవి కాలంలో శరీరాన్ని చల్లబరచడానికి సహాయపడుతుంది. కడుపు ఉబ్బరం, గ్యాస్, అజీర్ణం వంటి జీర్ణ సమస్యలను తగ్గించడంలో సహాయపడే లక్షణాలను కలిగి ఉన్నాయి. ఇవి జీర్ణ ఎంజైమ్‌ల ఉత్పత్తిని ప్రేరేపిస్తాయి. ఇవి మంచి జీర్ణక్రియకు సహాయపడతాయి. అందుకే మనం ఎప్పుడు హొటల్ కి డిన్నర్ కి వెళితే భోజనం అయ్యాక సోంపు అందిస్తారు. 2 . ఫ్రెషెన్స్ బ్రీత్ .. యాంటీమైక్రోబయల్ లక్షణాలను కలిగి ఉన్నాయి. దీని కారణంగా సోంపు నమలడం వల్ల శ్వాసను తాజాగా ఉంచుతుంది. ఇది లాలాజల ఉత్పత్తిని ప్రేరేపిస్తుంది. ఇది నోటిలోని బ్యాక్టీరియాను తొలగించేందుకు సహాయపడుతుంది. 3. మలబద్ధకం కోసం ప్రయోజనకరమైన.. సోంపు తేలికపాటి భేదిమందు లక్షణాలను కలిగి ఉంటుంది. ఫైబర్ అధికంగా ఉండటం వల్ల ఇది ప్రేగు కదలికను ప్రేరేపిస్తుంది. ఇది మలబద్ధకం నుండి ఉపశమనాన్ని అందించడంలో సహాయ పడుతుంది. 4. కడుపులో మంటను తగ్గిస్తుంది.. కడుపులో గ్యాస్‌ను తొలగించడంలో సహాయపడే కార్మినేటివ్ లక్షణాలను కలిగి ఉంటుంది. జీర్ణాశయంలోని కండరాలను సడలించడం, గ్యాస్ ఉత్పత్తిని తగ్గించడం ద్వారా ఉబ్బరం, కడుపులో అసౌకర్యాన్ని తగ్గించడంలో సోంపు బాగా సహాయపడుతుంది. 5. యాంటీ ఆక్సిడెంట్ గుణాలు.. సోంపు శరీరంలోని హానికరమైన ఫ్రీ రాడికల్స్‌ను తటస్తం చేయడంలో సహాయపడే ఫ్లేవనాయిడ్లు, ఫినోలిక్స్ వంటి యాంటీఆక్సిడెంట్లను కలిగి ఉంటాయి. ఇది మంటను తగ్గిస్తుంది. గుండె జబ్బులు, క్యాన్సర్ వంటి దీర్ఘకాలిక వ్యాధుల నుండి రక్షించడంలో సహాయపడుతుంది. మీరు క్రమం తప్పకుండా సోంపును తీసుకుంటే అది మీ ఆరోగ్యానికి చాలా మేలు చేస్తుంది. సోంపుతో షర్బత్ తయారీకి కావాల్సిన పదార్థాలు, ఎలా తయారు చేయాలో ఇక్కడ తెలుసుకుందాం.. 2 టేబుల్ స్పూన్లు సోంపు 1/2 కప్పు చక్కెర మీరు కావాలంటే చక్కెరకు బదులుగా తేనెను కూడా ఉపయోగించవచ్చు. 1 నిమ్మకాయ రసం 1 లీటరు నీరు తాజా పుదీనా ఆకులు మరింత రుచి కోసం, రోజ్ వాటర్ ను కొద్దిగా కలుపుకోవచ్చు. సోంపు షర్బత్ ఆరోగ్య ప్రయోజనాలు: సోంపు షర్బత్ జీవక్రియను పెంచి, కొవ్వు కరుగుటకు సహాయపడుతుంది. శరీర ఉష్ణోగ్రతను చల్లబరుస్తుంది. వేసవిలో శరీర ఉష్ణోగ్రత పెరిగి, డీహైడ్రేషన్‌కు దారితీస్తుంది. సోంపు షర్బత్ చల్లగా ఉండటం వల్ల శరీరాన్ని చల్లబరుస్తుంది. డీహైడ్రేషన్‌ను నివారిస్తుంది. తిన్న తర్వాత తీసుకుంటే, నోటి దుర్వాసనను తొలగిస్తుంది. సోంపు గింజల్లో యాంటి బాక్టీరియల్ లక్షణాలు ఉంటాయి. ఇవి నోటిలోని బ్యాక్టీరియా పెరుగుదలను నిరోధించి, నోటి దుర్వాసనను తొలగిస్తాయి. సోంపు షర్బత్‌ను ఎక్కువగా తీసుకోవడం వల్ల కడుపు నొప్పి, విరేచనాలు వంటి సమస్యలు వచ్చే అవకాశం ఉంది. కాబట్టి ఏదైనా సరే మోతాదుకు మించి తీసుకోవటం మంచిది కాదు.

## ఈ ఐదుగురు మెంతులకు దూరంగా ఉండాలి.. లేకుంటే ప్రమాదమే..!



అనేక ఆరోగ్య సమస్యలను అధిగమించడానికి, అద్భుతమైన ప్రయోజనాలను పొందడానికి మెంతి గింజలను తీసుకుంటారు. మెంతి గింజల వల్ల కలిగే ప్రయోజనాల గురించి చాలా తక్కువ మందికి మాత్రమే తెలుసు. అయితే ఆహారం రుచిని పెంచేందుకు ఈ గింజలను రకరకాలుగా ఉపయోగిస్తాం. మెంతి గింజలను సాధారణంగా ఔషధంగా లేదా ఆహారంతో తీసుకుంటారు. ఇవి చాలా ఆరోగ్యకరమైనవి. కానీ కొంతమంది మెంతి గింజలను తీసుకోవడం ద్వారా సమస్యలను ఎదుర్కోవచ్చు. మీ శరీరంలో కింద పేర్కొన్న కొన్ని సమస్యలు ఉంటే, మీరు మెంతులు తినకూడదని నిపుణులు సూచిస్తున్నారు. మెంతులను ఎవరు తీసుకోకూడదు డయాబెటిస్: మెంతి గింజలు చక్కెర స్థాయిని నియంత్రించడంలో సహాయపడేందుకు ఎంతగానో ఉపయోగపడతాయి. అయితే కొన్ని సందర్భాల్లో దీని వినియోగం మధుమేహాన్ని మరింత పెంచే అవకాశం ఉంది. మధుమేహ రోగులు మెంతి గింజలను తీసుకునే ముందు వారి వైద్యుడిని సంప్రదించాలి. అలర్జీ: కొందరికి మెంతి గింజల వల్ల అలర్జీ రావచ్చు. అందువల్ల మీరు మెంతులు వైద్యపరమైన ప్రతిచర్య ఏదైనా సూచనను కలిగి ఉంటే, మీరు దానిని నివారించాలి. అల్సర్: మెంతుల వినియోగం అల్సర్ రోగులకు హానికరం. ఈ రోగులు మెంతి గింజలను తీసుకోవడం ద్వారా సమస్యలను ఎదుర్కొంటారు. హార్మోన్ల అసమతుల్యత: కొన్ని సందర్భాల్లో మెంతి గింజల అధిక వినియోగం హార్మోన్ల స్థాయిలను భంగం చేస్తుంది. అందుకే హార్మోన్ల అసమతుల్యత లక్షణాలు ఉన్న వ్యక్తులు మెంతి గింజలను తీసుకునే ముందు వైద్యుడిని సంప్రదించాలి. శరీర ఉష్ణోగ్రత అసమతుల్యత: కొంతమందికి మెంతులను తీసుకోవడం వల్ల శరీర ఉష్ణోగ్రతలో అసమతుల్యత ఏర్పడవచ్చు. ఇది శారీరక సమస్యలను కలిగిస్తుంది. ఈ సమస్యలన్నీ ప్రతి వ్యక్తికి రావని గమనించండి. అయితే మీకు ఈ సమస్యలు ఏవైనా ఉంటే మీరు మెంతి గింజలను తీసుకునే ముందు వైద్యుడిని సంప్రదించాలి.

నినాదం
బుధవారం 25 - 02 - 2026

# దళితుల్ని గుళ్లోకి రాకుండా అడ్డుకున్న వ్యక్తి

**కర్ణాటకలో నవ దంపతులకు గుడిలో ఘోర అవమానం**

**దళితులు గుడిలోకి రావొద్దంటూ అడ్డుకున్న వ్యక్తి**

**పోలీసులకు ఫిర్యాదు చేసిన నవదంపతులు**

**గ్రామంలో శాంతికమిటీ సమావేశం నిర్వహించిన డీఎస్పీ**



దేశం డిజిటల్ యుగంలో దూసుకుపోతున్నా, కొన్ని గ్రామాల్లో కుల వివక్ష ఇంకా వేళ్లూనుకునే ఉంది. కర్ణాటకలోని తుమకూరు జిల్లా తురువేకెరె తాలూకాలోని గోణి గ్రామంలో ఒక దళిత నవ దంపతులకు ఎదురైన అనుభవం ఇప్పుడు రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశమైంది.

**అసలేం జరిగిందంటే..**

కొత్తగా పెళ్లయిన జగదీష్, పంకజ జంటగా దైవ దర్శనం కోసం గ్రామంలోని అరసమ్మ ఆలయానికి వెళ్లారు. వారు గుడిలోకి ప్రవేశించగానే అక్కడున్న నారాయణప్ప అనే వ్యక్తి ఒక్కసారిగా వింతగా ప్రవర్తించడం మొదలుపెట్టాడు. తనను దేవుడు ఆవహించినట్టు (శివం పూనడం) నటిస్తూ, దళిత కుటుంబం గుడిలోకి రావడానికి వీల్లేదని అడ్డుకున్నాడు. నారాయణప్ప మోకాళ్లపై కూర్చుని గర్భాలయానికి వెళ్లే దారిని అడ్డుకోవడమే కాకుండా.. "దళితులకు ఇక్కడ ప్రవేశం లేదు, మీరు బయటకు వెళ్లండి.. కావాలంటే ఇంట్లోనే పూజలు చేసుకోండి" అంటూ భార్యాభర్తలపై గట్టిగా అరిచాడు. దీనికి సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ కావడంతో తీవ్ర నిరసనలు వ్యక్తమయ్యాయి. ఆ సమయంలో అక్కడ ఉన్న మరికొందరు గ్రామస్థులు కూడా దంపతులకు మద్దతుగా నిలవకపోవడం గమనార్హం.

**పోలీసులకు ఫిర్యాదు..**

జగదీష్ వెంటనే తురువేకెరె పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు రంగంలోకి దిగి ప్రధాన నిందితుడు నారాయణప్పను అరెస్ట్ చేశారు. ఎస్సీ, ఎస్టీ అత్యాచార నిరోధక చట్టం కింద నారాయణప్పతో పాటు ప్రభ, కాంతన్న, అమూల్య, పుట్టెగౌడ, పద్మ అనే వ్యక్తులపై కూడా ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. పరారీలో ఉన్న మిగిలిన నిందితుల కోసం గాలిస్తున్నారు. తహసీల్దార్ మరియు డిఎస్పీ ఆధ్వర్యంలో గ్రామంలో శాంతి కమిటీ సమావేశం నిర్వహించి, అంటరానితనం నేరమని గ్రామస్థులకు అవగాహన కల్పించారు.

# విజయవాడలో 100 విద్యుత్ బస్సులు ఏర్పాటు

**మహిళలకు స్త్రీశక్తి పథకం వర్తింపు**

**నగరంలో పరుగులు పెట్టనున్న విద్యుత్ బస్సులు**




విజయవాడకు 100 బస్సులు కేటాయింపు, విద్యాధరపురం డిపోలో ఏర్పాటు కానున్న నిర్వహణ కేంద్రం, నిర్వహణ భారాన్ని కలిసి పంచుకోనున్న కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలువిద్యుత్ బస్సులు త్వరలో నగరంలో పరుగులు పెట్టనున్నాయి. ఇందులో భాగంగా రవాణా శాఖ అధికారులు విజయవాడకు 100 బస్సులు కేటాయించారు. ప్రధానంగా విద్యాధరపురం డిపోలో వీటి నిర్వహణ కేంద్రం ఏర్పాటు కానుంది.దీనికి సంబంధించి ఇప్పటికే ఒప్పంద ప్రక్రియ అనేది పూర్తయింది. దాంతో మరో ఆరు నెలల్లో బస్సులు రోడ్డు పైకి రానున్నాయి. అంతేకాకుండా కాలుష్యనివారణకు పీఎం-ఈ-బస్ సేవా పథకం ద్వారా నడుపుతున్నప్పటికీ వాటి నిర్వహణకు అయ్యేటటువంటి వ్యయాన్ని మాత్రం కలిసి పంచుకోనున్నాయి.

**దాదాపు 7,000 లీటర్ల డీజిల్ ఆదా:** బస్సులను ఓ సారి పరిశీలిస్తే ప్రస్తుతం 400 సిటీ బస్సులు ఉన్నాయి. అయితే ఇప్పుడు కొత్త బస్సుల రాకతో అవసాన దశలోని బస్సులను తొలగిస్తారు. ఫలితంగా దాదాపు 7,000 లీటర్ల డీజిల్ వరకు ఆదా అవుతుండటం గమనార్హం. తిరుపతి ఐఐటీ బృందం గతంలో చేపట్టిన అధ్యయనంలో విజయవాడలో కార్బన్‌మోనాక్సైడ్ ఆందోళనకరంగా ఉందని గుర్తించింది. విద్యుత్ బస్సులతో మాత్రం కొంతవరకు కాలుష్యం తగ్గుతుందని చెప్పవచ్చు.అంతేకాకుండా విద్యుత్ నిర్వహణ కేంద్రం ఏర్పాటుతో విద్యాధరపురం డిపో రూపురేఖలను మార్చనున్నారు. మెరక పనులు, ప్లాట్‌ఫారాలు, అధికారులు, నిర్వాహకుల కార్యాలయ భవనాల నిర్మాణం, ఇతర సివిల్ పనులకు రూ.12.5 కోట్లను కేటాయించారు. అందుకు 6,000 కేవీ సామర్థ్యంతో సబ్‌స్టేషన్, ఛార్జింగ్ స్టేషన్ నిర్మాణం, 5 బస్సులకు ఒక్కోటి చొప్పున 20 ఛార్జింగ్ పాయింట్లు. వైరింగ్, ఇతర ఎలక్ట్రికల్ సామగ్రికి గాను దాదాపు రూ.10.5 కోట్లను వినియోగించనున్నారు.ఇందుకు కేంద్రం 60 శాతం, రాష్ట్రం 40 శాతం నిధులను సమకూర్చుకోనుంది. పినాకిని మొబిలిటీ సంస్థకు బస్సుల నిర్వహణ బాధ్యతను అప్పగించారు. మొత్తం 250 మంది డ్రైవర్లను ఈ సంస్థ సమకూరుస్తుండగా 250 మంది కండక్టర్లను సైతం ఆర్టీసీ సర్దుబాటు చేస్తుంది.

**స్త్రీ శక్తి పథకం వర్తింపు:** దీని ప్రకారం ఒక్కో సీటుకు గాను మొత్తం 40 సీట్లు ఉంటాయి. అంతేకాకుండా ఉచిత బస్సు ప్రయాణం సైతం వర్తించనుంది. మొత్తంగా 100 ఎలక్ట్రిక్ బస్సులను 11 మార్గాల్లో నడపనున్నారు.

**మరింత సమాచారం:** పెట్రోల్, డీజిల్ వాహనాల వాడకాన్ని తగ్గిస్తూ పర్యావరణాన్ని రక్షించేందుకు ఎలక్ట్రిక్ బస్సులను ప్రోత్సహించాలనే లక్ష్యంతో 2023 ఆగస్టులో కేంద్ర ప్రభుత్వం పీఎం ఈ-బస్ సేవా పేరిట ఓ పథకాన్ని తీసుకొచ్చింది. పీపీపీ (పబ్లిక్ ప్రైవేట్ పార్టనర్‌షిప్) విధానంలో 10,000 ఎలక్ట్రిక్ బస్సులను నడపాలని ఈ సేవా పథకాన్ని ప్రారంభించింది. విద్యుత్ బస్సుల కోసం ఏపీలో 11 డిపోలను ఏర్పాటు చేయనున్నారు. ఇందుకుగానూ సివిల్, విద్యుత్ పనులకు కేంద్రం నిధులు సమకూర్చనుంది. ఏ ఏ జిల్లాలో కొత్త డిపోల నిర్మాణం చేపట్టనున్నారో ఇప్పుడు తెలుసుకుందాం.పీఎం-ఈబస్ సేవ పథకం కింద కేంద్రం రాష్ట్రంలోని 11 నగరాల్లో ఏపీఎస్ఆర్టీసీకి 750 విద్యుత్ బస్సులను కేటాయించిన విషయం తెలిసిందే. వీటి కోసం ఆయా డిపోల్లో కేంద్ర నిధులతో సివిల్, విద్యుత్ పనులు చేపట్టనున్నారు. ఇప్పటికే విజయవాడ, నెల్లూరు, గుంటూరు, విశాఖకు 100 బస్సుల చొప్పున కేటాయించారు.అదే విధంగా కాకినాడ, రాజమహేంద్రవరం, మంగళగిరి, కడప, మంగళం (తిరుపతి), అనంతపురం, కర్నూలుకు 50 బస్సులు చొప్పున కేటాయించారు. ఈ బస్సులను పుణెకు చెందిన పినాకిల్ సంస్థ నడపనుంది. ఈ బస్సుల కోసం ఆ డిపోల్లో వివిధ నిర్మాణాలు, విద్యుత్ పనులు చేపట్టాల్సి ఉంది.

# రాష్ట్ర బడ్జెట్ అంచనాలకు దూరంగా కేంద్ర గ్రాంట్లు

**ఆశించిన దానిలో మూడో వంతూ రావడం లేదు**

**బడ్జెట్ అంచనాలకు దూరంగా కేంద్ర గ్రాంట్లు**

**ఏటా బడ్జెట్‌లో గ్రాంట్ల మొత్తాన్ని భారీగా అంచనా వేస్తూ వస్తున్న రాష్ట్ర ప్రభుత్వం**

**ఆశించిన దానిలో మూడోవంతు కూడా రాని నిధులు**




2026-27 : కేంద్రం నుంచి వస్తున్న గ్రాంట్లు బడ్జెట్ అంచనాలను ఏమాత్రం అందుకోవడం లేదు. ఏటా రాష్ట్ర బడ్జెట్‌లో గ్రాంట్ల మొత్తాన్ని భారీగా అంచనా వేస్తూ వస్తున్నారు. తీరా చూస్తే నిధులు మాత్రం ఆశించిన దానిలో మూడో వంతు కూడా రావడం లేదు. ఫలితంగా బడ్జెట్ అంచనాలకు దూరంగా ఉంటోంది. కేంద్ర ప్రభుత్వం నుంచి పన్నుల్లో వాటాతో పాటు రాష్ట్రాలకు గ్రాంట్ల రూపంలో నిధులు వస్తుంటాయి. ఈ నిధులు వివిధ రూపాల్లో వస్తుంటాయి. ప్రతి ఐదేళ్లకు ఒకసారి కేంద్ర ఆర్థికసంఘం ఇచ్చే సిఫార్సులకు అనుగుణంగా రాష్ట్రాలకు కేంద్రం గ్రాంట్ల రూపంలో నిధులు ఇస్తుంది. స్థానిక సంస్థలకు ఇచ్చే నిధులతో పాటు ఎస్డీఆర్ఎఫ్ కింద ఈ నిధులు ఉంటాయి. ఎన్నికల నిర్వహణ, తదితర షరతులకు లోబడి ఈ నిధులను కేంద్రం రాష్ట్రాలకు విడుదల చేస్తుంది.

**ప్రత్యేక గ్రాంట్ల రూపంలో నిధులు :** కేంద్ర ప్రాయోజిత పథకాల ద్వారా కూడా రాష్ట్రాలకు నిధులు వస్తుంటాయి. ఆయా పథకాల నిబంధనలకు లోబడి రాష్ట్ర ప్రభుత్వం ఖర్చు చేసే వాటాకు అనుగుణంగా కేంద్రం నిధులు ఇస్తుంది. కొన్ని ప్రత్యేక సందర్భాలు, అవసరాలను పరిగణలోకి తీసుకొని కేంద్ర ప్రభుత్వం తన విచక్షణ మేరకు రాష్ట్రాలకు ప్రత్యేక గ్రాంట్ల రూపంలో నిధులు ఇస్తూ ఉంటుంది. దాంతో పాటు స్వయం ప్రతిపత్తి కలిగిన సంస్థలకు కూడా కేంద్రం నుంచి గ్రాంట్లు వస్తుంటాయి. రాష్ట్ర ప్రభుత్వ నియంత్రణలో ఉండే యూనివర్సిటీలు, పరిశోధనా సంస్థలు, తదితరాలకు ఈ రూపంలో నిధులు ఇస్తారు. వివిధ రకాలుగా వచ్చే గ్రాంట్ల మొత్తాన్ని రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతి ఏటా బడ్జెట్‌లో పొందుపరుస్తారు. ఆర్థిక సంవత్సరంలో కేంద్రం నుంచి గ్రాంట్ల రూపంలో ఏ మేరకు వచ్చే అవకాశం ఉందో అంచనా వేసి, బడ్జెట్ ప్రతిపాదనలను సిద్ధం చేస్తారు. గ్రాంట్ల విషయంలో అంచనాలకు చాలా దూరంగా ఉంటోంది. బడ్జెట్‌లో అంచనా వేసే మొత్తంలో మూడో వంతు కూడా కేంద్రం నుంచి రావడం లేదు.

**బడ్జెట్‌లో గ్రాంట్లు సగానికి తగ్గింపు :** 2021-22 బడ్జెట్‌లో అంచనా వేసిన గ్రాంట్ల మొత్తం రూ.38,669 కోట్లు కాగా, కేంద్రం నుంచి అందులో 22 శాతం మేర రూ.8,619 కోట్లు రాష్ట్రానికి వచ్చాయి. 2022-23లో గ్రాంట్ల రూపంలో రూ.41,002 కోట్లు వస్తాయని అంచనా వేశారు. కానీ కేంద్రం నుంచి వచ్చిన మొత్తం రూ.13,179 కోట్లు మాత్రమే. అంచనాలో 32 శాతంగా ఉంది. 2023-24 లో అంచనా వేసిన గ్రాంట్ల మొత్తం రూ.41,259 కోట్లు అయితే, కేంద్రం నుంచి అందులో 23 శాతం మేర రూ.9,729 కోట్లు వచ్చాయి. 2024-25 బడ్జెట్‌లో గ్రాంట్ల అంచనాను సగానికి తగ్గించారు. రూ.21,636 కోట్ల అంచనా వేస్తే కేంద్రం అందులో 36 శాతం రూ. 7,913 కోట్లు రాష్ట్రానికి ఇచ్చింది. బడ్జెట్‌లోనే భారీగా తగ్గించినప్పటికీ వచ్చిన మొత్తం కనీసం 40 శాతం కూడా దాటలేదు.

**రాష్ట్రాలకు గ్రాంట్ల రూపంలో నిధులు :** ప్రస్తుత ఆర్థిక సంవత్సరం 2025-26 బడ్జెట్‌లో కూడా గ్రాంట్ల అంచనా పరిమితంగానే ఉంది. రూ.22,782 కోట్లు కేంద్రం నుంచి గ్రాంట్ల రూపంలో వస్తాయని అంచనా వేస్తే జనవరి నెలాఖరు వరకు అందులో కేవలం 18 శాతానికి పైగా రూ.4,213 కోట్లు మాత్రమే వచ్చాయి. మిగిలిన రెండు నెలల్లో ఏ మేరకు వస్తాయో చూడాలి. ఇటీవల కేంద్ర బడ్జెట్ సందర్భంగా 16వ ఆర్థిక సంఘం నివేదికను ప్రవేశపెట్టారు. రానున్న ఐదు ఆర్థిక సంవత్సరాలు ఆ నివేదిక ప్రకారమే రాష్ట్రాలకు గ్రాంట్ల రూపంలో నిధులు రానున్నాయి. ఈసారి ఆర్థిక సంఘం కొన్ని మార్పులు, చేర్పులు చేసింది. వివిధ రూపాల్లో రాష్ట్రానికి వచ్చే అవకాశం ఉన్న నిధులకు సంబంధించి ప్రభుత్వానికి స్పష్టత వచ్చింది. వాటన్నింటిని పరిగణలోకి తీసుకొని బడ్జెట్‌లో కేంద్రం నుంచి వచ్చే గ్రాంట్ల మొత్తాన్ని పొందుపరచనున్నారు.

# అంతుచిక్కని వైరస్‌తో 72 పులుల మృత్యువాత

**నెహ్రూ జూపార్క్‌లో హై అలర్ట్**

హైదరాబాద్ మహానగరంలోని నెహ్రూ జూలాజికల్ పార్క్‌లో అధికారులు హై అలర్ట్ ప్రకటించారు. తాజాగా అన్ని మూగజీవుల ఆవాసాల వద్ద ప్రత్యేక చర్యలు చేపట్టారు. గతంలో కొవిడ్ మహమ్మారి వ్యాప్తి సమయంలో అనుసరించిన ప్రొటోకాల్‌ను మళ్లీ ఇప్పుడు అమలు చేస్తున్నారు. మరీ ముఖ్యంగా పులుల ఆవాసాల వద్ద ప్రత్యేక చర్యలు ప్రారంభమయ్యాయి. ఆవాసాల్లోని ఇసుకను తీసేసి, అక్కడ కొత్త ఇసుకను వేస్తున్నారు. అలాగే గోడలకు సున్నం వేయడం, గదుల చుట్టూ సోడియం హైపో క్లోరైట్ ద్రావణాన్ని పిచికారీ చేయడంతో పాటు ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటున్నారు.

**జూ పార్క్‌లో అప్రమత్తమైన వైద్యాధికారులు :** ప్రపంచవ్యాప్తంగా పర్యాటకులను ఆకర్షించే థాయ్‌లాండ్‌లోని ప్రైవేటు జూపార్కులో ఇటీవల దాదాపు 72 పులులు మరణించాయి. వాటికి అంతుచిక్కని వైరస్ సోకడంతో ఒక్కసారిగా అక్కడ పులులన్నీ మరణించినట్లు అక్కడి అధికారులు తెలిపారు. ఈ నేపథ్యంలో హైదరాబాద్ నెహ్రూ జూ పార్క్ కూడా అప్రమత్తమైంది. క్యూరేటర్ జె.వసంత ఆదేశాలతో వైద్యాధికారులు సంరక్షణ చర్యలు చేపట్టారు. పులుల ఆవాసాలు, సందర్శన కేంద్రాల్లో క్రిమి సంహారక మందులను పిచికారీ చేస్తున్నారు. అలాగే పక్షులకు కూడా రోగ నిరోధకతను పెంచే మందులను అందజేస్తున్నామని పేర్కొన్నారు.




**జూలోకి త్వరలో మాండ్రిల్ :** నెహ్రూ జూ పార్కులో త్వరలో రంగుల తిలకం దిద్దిన మాదిరి ఉండే నామాల కోతులు మాండ్రిల్ సందడి చేయనున్నాయి. జంషెడ్‌పూర్ జూ నుంచి జంతువుల బదిలీలో భాగంగా వారం క్రితం రెండు మగ నామాల కోతులను ఇక్కడికి తెప్పించారు. వీటికి బదులుగా జంషెడ్‌పూర్ జూకు ఆఫ్రికన్ జాతి ఆడ, మగ సింహాలను పంపించారు.

**దత్తత కార్యక్రమానికి విశేష స్పందన :** ఈ జూ పార్క్‌లో మొత్తం ఇప్పటి వరకు 62 మంది కలిసి 89 జంతువులను దత్తత తీసుకున్నారు. ఈ దత్తత కాలం ఒక ఏడాది పాటు ఉంటుంది. లేదంటే మీరు మళ్లీ కొనసాగించాలంటే ఆ దాన్ని రెన్యూవల్ చేసుకోవచ్చు. దత్తత తీసుకున్న వారికి ఆదాయపు పన్ను చట్టం 80జీ కింద పన్ను మినహాయింపు సౌకర్యం కూడా ఉంది. దీంతో పాటు దత్తత తీసుకున్న వారికి ఉచిత ప్రవేశ టికెట్లు, గెస్ట్ హౌస్ వసతి వంటి మౌలిక సదుపాయాలు కూడా ఉన్నాయి. ఇలా ప్రతి సంవత్సరం 50 నుంచి 80 మంది వరకు జంతువులను దత్తత తీసుకుంటున్నారని క్యురేటర్ వసంత అన్నారు. దత్తత తీసుకోవాలనుకునే వారు జూపార్క్ అధికారిక వెబ్‌సైట్ ద్వారా లేదా నేరుగా జూపార్క్‌ను సంప్రదించి ఆన్‌లైన్, చెక్, డీడీ రూపంలో చెల్లింపులు చేయవచ్చన్నారు. ఇలా వన్యప్రాణి సంరక్షణలో ముందడుగు వేస్తున్న నెహ్రూ జూలాజికల్ పార్క్ జంతు దత్తత కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోంది.

**ఒక్కొక్క జంతువుకి ఒక్కో ఖర్చు :** పార్క్‌లో ప్రతి జంతువుకు మెయింటెనెన్స్‌కు అయ్యే ఖర్చు వేరుగా ఉంటుంది. ఏనుగు, జిరాఫీ వంటి భారీ జంతువులకు రోజుకు రూ.5000 వరకు వ్యయం కాగా, అదే సంవత్సరానికి అయితే సుమారుగా అక్షరాల ఐదు లక్షల రూపాయాల వరకు ఖర్చు ఉంటుంది. ఇంక పులి, సింహాలకు రోజుకు రూ. 2000 చొప్పున అదే ఏడాదికి అయితే రూ. 3 లక్షల వరకు ఖర్చు అవుతుంది. రైనో, హిప్పోలకు ఏడాదికి అయ్యే ఖర్చు రూ. 2 లక్షలు, వైల్డ్ డాగ్, వోల్ఫ్, స్మాల్ క్యాట్‌లకు ఏటా రూ. లక్ష, అలాగే మొసళ్లు, పక్షులు, పాములు వంటి జంతువులకు ప్రతి ఏటా రూ. 50,000 వరకు వ్యయం అవుతుంది.

# అంబర్‌పేట్‌లో విషాదం.. ఒకే కుటుంబంలో ముగ్గురు ఆత్మహత్య

**ఉరి వేసుకుని భార్యాభర్త, మణికట్టు కోసుకుని కొడుకు బలవన్మరణం**

**హోటల్ నిర్వహణలో నష్టాలతో అప్పులపాలైన యజమాని**

**ఆర్థిక ఇబ్బందులే ఆత్మహత్యలకు కారణమని పోలీసుల అనుమానం**




అంబర్‌పేట్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు వ్యక్తులు ఆత్మహత్యకు పాల్పడటం స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. ఆర్థిక ఇబ్బందులే ఈ ఘోర నిర్ణయానికి కారణమని ప్రాథమికంగా తెలుస్తోంది. మృతులను రామరాజు (55), ఆయన భార్య మాధవి (50), మరియు కుమారుడు శశాంక్ (24) గా గుర్తించినట్లు పోలీసులు తెలిపారు.రామరాజు స్థానికంగా హోటల్ వ్యాపారం నిర్వహిస్తున్నారు. గత కొంతకాలంగా వ్యాపారంలో నష్టాలు రావడంతో రామరాజు అప్పుల పాలయ్యారు. ఈ నేపథ్యంలోనే మంగళవారం రామరాజు ఇంటి తలుపులు తెరుచుకోకపోవడంతో చుట్టుపక్కల వారు పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే అక్కడికి చేరుకున్న పోలీసులు.. తలుపులు తెరిపించి చూడగా లోపల ముగ్గురూ విగతజీవులుగా కనిపించారు.రామరాజు, మాధవి ఉరివేసుకుని ప్రాణాలు తీసుకోగా, శశాంక్ తన మణికట్టు కోసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అప్పుల భారం పెరిగిపోవడంతో తీవ్ర మనస్తాపానికి గురై కుటుంబమంతా ఈ విపరీత నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించిన పోలీసులు.. కేసు నమోదు చేసిన పోలీసులు, ఆర్థిక లావాదేవీల కోణంలో విచారణ జరుపుతున్నారు.

# రాజమహేంద్రవరం కల్తీ పాల ఘటన - ఐదుగురు మృతి

**12 మందికి ఆస్పత్రుల్లో చికిత్స, ఇద్దరి పరిస్థితి విషమం**

**బాధితుల నమూనాలు హైదరాబాద్, విజయవాడ, విశాఖ ల్యాబ్‌లకు తరలింపు**

**బాధితుల వైద్య ఖర్చు ఎంతైనా ప్రభుత్వమే భరిస్తుందన్న ఎమ్మెల్యే**



రాజమహేంద్రవరం కల్తీ పాల బారినపడి ఆసుపత్రి పాలైన వారి మరణాలు రాష్ట్రవ్యాప్తంగా కలకలం సృష్టిస్తున్నాయి. కల్తీ పాల ఘటనలో మృతుల సంఖ్య ఐదుకు పెరిగింది. ఆదివారం వరకు ఇద్దరు మృతి చెందగా, చికిత్స పొందుతూ మరో 3 ప్రాణాలు విడిచారు. ఇంకొందరి పరిస్థితి విషమంగానే ఉంది.రాజమహేంద్రవరం లాలాచెరువులోని చౌడేశ్వరినగర్, స్వరూప్‌నగర్ పరిసర ప్రాంతాల్లో కలుషిత పాలు తాగిన వారిలో మరో 12 మంది వివిధ ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నారు. వారిలో కొందరి పరిస్థితి విషమంగానే ఉంది. ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్న బాధితులతో పాటు ప్రభావిత ప్రాంతాల్లో కలెక్టర్ కీర్తి, ఎస్పీ నరసింహకిశోర్, వైద్యారోగ్య శాఖ కమిషనర్ వీర పాండ్యన్, ఏలూరు రేంజి ఐజీ అశోక్ కుమార్ పర్యటించారు. బాధిత కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు.

**14 ప్రత్యేక బృందాల్తో ఇంటింటి సర్వే :** సమస్య మూలాలు తెలుసుకునేందుకు 14 ప్రత్యేక బృందాలతో అధికారులు ఇంటింటి సర్వే చేపట్టారు. పాల కల్తీ వల్లే అందరూ అనారోగ్యానికి గురైనట్టు అంచనాకు వచ్చిన నేపథ్యంలో నర్సాపురానికి చెందిన పాల వ్యాపారి గణేష్‌ను అరెస్టు చేసి విచారించారు. ఈనెల 16న కొందరు తనకు ఫోన్ చేసి పాలు చేదుగా ఉన్నట్లు తెలిపారని గణేష్ చెప్పినట్లు తెలిసింది.

**రాజమహేంద్రవరం పరిసరాల్లో 126 మందికి సరఫరా :** ఆయనపై రాజమహేంద్రవరం ఒకటి, మూడో పట్టణ పోలీసు స్టేషన్లతో పాటు బొమ్మూరు స్టేషన్లో నాలుగు హత్య కేసులు నమోదు అయ్యాయి. గణేష్ రోజూ 42 మంది రైతుల వద్ద పాలు సేకరించి, దివాన్ చెరువు, కొంతమూరు, రాజమహేంద్రవరం పరిసరాల్లో 126 మందికి సరఫరా చేస్తుంటాడు. అతని వద్ద పాలు తీసుకునే ప్రతి ఇంటితో పాటు 42 మంది పాడి రైతులు, 46 పశువులను కూడా అధికారులు మ్యాపింగ్ చేశారు.మొత్తం 106 కుటుంబాల రక్తనమూనాలూ సేకరించారు. చికిత్స పొందుతున్న వారితో పాటు, మృతుల నమూనాలు, పాల నమూనాలూ సేకరించారు. వాటిని సెంట్రల్ ఫోరెన్సిక్ ల్యాబ్‌తో పాటు, విజయవాడ, విశాఖ, హైదరాబాదలోని ప్రయోగశాలలకు పంపారు."పాలలో ఏమైనా కెమికల్ గానీ టాక్సిక్ మెటీరియల్స్, హెవీ మెటీరియల్స్ ఏమైనా ఉన్నాయా అని పరిశీలించడానికి శాంపిళ్లు కూడా పంపిస్తున్నాం. టెస్ట్ రిజల్ట్ వచ్చాక తదితర చర్యలు తీసుకుంటాం." - వీర పాండ్యన్, వైద్య ఆరోగ్యశాఖ కమిషనర్

**ఒక పాల క్యాన్‌లోనే కల్తీ: ఐజీ**

తూర్పుగోదావరి జిల్లా కోరుకొండ మండలం నరసాపురంలో ఏలూరు రేంజ్ ఐజీ అశోక్ కుమార్ పర్యటించారు. వరలక్ష్మి పాల కేంద్రాన్ని పరిశీలించారు. ఒక పాల క్యాన్‌లోనే కల్తీ జరిగిందని దర్యాప్తులో తేలిందని అన్నారు. ప్రజలు దీని గురించి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు."బాధితుల వైద్య ఖర్చులు పూర్తిగా కూటమి ప్రభుత్వమే భరిస్తుంది. రెయిన్ బో హాస్పిటల్, కిమ్స్ హాస్పిటల్ ఈ రెండు చోట్లే పేషెంట్లు అందరూ ఉన్నారు. కల్తీకి కారణమైన వారు ఎవరైనా, ఏ స్థాయిలో ఉన్న వారైనా చర్యలు అయితే మాత్రం తప్పవు". - ఆదిరెడ్డి వాసు, ఎమ్మెల్యేపాల కల్తీ బాధ్యుల్ని ప్రభుత్వం వదిలిపెట్టదని, అదే సమయంలో బాధితుల వైద్య ఖర్చంతా ప్రభుత్వమే భరిస్తుందని ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు చెప్పారు. విశాఖకు చెందిన నెఫ్రాలజిస్టు రవిరాజ్ బృందం కూడా పాల కల్తీపై సమగ్ర అధ్యయనం చేస్తోంది.

# హుస్సేన్‌సాగర్‌లో దూకేందుకు యత్నం

**తల్లి, ఇద్దరు పిల్లలను కాపాడిన పోలీసులు**

**కుటుంబ కలహాలతో ఇద్దరు పిల్లలతో కలిసి తల్లి ఆత్మహత్యాయత్నం**

**ట్యాంక్‌బండ్‌పై అనుమానాస్పదంగా కనిపించడంతో ప్రశ్నించిన పోలీసులు**

**హుస్సేన్‌సాగర్‌లో దూకి చనిపోవాలనుకున్నట్లు వెల్లడించిన మహిళ**



కుటుంబ సమస్యలతో తీవ్ర మనస్తాపానికి గురైన ఓ మహిళ తన ఇద్దరు కుమారులతో కలిసి ఆత్మహత్య చేసుకునేందుకు యత్నించగా, పోలీసులు అప్రమత్తంగా వ్యవహరించి వారిని కాపాడారు. ఈ ఘటన హైదరాబాద్ ట్యాంక్‌బండ్‌పై చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే.. జియాగూడ ఎంసీహెచ్ కాలనీకి చెందిన బి.ప్రతివ (28), తన కుమారులు అనిష్ (10), జస్వంత్ (7)తో కలిసి ట్యాంక్‌బండ్‌కు చేరుకుంది. తెలంగాణ అమరవీరుల స్థూపం వద్ద వారు అనుమానాస్పదంగా కనిపించడంతో గస్తీలో ఉన్న పోలీసులు వారిని ప్రశ్నించారు. విచారణలో, కుటుంబంలో భర్తతో తరచూ గొడవలు జరుగుతున్నాయని, దీంతో విసిగిపోయి పిల్లలతో కలిసి హుస్సేన్‌సాగర్‌లో దూకి ఆత్మహత్య చేసుకోవాలని నిర్ణయించుకున్నట్లు ఆమె పోలీసులకు తెలిపింది. వెంటనే స్పందించిన పోలీసులు తల్లీకుమారులను సైఫాబాద్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఇన్‌స్పెక్టర్ ఎ. సీతయ్య ఆమె సమస్యలను అడిగి తెలుసుకుని కౌన్సెలింగ్ ఇచ్చారు. అనంతరం, తదుపరి చర్యల నిమిత్తం వారిని కుల్సుంపురా పోలీస్ స్టేషన్‌కు తరలించారు. పోలీసులు సకాలంలో స్పందించడంతో ముగ్గురి ప్రాణాలు నిలిచాయి.




## ఘనంగా పల్లాలమ్మ ఆలయ వార్షికోత్సవం

ఉంగుటూరు, ఫిబ్రవరి 24 : ఏలూరు జిల్లా రాచూరు గ్రామదేవతవ లాలమ్మ వార్షిక మహోత్సవాలు మంగళవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. తొలి రోజు అమ్మవారికి 11 రకాల ద్రవ్యాలతో అభిషేకాలు నిర్వహించారు. జనసేన సీనియర్ నాయకుడు వట్టి పవన్ కుమార్, బొమ్మిడి సొసైటీ అధ్యక్షుడు మైలవరపు గోపాలకృష్ణ అమ్మవారిని దర్శించుకున్నారు. వార్షికోత్సవం సందర్భంగా ఆలయాన్ని పూలదండలు, విద్యుత్ దీపాలతో సుందరంగా తీర్చిదిద్దారు. ఆలయ నిర్వాహకుడు మంద శ్రీనివాస్ రెడ్డి ఏర్పాట్లు పర్యవేక్షించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారికి విశేష పూజలు, అభిషేకాలు నిర్వహించారు.

# పనులు వేగవంతంగా పూర్తిచేయాలి

### పంచాయతీ రాజ్, ఉపాధి హామీ పథకాలు ప్రగతిని చూపాలి

### జూమ్ మీట్‌లో అధికారులకు ఏలూరు జిల్లా కలెక్టరు వెట్రిసెల్వి ఆదేశం



ఏలూరు, ఫిబ్రవరి 24 : చేయాల్సిన పనులు వేగవంతంగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఏలూరు జిల్లా కలెక్టర్ వెట్రిసెల్వి ఆదేశించారు. జిల్లా కలెక్టరేటు జిల్లా కలెక్టరు ఛాంబరు నుండిపంచాయితీ రాజ్ శాఖ ద్వారా చేపట్టిన పనులు నిర్మాణంలో నాణ్యత ప్రమాణాలనుఖచ్చితంగా పాటించి వేగవంతం చెయ్యాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టరు కె.వెట్రిసెల్వి మాట్లాడుతూ జిల్లా పరిధిలో పంచాయతీరాజ్ శాఖ ద్వారా వివిధ పథకాలు క్రింద చేపట్టిన పనులపై శాఖలు వారీగా సమీక్షించి తక్షణం పూర్తి చేయాలని సూచించారు. జిల్లాలో పంచాయతీ రాజ్ ఇంజనీరింగు విభాగం పరిధిలో 2024-25 లో చేపట్టిన మొత్తం 1576 పనులు రూ 176 కోట్లుతో మంజూరు కాగా రూ 89 కోట్ల రూపాయలతో 1389 పనులను పూర్తి చేయగా మిగిలినవి పురోగతిలో ఉన్నాయని పంచాయతీ రాజ్ యస్ఇ జిల్లా కలెక్టరుకు వివరించారు. 2025-26 సంవత్సరంలో సీసీ, బిటి, మెటల్ రహదారులు 667 పనులకు గాను రూ 135 కోట్ల రూపాయలతో చేపట్టగా ఇప్పటి వరకు 46 పనులు పూర్తిచేసి రూ 12 కోట్ల రూపాయలు ఖర్చు చేయడం జరిగిందన్నారు. మిగిలిన పనులు పురోగతిలో ఉన్నాయని తెలిపారు. మార్చి 15 నాటికి పురోగతిలో ఉన్న పనులు అన్నింటిని పూర్తిచేసి వాటికి సంబంధించిన బిల్స్ ఆన్లైన్లో అప్లోడ్ చెయ్యాలని అధికారులను జిల్లా కలెక్టరు ఆదేశించారు. జిల్లాలో జరుగుతున్న రహదారులు పనుల పురోగతిపై మండలు వారీగా సమీక్షించి పనులను వేగవంతం చేసి రోజువారి నివేదికలను సమర్పించాలన్నారు. అధికారులను లక్ష్యసాధనలో నిర్లక్ష్యం వస్తే చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. తదుపరి సమీక్ష నాటికి రోజువారి పనులకు సంబంధించి బిల్స్ అప్లోడ్ చెయ్యాలని సూచించారు. జిల్లాలో నీటి నిర్వహణ సంస్థ ద్వారా ( వీ+చీ=జు+టా ) మహాత్మా గాంధీ జాతీయగ్రామీణ ఉపాధి హామీ పథకం క్రింద ఈ ఏడాది చేపట్టిన రూ 103 లక్షలతో చేపట్టిన వాటర్‌షెడ్లు నిర్వహణతో పాటు వివిధ పనులనుకు సంబంధించి రూ 93.64 లక్షల రూపాయలు ఖర్చు చేయడం జరిగిందన్నారు. మిగిలిన పనులు పురోగతిలో ఉన్నాయని డ్వామా పిడి కె.వెంకట సుబ్బారావు జిల్లా కలెక్టరుకు వివరించారు. క్షేత్రస్థాయిలో జరుగుతున్న పనులు పురోగతిపై రోజువారి ఫోటోలు నివేదికను సమర్పించాలని జిల్లా కలెక్టరు ఆదేశించారు. అధికారులు పనులను సమయపాలనతో నాణ్యత ప్రమాణాలకు లోబడేలా పూర్తిచేయాలని సూచించారు. గ్రామీణ మౌలిక సదుపాయాలు అభివృద్ధి, రహదారుల మెరుగుదల, పారిశుధ్యం మరియు సంక్షేమ రంగాలు బలోపేతం ఈ పథకాల ప్రధాన లక్ష్యం అని జిల్లా కలెక్టరు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా పంచాయతీ రాజ్ ఇంజనీరింగు అధికారి జెడ్. రమేష్, డ్వామా పిడి కె.వెంకట సుబ్బారావు, తదితరులు పాల్గొన్నారు.

## ఏడో రోజుకు చేరిన పెద్దింటి అమ్మవారి జాతర ఉత్సవాలు



కైకలూరు, ఫిబ్రవరి 24 : మండలంలోని కొల్లేటికోట గ్రామంలో వెలసిన శ్రీ పెద్దింటి అమ్మవారి దేవస్థానంలో జాతర మహోత్సవాలు మంగళవారం నాటికి 7వ రోజుకు చేరాయి. వార్షిక జాతరలో భాగంగా మంగళవారం ఉదయం 5 గంటలకు శ్రీ జలదుర్గ, పెద్దింట్లమ్మ అమ్మవారికి విశేషార్చనలు నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన వస్త్రాలతో అలంకరణ, పంచామృత అభిషేకం, సుగంధ ద్రవ్యాభిషేకం, సహస్రనామ కుంకుమ పూజ, పుష్పార్చన, పుష్పాలంకరణ కార్యక్రమాలు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. అమ్మవారికి ద్రవ్యోపచారాలతో ప్రత్యేక పూజలు నిర్వహించి, బాలభోగం, నీరాజన మంత్రపుష్పాలు సమర్పించారు. అనంతరం భక్తులకు ఉచిత ప్రసాదం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాలకు గ్రామానికి చెందిన వేగేశ్న ప్రసాద్ రాజు, వెంకటలక్ష్మి దంపతులు ప్రత్యేకంగా ఏర్పాట్లు చేసి, అమ్మవారి ఆశీర్వాదాలు పొందారు. సాయంత్రం 6 గంటలకు శ్రీ పెద్దింటి అమ్మవారికి, శ్రీ జలదుర్గ అమ్మవార్లకు పంచహారతులు, నైవేద్యం, నీరాజన కార్యక్రమాలు నిర్వహించారు. అలాగే రాత్రి 7 గంటలకు విజ్ఞాన్ పబ్లిక్ స్కూల్ విద్యార్థులచే సాంస్కృతిక కార్యక్రమాలు దేవస్థాన ధర్మకర్తలు మండలి పర్యవేక్షణలో నిర్వహించినట్లు ఆలయ ఈవో కూచిపూడి శ్రీనివాస్ తెలిపారు. జాతర మహోత్సవాలకు స్థానిక గ్రామస్థులు, రాష్ట్రం నలుమూల నుండి భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై అమ్మవారిని దర్శించుకుంటున్నారు.

## తాగునీటి చెరువులను పరిశీలించిన కూటమి నాయకులు



కైకలూరు, ఫిబ్రవరి 24 () : వేసవి సమీపిస్తున్న వేళ కాల్వలకు నీరు విడుదలైంది. ఈ మేరకు సదరునీటితో తాగునీటి చెరువులనునింపుతన్నారు. ఈ క్రమంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ ప్రజా హామీలకమిటీ చైర్మన్, స్థానిక ఎమ్మెల్యే డా.కామినేని శ్రీనివాస్ సారధ్యంలో రానున్నవేసవికాలం దృష్ట్యా నియోజకవర్గంలో కాలువలు బాగు చేయించి ప్రజలకుతాగునీరు అందించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈనేపథ్యంలో మంగళవవారం మంచినీటి చెరువులకు నీరు నిల్వ చేసేప్రక్రియను డి.సి ఛైర్మన్ పొత్తూరి వాసురాజు, మండల టిడీపి అధ్యక్షులుపెన్మెత్స త్రినాథ్ రాజు, రాష్ట్ర తెలుగుయువత కార్యనిర్వహక కార్యదర్శి పూలరామచంద్రరావు (రాజీ), జిల్లా టిడిపి వాణిజ్య విభాగం అధ్యక్షులు కోట కోటిలింగం బాబు (కె.కె.బాబు), తెలుగుదేశం పార్టీ నాయకులు వీరాబత్తిన సుధ, టిడిపి మైనారిటీ నాయకులు యమ్.డి ఉస్మాన్, పట్టణ టిడిపి అధ్యక్షులు పడమట వాసు, సయ్యద్ బషీర్, బొల్లెంపల్లి కృష్ణారావు, పంచాయతీ శానిటరీ ఇన్స్పెక్టర్ శ్రీ రంగం, సిబ్బంది శ్యామలరావు, ఇరిగేషన్ సిబ్బంది తదితరులు పరిశీలించారు.

## గడువులోగా ఈ - క్రాప్ నమోదు పూర్తి చేయాలి : ఏడిఏ వెంకటమణి



మండవల్లి, ఫిబ్రవరి 24 : వ్యవసాయశాఖ మండవల్లిసబ్‌డివిజన్‌లోని వీఏఎలతో వ్యవసాయశాఖకు సంబంధించిన పలు అంశాలపై సమీక్షా సమావేశం మండవల్లి వ్యవసాయ శాఖ కార్యాలయం నందు జరిగింది. సమావేశంలో ఏడిఏ జి.వెంకటమణి పాల్గొని పలు అంశాలను వీఏఎలకు వివరించారు. మినుము పంట ఈక్రాప్ నమోదు, రైతు విశిష్ఠనెంబరునకు రైతుల రిజిస్ట్రేషన్ ప్రక్రియ, రైతులు ఏపిఎఐఎంఎస్ యాప్ డౌన్‌లోడు, వ్యవసాయ పరికరాలు అద్దెకు పొందుట తదితర వ్యవసాయ శాఖ కార్యక్రమాలపై ఏడిఏ గ్రామవ్యవసాయ సహాయకులకు అవగాహన కల్పించారు. ఈనెల 25 వతేదీతో ఈక్రాప్ నమోదు గడువు పూర్తవుతుందని ప్రభుత్వ పథకాలు వ్యవసాయశాఖ వారిచే అందించేవి ప్రతి రైతుకు అందాలంటే విశిష్టనెంబరు తప్పనిసరి అని ,యాప్ ద్వారా ఈపంట వివరాలు తెలుసుకోవచ్చని వ్యవసాయ పరికరాలు అద్దెకు పొందవచ్చని రైతులను చైతన్యం చేయాలని ఎల్లవేళలా రైతులకు అండగా ఉండాలని వీఏఎలను ఏడిఏ ఆదేశించారు. కార్యక్రమంలో ఏవోలు జి.శ్రీనివాసరావు, వేణుమాధవ్ పాల్గొన్నారు.

## రేపటి నుండి జనసేనపార్టీ సభ్యత్వాల నమోదు ప్రారంభం : నానాజీ



ముదినేపల్లి, ఫిబ్రవరి 24 ) : జనసేన పార్టీ సభ్యత్వాల నమోదు ఈనెల 26 నుంచి ప్రారంభిస్తున్నట్టు ఆ పార్టీ ఉమ్మడి కృష్ణాజిల్లా సంయుక్త కార్యదర్శి వేల్పూరి వెంకటేశ్వరరావు (నానాజీ)తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఓప్రకటన విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయనమాట్లాడుతూ..రూ. 2 కోట్లు విరాళంగా అందించిమొదటి సభ్యత్వాన్ని జనసేన అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ తీసుకున్నారన్నారు. ఈ సందర్భంగా పార్టీ కోసం పనిచేసే వారిని “ఉద్యమి - సాధక్ - ప్రదాత”లుగా వర్గీకరించి ఇకనుండి ఈ రకంగా పిలుస్తామనిప్రకటించారన్నారు. పార్టీ భావజాలాన్ని లోతుగా అర్థం చేసుకుని, సిద్ధాంతాలకు అనుగుణంగా పని చేసేందుకు ముందుకొచ్చి పార్టీ సభ్యత్వం తీసుకునేవారు ఉద్యమి సభ్యత్వం కిందకు వస్తారన్నారు. అలాగే, పార్టీ పోరాటానికి మరింత బలాన్ని చేకూర్చేలా కొత్తవారిని ప్రభావితం చేస్తూ, నవతరంలో ప్రేరణ కలిగించి పార్టీలోకి ఆహ్వానిస్తూ, సభ్యత్వాలు చేయించేవారిని సాధక్‌లుగా, పార్టీకి పరోక్షంగా ఆర్థిక, సాంకేతిక లేదా మేధోపరమైన సహకారం అందిస్తూ పార్టీ బలోపేతానికి కృషి చేసేవారిని ప్రదాతలుగా వ్యవహరిస్తామని, ఈనెల 26 నుంచి ప్రారంభం కానున్న సభ్యత్వాల నమోదులో పార్టీ శ్రేణులంతా పాల్గొని సభత్వాల నమోదు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని నానాజీ పిలుపునిచ్చారు.



# మనస్సుపెట్టి పనిచేసి లక్ష్యాలను అధిగమించాలి

### జనాభా లెక్కలు సేకరణలో పాల్గొనడం అదృష్టంగా భావించాలి

### శిక్షణా తరగతులు ప్రారంభంలో ఏలూరు జిల్లా కలెక్టర్ వెట్రిసెల్వి

ఏలూరు, ఫిబ్రవరి 24 ) : మనస్సుపెట్టి పనిచేసి లక్ష్యాలనుఅధిగమించాలని, జనాభా లెక్కలు సేకరణలో పాల్గొనడం అదృష్టంగా భావించాలని ఏలూరు జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి సూచించారు. జిల్లా కలెక్టరేటు గోదావరి సమావేశ మందిరంలో మంగళవారం భారత జనాభా లెక్కింపు- 2027 మొదటి దశలో గృహనిర్మాణ మరియు గృహ గణన జిల్లా మరియు చార్జ్ స్థాయి అధికారులకు మంగళవారం నుండి గురువారం వరకు మూడు రోజులలుపాటు నిర్వహించనున్న శిక్షణా తరగతులు సందర్భంగా జిల్లా కలెక్టరు కె.వెట్రిసెల్వి అధ్యక్షతన తొలిరోజు శిక్షణా కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించారు. జిల్లా కలెక్టరుతో పాటు, ఏపీ జనాభా లెక్కలు జాయింటు డైరెక్టరు, నేషనల్ ట్రైనరు జి.వి.చంద్రకళ, జిల్లా రెవెన్యూ అధికారి వి.విశ్వేశ్వర రావు, ఆర్డీవో యం.అచ్యుత అంబరీష్ లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టరు కె.వెట్రిసెల్వి మాట్లాడుతూ జనాభా లెక్కింపు- 2027 దేశ, రాష్ట్రాలు అభివృద్ధికి ప్రామాణిక డేటాను అందించే అత్యంత ముఖ్యమైన జాతీయ కార్యక్రమశీ అని, భారతదేశ జనాభా లెక్కింపు -2027 సేకరణలో పాల్గొనుటలో ఒక గొప్ప అదృష్టంగా భవించాలని, భవిష్తత్తులో తీపిజ్ఞాపకాలుగా ఉంటాయని మనస్సుపెట్టి పనిచేసి లక్ష్యాలను సాధించాలని అన్నారు. గృహనిర్మాణ మరియు గృహ గణన దశలో సేకరించే వివరాలు ప్రభుత్వ సంక్షేమ పథకాలు రూపకల్పనకు, ప్రణాళికలు అమలుకు కీలకమని పేర్కొన్నారు. నేషనల్ ట్రైనరు అందించే శిక్షణలో మార్గదర్శకాలను పూర్తిగా అవగాహన చేసుకుని, ఖచ్చితత్వం మరియు పారదర్శకతతో గణన ప్రక్రియను నిర్వహించాలని సూచించారు. ప్రతి గృహాన్ని సమగ్రంగా నమోదు చెయ్యడం ద్వారా సరైన మరియు విశ్వసనీయ గణాంకాలు సిద్ధం అమవుతాయని చెప్పారు. ప్రతి పౌరుడు నిర్భయంగా, స్వేచ్ఛగా తన సమాచారాన్ని నమోదు చేసుకునే అవకాశం ఉందని అన్నారు. ఈ శిక్షణలో జనాభా లెక్కింపు విధానాలు, ఫారమ్‌లు భర్తీ విధానం, డిజిటల్ సాధనాలు వినియోగం, ఫీల్డ్ స్థాయి సమస్యలు పరిష్కారం వంటి అంశాలపై సవివరంగా అవగాహన కల్పించ బడుతుందని తెలిపారు. జిల్లా మరియు చార్జ్ స్థాయి అధికారులు పెద్ద సంఖ్యలో హాజరై శిక్షణను పూర్తిగా ఆకళింపు చేసుకుని జనాభా లెక్కింపు సేకరణకు ముందస్తుగా ప్రణాళికలు రూపొందించుకోవాలని అన్నారు. జిల్లా పరిపాలన యంత్రాంగం ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు అవసర మైన అన్ని ఏర్పాట్లు చేస్తుందని ముందుగా ప్రణాళికలు సిద్ధం చేసుకుంటే చిన్న చిన్న సమస్యను అధిగమించవచ్చునని అన్నారు. మొదటిగా గ్రామాలు జాబితాలు సిద్ధం చేసుకోవాలని ఇళ్ల జాబితా, గృహాలు రకం, సౌకర్యాలు (నీరు, విద్యుత్తు, మరుగు దొడ్డులు) తదితర వాటిని నమోదు చేసుకోవాలని అన్నారు. ప్రతి ఆవాసం, మురికివాడలు, మారుమూల ప్రాంతాలు కవర్ అయ్యేలా, డబుల్ ఎంట్రీ లేకుండా పకడ్బందీగా గణన చేపట్టాలని అన్నారు. సెన్సస్ మార్గదర్శకాలు మేరకు జిల్లాలో జనగణన పరిధులు నిర్ణయాలు, పట్టణ ప్రాంతాల్లో ఛార్జ్ సెన్సస్ ఆఫీసర్లుగా మున్సిపల్ కమిషనర్లను, గ్రామీణ ప్రాంతాల్లో తహశీల్దార్లు ఉంటారని అన్నారు. అదనపు ఛార్జ్ అధికారిగా యంపీడివోలు, టెక్నికల్ అసిస్టెంట్లుగా సహాయ గణాంక అధికారి గాని డిజిటల్ అసిస్టెంటు ఉంటారని తెలిపారు. ప్రతి పౌరుడు తన సమాచారంతో పాటు కుటుంబ సమాచారం వివరాలను అందించ వలసిన బాధ్యత ఉందని అన్నారు. జనగణన ప్రక్రియ దేశానికి అత్యంత కీలకమైనదని, ప్రతి అధికారి కేటాయించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తించాలని జిల్లా కలెక్టరు కె.వెట్రిసెల్వి స్పష్టం చేశారు. సమావేశంలో ఆర్డీవో యం. అచ్యుత అంబరీష్, జెడ్పీ సిఈవో యం.శ్రీహరి, నగర పాలక సంస్థ కమీషనరు ఏ.భాను ప్రతాప్, సంబంధిత జిల్లా అధికారులు, జిల్లా కో-ఆర్డినేటరులు బి.భాగ్యప్ప, అశ్విన్ వాజ్ పేయి, తహశీల్దార్లు, యంపిడివోలు, మున్సిపల్ కమిషనర్లు, డిప్యూటీ తహశీల్దార్లు, సహాయ గణాంక అధికారులు, డిజిటల్ అసిస్టెంట్లు, తదితరులు పాల్గొన్నారు.

## ప్రగతి చూపని అధికారులపై చర్యలు తప్పవు

### వీడియో కాన్ఫరెన్స్‌లో అధికారులకు ఏలూరు జిల్లా కలెక్టర్ వెట్రిసెల్వి హెచ్చరిక



ఏలూరు, ఫిబ్రవరి 24( : ప్రగతి చూపని అధికారులపై చర్యలుతప్పవని సంబంధిత అధికారులను ఏలూరు జిల్లా కలెక్టర్ వెట్రిసెల్వి హెచ్చరించారు. జిల్లా కలెక్టరేటు జిల్లా కలెక్టరు ఛాంబరు నుండి ఏలూరు జిల్లా కలెక్టరు కె.వెట్రిసెల్వి జూమ్ కాన్ఫరెన్స్ ద్వారా అధికారులతో జూమ్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. జిల్లాలో ఆర్ డబ్ల్యు ఎస్, ఐసిడిఎస్ శాఖలు ద్వారా చేపట్టిన నిర్మాణ పనులు ప్రగతిపై సంబంధిత శాఖలు అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టరు కె.వెట్రిసెల్వి మాట్లాడుతూ 45 అంగన్వాడీ కేంద్రాలలో ఆర్ డబ్ల్యు ఎస్ శాఖ ద్వారా టాయిలెట్లు పనులు, 108 త్రాగునీటి సరఫరా పనులు నిర్దేశించగా ఇంకా 22 టాయిలెట్లు, 44 త్రాగునీటి సరఫరా పనులు, వాటరు ట్యాంకు పనులు ప్రారంభించకపోవడం అసహనం వ్యక్తం చేశారు. జిల్లాలోని అన్ని అంగన్వాడీ కేంద్రాలలో టాయిలెట్లు, త్రాగునీరు సౌకర్యాలు తప్పని సరిగా ఉండాలన్నారు. సంక్షేమ వసతి గృహాలు, అంగన్వాడి సెంటర్లలో విద్యార్థులు సంఖ్యకు తగిన విధంగా సురక్షిత తాగునీటి ఆర్ఓ ప్లాంట్లు, టాయిలెట్లు, మౌలిక సదుపాయాలు ఖచ్చితంగా ఉండాలని అన్నారు. గూగుల్ మీట్ లో ఆర్ బ్ల్యుఎస్ యస్ఇ జి.త్రినాధ్ బాబు, ఐసిడిఎస్ పిడి పి.శారద, సంబంధిత శాఖల డివిజినల్, మండల స్థాయి అధికారులు, ఇంజనీరింగు అధికారులు పాల్గొన్నారు.

## బిజెపి ఓబీసీ మోర్చా ఏలూరు జిల్లా ఉపాధ్యక్షురాలిగా రాధిక నియామకం



ముదినేపల్లి, ఫిబ్రవరి 24 (శ్రీ: ఏలూరు జిల్లా, ముదినేపల్లి మండలం అల్లూరు గ్రామం కొప్పు వెలమ సామాజిక వర్గానికి చెందిన రెడ్డి రాధిక బిజెపి ఓబీసీ మోర్చా ఏలూరు జిల్లా ఉపాధ్యక్షురాలిగా నియమితులయ్యారు. ఈ మేరకు సంబంధిత వర్గాలు ఉత్తర్వులు జారీ చేశాయి. రాధిక గతంలో జిల్లా మహిళా మోర్చా ఉపాధ్యక్షురాలిగా, ముదినేపల్లి మండల మహిళా కార్యదర్శిగా, మండల సభ్యత్వ ప్రముఖ్‌గా, 11 సంవత్సరాల మోదీ సుపరిపాలన నూజివీడు నియోజకవర్గ ఇంఛార్జ్‌గాపని చేశారు. ఆమె పార్టీకి చేసిన సేవలను గుర్తుంచి భారతీయ జనతా పార్టీ ఓబీసీ జిల్లా అధ్యక్షుడు అగ్రహారపు వెంకటేశ్వరరావు..రాధికను జిల్లా ఓబీసీ ఉపాధ్యక్షురాలుగా నియమిస్తూ నియామక పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా ఆమెకు జిల్లా బీజేపీ నాయకులు, కైకలూరు నియోజకవర్గ నాయకులు, ఎన్డీఏ కూటమి నాయకులు అభినందనలు తెలిపారు. ఈసందర్భంగా రాధిక మాట్లాడుతూ తనకు ఈ అవకాశం కల్పించటంలో సహకరించిన ఎమ్మెల్యే డా.కామినేని శ్రీనివాస్, జోనల్ ఇంచార్జ్ బాలకృష్ణ, జిల్లా ఇంచార్జ్ కొండపల్లి రామకృష్ణ, ఓ.బి.సి.మోర్చా జిల్లా అధ్యక్షుడు అగ్రహారపు వేంకటేశ్వరరావు, బిజెపి జిల్లా అధ్యక్షులు విక్రమ్ కిషోర్‌లకు ధన్యవాదాలు తెలిపారు. పార్టీ తనపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా పార్టీ పటిష్టతకు, వెనుక బడిన వర్గాల హక్కుల పరిరక్షణకు, స్థిరమైన అభ్యున్నతికి , మహిళా సంక్షేమం, మహిళా సాధికారతకు కట్టుబడి తన పరిధిలో కృషి చేస్తానని తెలిపారు.

## ఏలూరును నేర రహిత జిల్లాగా తీర్చిదిద్దుదాం

### వీడియో కాన్ఫరెన్స్‌లో ఏలూరు జిల్లా ఎస్పీ ప్రతాప్ శివకిషోర్



ఏలూరు, ఫిబ్రవరి 24 () : నేర రహిత జిల్లాగా ఏలూరు ను తీర్చి దిద్దుదామని ఎస్పీ కె. ప్రతాప్ శివ కిషోర్ అధికారులకు దిశా నిర్దేశశ చేశారు. సబ్ డివిజన్ అధికారులతో జిల్లా ఎస్పీ శివకిషోర్ మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. జిల్లా లో శాంతి భద్రతల పరిరక్షణ, నేర నియంత్రణ, ప్రజల భద్రతకు అత్యున్నత ప్రాధాన్యతనిస్తూ ఏలూరు, జంగారెడ్డిగూడెం, పోలవరం, నూజివీడు సబ్ డివిజన్ల పోలీస్ అధికారులతో ఎస్పీ ప్రత్యేక వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేసుల్లో దర్యాప్తు వేగవంతం చేయాలని, పోలీస్ స్టేషన్లల్లో పెండింగ్‌లో ఉన్న కేసుల దర్యాప్తును వేగవంతం చేయాలని, బాధితులకు త్వరితగతిన న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కోర్టు మానిటరింగ్ సభ్యులు కేసుల విచారణ సమయంలో సాక్షులను సకాలంలో హాజరుపరచాలని, ముద్దాయిలకు శిక్షలు పడేలా పటిష్టమైన సాక్ష్యాధారాలను కోర్టుకుసమర్పించాలని సూచించారు. బాధితు లకు పూర్తిస్థాయి రక్షణ కల్పించాలనిస్పష్టం చేశారు. మహిళలు, బాలికల భద్రత కోసం ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన శక్తి టీం సభ్యులు మరింత క్రియా శీలంగా వ్యవహరించాలనిఆదేశించారు. ప్రతి సోమవారం నిర్వహించే పబ్లిక్ గ్రీవెన్స్ లో వచ్చేఫిర్యాదులపై చట్ట ప్రకారం విచారణ జరిపి కాల పరిమితి లోపుగా చర్యలుతీసుకోవాలని సదరు ఫిర్యాదులపై తీసుకున్నటువంటి చర్యలనుఫిర్యాదుదారులకు తెలియజేయాలని, పాఠశాలలు, కళాశాలలు, బహిరంగప్రదేశాలలో ఆకతాయిల వేధింపులు లేకుండా నిరంతర నిఘా ఉంచాలన్నారు. రహదారి భద్రత జిల్లావ్యాప్తంగా ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించేలా అవగాహనకార్యక్రమాలు నిర్వహించాలని, ట్రాఫిక్ నిబంధనల అమలులో రాజీపడకూడదని తెలిపారు. నేర నియంత్రణ ఉ నిఘా పాత నేరస్థులు తిరిగినేరాల బాట పట్ట కు సూచించారు. విద్యార్థుల ప్రయోజనం ప్రస్తుతం ఇంటర్మీడియట్ పరీక్ష లు జరుగుతున్న నేపథ్యంలో, విద్యార్థు లకు ఎటు వంటి అసౌకర్యం కలగకుండా పరీక్షా కేంద్రాల వద్ద తగిన భద్రతా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగించే వారి పట్ల ఉక్కుపాదం మోపాలి. నేరగాళ్ల గుండెల్లో పోలీస్ శాఖ అంటే భయం ఉండాలి. ప్రజలు తమ సమస్య లతో పోలీస్ స్టేషన్ కు వచ్చినప్పుడు వారికి భరోసా కల్పించేలా అధికారుల పనితీరు ఉండాలి అని ఎస్పీ స్పష్టం చేశారు. అసాంఘిక కార్యకలాపాల నిర్మూలన కొరకు డ్రోన్ కెమెరా ద్వారా నిఘాలను కొనసాగించి పేకాట కోడిపందాలను నివారించాలని పోలీసులను ఆదేశించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో ఎస్‌బి ఇన్‌స్పెక్టర్ మల్లేశ్వరరావు, డి.సి. ఆర్. బి ఇన్‌స్పెక్టర్ హబీబ్ భాషా, ఐటీ కోర్ ఇంచార్జి నరేంద్ర, మహిళా ఎస్ఐ లపాటు జిల్లాలోని డీఎస్పీలు, సీఐలు, ఎస్సైలు పాల్గొన్నారు.

# ఇసుక స్మగ్లింగ్‌పై ఉక్కుపాదం మోపాలి

**ప్రత్యేక కమిటీలో పర్యవేక్షణ చేయాలి**

**అక్రమ రవాణా చేస్తే వాహనాలు సీజ్ చేయాలే**

**ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు**



**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (నినాదం):** జిల్లాలో ఇసుక అక్రమ రవాణాపై ఉక్కుపాదం మోపాలని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అధికారులను ఆదేశించారు. మంగళవారం ఐడిఓసి కార్యాలయంలో రెవెన్యూ, పోలీస్, మైనింగ్, టిజి ఎండిసి, పంచాయతీ రాజ్ శాఖల అధికారులతో ఇసుక అక్రమ రవాణా నియంత్రణ, ఇందిరమ్మ ఇండ్లకు ఇసుక సరఫరా, కొడవటంచ దేవాలయ జాతర ఏర్పాట్లు, రైతులు యూరియా కొరకు యాప్ ద్వారా బుకింగ్ చేయుట తదితర అంశాలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇసుక అక్రమ రవాణాపై ఎలాంటి రాజీ పడకూడదని స్పష్టం చేశారు. రెవెన్యూ, పోలీస్, టిజి ఎండిసి శాఖలతో ప్రత్యేక కమిటీలు ఏర్పాటు చేసి పటిష్ట పర్యవేక్షణ చేపట్టాలని ఆదేశించారు. ఇసుక రవాణాను సిసి కెమెరాల ద్వారా నిఘా పెట్టాలని సూచించారు. అక్రమంగా ఇసుక తరలించినట్లయితే తక్షణమే కేసులు నమోదు చేసి వాహనాలను సీజ్ చేసి రిమాండ్ చేయాలని స్పష్టంచేశారు. ఇసుక రవాణాకు నంబర్లు లేని వాహనాలకు అనుమతి లేదని, డ్రైవర్లు తప్పనిసరిగా లైసెన్స్, ఇన్సూరెన్స్ కలిగి ఉండాలని, వేగ నియంత్రణ పాటించాలని, మైనర్లు వాహనాలు నడపకూడదని తెలిపారు. ఇసుక నియోజకవర్గ ప్రజల అవసరాలకే వినియోగించాలని జిల్లా దాటి ఇసుక తరలించరాదని తెలిపారు. ట్రాక్టర్ల ద్వారా మాత్రమే రవాణా చేయాలని, ఇసుక తవ్వకాల్లో యంత్రాలు వాడకూడదని, మనుషులను వినియోగించాలన్నారు. అక్రమ నిల్వలు గుర్తించిన వెంటనే సీజ్ చేసి కేసులు నమోదు చేయాలని తెలిపారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి అవసరమైన ఇసుకను కూపన్ల విధానంలో సరఫరా చేయాలని ఎమ్మెల్యే సూచించారు. తప్పుడు పత్రాలు సమర్పించినట్లయితే సంబంధిత వారిపై పోలీస్ కేసులు నమోదు చేయాలని హెచ్చరించారు. ఈ నెల 25 నుండి ప్రారంభం కానున్నకొడవటంచ దేవాలయ జాతరకు భక్తులు అధిక సంఖ్యలో వచ్చే అవకాశం ఉన్నందున పారిశుద్ధ్య చర్యలు, తాగునీరు, ఆరుగుదొడ్లు, పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే సూచించారు. జిల్లాలో యూరియా కొరత లేదని, రైతులు యాప్ ద్వారా బుకింగ్ చేసుకునేలా అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని వ్యవసాయ అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో కలెక్టర్ రాహుల్ శర్మ, ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్, అదనపు కలెక్టర్లు అశోక్ కుమార్, విజయలక్ష్మి, గృహ నిర్మాణ శాఖ పిడి లోకిలాల్, మైనింగ్ ఏడి జయరాజ్, టీజీఎండిసి పిఓ రామకృష్ణ,నియోజకవర్గ పరిధిలోని మండలాల తహసిల్దారులు, ఎంపీడీవోలు తదితరులు పాల్గొన్నారు.

# ఉంటే కష్టం.. లేకుంటే నీ ఇష్టం..!

**డబుల్ లబ్దిదారులతో ఎమ్మెల్యే వైకుంఠ పాలి**

**వసతుల కల్పన కలేనా..?**





**జగిత్యాల ప్రతినిధి ఫిబ్రవరి 24 నినాదం :** బసవన్న ముందు పల్లేరు కాయలు పోసి తింటే నీకు పాపం, తినకపోతే నాకు పాపం అన్నట్టు ఉంది ఎమ్మెల్యే పట్టణ పేదలకు కేటాయించిన డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల పరిస్థితి. జగిత్యాల అర్బన్ ఇల్లు లేని నిరుపేదల జీవితాలతో ఎమ్మెల్యే సంజయ్ కుమార్ వైకుంఠపాళి ఆడుతున్నారు. 4360 బెడ్ రూములు గత బిఆర్ఎస్ ప్రభుత్వం నిర్మించిన ఇప్పటివరకు వాటికి మౌలిక వసతుల కల్పన జరగకపోవడంతో లబ్ధిదారులు అనేక అవస్థలు పడుతున్నారు. ఇప్పుడున్న కాంగ్రెస్ ప్రభుత్వం దాదాపు 70 లక్షల రూపాయలు కేటాయించిన డబుల్ బెడ్ రూమ్ లబ్ధిదారులకు రూపాయి ప్రయోజనం కలుగలేదు. బడ్జెట్ కేటాయించిన ప్రభుత్వం తప్పిదమా..? సౌకర్యాలు కల్పిస్తానని తీసుకొచ్చిన ఎమ్మెల్యే తప్పిదమా? విరసి నూకపల్లి హౌసింగ్ బోర్డ్ కాలనీ డబుల్ బెడ్ రూమ్ లబ్ధిదారుల అవస్థలు వర్ణనాతీతం ఈ మేరకు జగిత్యాల మున్సిపాలిటీ 39 వ వార్డు మాజీ కౌన్సిలర్ అనుమల్ల జయశ్రీ కలెక్టర్కు ఫిర్యాదు చేశారు. బెడ్ రూమ్ లబ్ధిదారులకు మౌలిక వసతులు కల్పన కల్పించాలని ఆమె వినతి పత్రంలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా జయశ్రీ మాట్లాడుతూ.. దాదాపు “3 సంవత్సారాలు “ అవుతున్న అక్కడ “4520” ఇండ్ల నిర్మాణం చేయగా దాదాపు “4360 ‘ఇండ్లను కేటాయించగా ఇంకా కేవలం” 160 “ ఇండ్లు మాత్రమే మిగిలి ఉన్నట్లు తెలిసింది. ఈ 4360 ఇండ్లకు సంబందించి లబ్ధిదారులందరు డిసెంబర్ 31 “ 2025 లోపల ప్రతి ఒక్కరు. ఇండ్లలో నివాసం ఉండాలని మీరు ఆదేశాలు జారీచేయగా, భయపడి కొంత మంది లబ్ధిదారులు వెళ్ళడం జరిగింది. కాని అక్కడ నివసించే ప్రతి ఒక్కరు ఉపాది నిమిత్తం జగిత్యాల పట్టణానికి రావల్సిన పరిస్థితి పిల్లలు స్కూలు, కాలేజీల కొరకు,పెద్దలు పని కొరకు ఏఅవసరానికైనా జగిత్యాల పట్టణానికి రావాల్సిన పరిస్థితి.కావున మీరు వీరి సమస్యను మానవతా దృక్పదంతో ఆలోచించినట్లయితే ఇక్కడ బస్సు సౌకర్యం ఏర్పాటు అనేది తొందరగా అవుతుంది. ఎందుకంటే, జగిత్యాల పట్టణానికి నూకపెల్లి మెయిన్ రోడ్ వరకు ఉన్న దూరం దాదాపు “5 కి.మీ”. మెయిన్ రోడ్డు నుండి నూకపెల్లి కాలనీ వారకు దాదాపు 2 కిమీ ఉంటుంది. ఇక్కడ నుండి ఆటోలో వచ్చినట్లయితే దాదాపు రాను పోను ఒక్కొక్కరికి “200 రూ” ఖర్చు అవుతున్నది కావున అందరూ జగిత్యాల పట్టణం లోనే కిరాయి ఉండటానికి మొగ్గు చూపడం వల్ల వారి సొంతింటి కల కళగానీ మిగిలిపోమె పరిస్థితి ఏర్పాడు తున్నది కావున వెనువెంటనే “డిపో మేనేజర్” గారి దృష్టికి సమస్య తీసుకు వెళ్ళి వెను వెంటనే బస్ సౌకర్యం ఏర్పాటు చేయాలి

**పోలీస్ స్టేషన్:** నూక పెల్లి డబుల్ బెడ్రూం ల వద్ద నివసిస్తున్నా కొన్ని కుటుంబాలకు రక్షణ కరవయి సాయంత్రం “5గంటలు” దాటిందంటే బయటకు రాని పరిస్థితి ఎందుకంటే కొంత మంది అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడుతూ గొడవలు సృష్టిస్తున్నారని అక్కడున్న ప్రజలు చెప్పటం జరిగింది. మరియు ఇక్కడ మిస్సింగ్ కేసులు కూడ నమోదు అవుతున్నాయి.ఇక్కడ ఉండే మహిళలకు, ప్రజలకు రక్షణ అనేది తప్పనిసరి కావున వెంటనే ఒక “పోలీస్ స్టేషన్” ఏర్పాటు కొరకు ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్ళి స్టేషన్ ఏర్పాటు చర్యలు తీసుకోవాలని లాబ్దిదారులందరి పక్షాన మా మనవి.

**మౌళిక సదుపాయాలు:** ఇక్కడ ఇంత పెద్ద అర్బన్ హౌసింగ్ కాలనీ ఏర్పాటు చేసి దాదాపు “3 సంవత్సరాలు” గడుస్తున్నప్పటికి పూర్తి స్థాయి రోడ్ల నిర్మాణం, డ్రైనేజీ నిర్మాణం వాటర్ సప్లయి, కరెంటు అనేవి. పూర్తి స్థాయిలో ఏర్పాటు కాలేదు. వీటన్నింటినీ పూర్తి స్థాయిలో ఏర్పాటు చేసి ప్రజలకు అందుబాటులోకి తేవాలని మనవి. మరియు ఇక్కడ నివసిస్తున్న ప్రజల ఇండ్ల మద్య చెత్త రిక్షా ,కాని రోడ్లు స్విపింగ్ చేయడం కానీ వీటిని మెయింటెనెన్స్, వీధి దీపాలు, పూర్తి స్థాయిలో చేయకపోవటం ప్రజలు కొంత మంది అక్కడున్న వారు ఇబ్బందులు పడుతున్నారు. ఇక్కడ మెంటనెన్స్ సానిటేషన్ కొరకు కొంత మంది కార్మికుల నియామకం చేసినట్లు కౌన్సిల్ మీటింగ్ లో చెప్పటం జరిగింది. అక్కడ ఏ ఒక్క సానిటేషన్ వర్కర్ లేదు డ్రైన్లు క్లీన్ చేయటం, ఊడ్వటం మరియు చెత్త సేకరణ చేయకపోవడంతో ప్రజలు మురుగు కాల్వలలో లేదంటే రోడ్ల మూలల వద్ద చెత్తను వేయడం వల్ల దుర్గంధం ఏర్పడి పరిసరాలు కలుషితమవుతున్నాయి. కావున వెనువెంటనే సానిటేషన్ సక్రమంగా జరిగే విధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

# కాంగ్రెస్ అరాచకాలను ఎండగడతాం

**మాజీమంత్రి**

**కేటీఆర్ ధ్వజం**



**నిర్మల్ ప్రతినిధి, (సోన్ ) ఫిబ్రవరి24 (నినాదం):** హైదరాబాద్ నుండి ఆదిలాబాద్ వెళ్తున్న బిఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు, మాజీ మంత్రి కల్వకుంట్ల తారక రామారావుకు సోన్ మండలంలోని కడ్తల్ టోల్ ప్లాజా వద్ద బిఆర్ఎస్ నాయకులు ఘనస్వాగతం పలికారు. నియోజకవర్గ ఇన్‌చార్జ్ రామ్ కిషన్ రెడ్డి, జాన్సన్ నాయక్, మాజీ కౌన్సిలర్ రాజేందర్, రాథోడ్ అశోక్, జాన్ సత్య తదితరులు కేటీఆర్‌ను శాలువా మరియు పూలమాలలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. ఇటీవల జరిగిన గొడవల్లో బిఆర్ఎస్ నాయకుడు బాల్క సుమన్ అరెస్టును తీవ్రంగా ఖండించారు. కాంగ్రెస్ ప్రభుత్వం రాజ్యాంగాన్ని తమ సొంత పార్టీ ప్రయోజనాల కోసం వాడుకుంటోందని మండిపడ్డారు. రానున్న రోజుల్లో బిఆర్ఎస్ అధికారంలోకి రాగానే కాంగ్రెస్ అరాచకాలను బయటపెడతామని ఆయన హెచ్చరించారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో రేవంత్ రెడ్డి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని కేటీఆర్ విమర్శించారు. మహిళలకు తులం బంగారం, రైతులకు రుణమాఫీ, నిరుద్యోగులకు ఉద్యోగాలు, ఇల్లు లేని పేదలకు ఇళ్లు ఇస్తామని అజెండాలో రాసి గెలిచిన తర్వాత మాట మారుస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణ ప్రజలను మోసం చేసి అధికారంలోకి వచ్చిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తక్షణమే ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. పెంచిన పింఛన్లను వెంటనే విడుదల చేయాలని, కొత్త పింఛన్లను మంజూరు చేయడంతో పాటు రైతులకు రుణమాఫీని తక్షణమే అందజేయాలని కోరారు. ప్రజా సమస్యలపై ప్రశ్నిస్తున్న బిఆర్ఎస్ నాయకులను అరెస్ట్ చేయడం సిగ్గుచేటని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్మూర్ బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొని తమ మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో టిఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ఇంటర్ పరీక్షల నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి

**జిల్లా కలెక్టర్ కె. హరిత**



**కొమురం భీం ఆసిఫాబాద్ ప్రతినిధి, ఫిబ్రవరి 24(నినాదం) :** జిల్లాలో ఇంటర్మీడియట్, ప్రథమ ద్వితీయ పరీక్షల నిర్వహణకు పూర్తి స్థాయి ఏర్పాట్లు చేయడం జరిగిందని కలెక్టర్ కె .హరిత ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెల 25 నుండి మార్చి 18 వరకు ఇంటర్, ప్రథమ, ద్వితీయ సవత్సరం పరీక్షలు ఉదయం 9 నుండి మద్యాహ్నం 12 గంటల వరకు ఉంటాయని తెలిపారు. ఇంటర్ పరిక్షల కొరకు 19 పరిక్షా కేంద్రాలను ఏర్పాటు చేశామని, ఇంటర్ ప్రథమ, ద్వితీయ ఒకేషనల్ కోర్సుకు చెందిన 9716 మంది విద్యార్థులు హాజరుతున్నారని తెలిపారు. పరీక్షల కేంద్రంలో త్రాగునీరు, పారిశుద్ధ్యం,సరిపడ పర్నిచర్, వెలుతురు, ఫ్యాన్లు, విద్యుత్ సరఫరా వుండేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. పరీక్ష కేంద్రం వద్ద బిఎన్ఎస్ 163 చట్టం ప్రకారం 144 సెక్షన్ ఉంటుందని పరీక్షలు జరిగే సమయాలలో జిరాక్స్, ఇంటర్నెట్ షాపులు మూసి వుంచేల చర్యలు తీసుకుంటున్నా మన్నారు. ప్రశ్న,జవాబు పత్రాల తరలింపులో జాగ్రత్తలు తీసుకుంటా మన్నారు. పరిక్ష కేంద్రం వద్ద అవసరమైన మందులు, ఓ ఆర్ యస్ ప్యాకెట్లలో వైద్య సిబ్బంది వుంటారని, పరిక్ష కేంద్రంలో సెల్ ఫోన్లు, ఎలక్రానిక్ పరికరాలకు అనుమతి లేదన్నారు. విద్యార్థులు పరీక్ష సమయానికి ముందే పరిక్ష కేంద్రాలకు చేరుకోవాలన్నారు. సమయానికి చేరుకునేల ఆర్టిసి బస్సులు నడిచేల చర్యలు తీసుకుం టామన్నారు. పరీక్షలను ప్రశాంతంగా జరిగేల అధికారులు సమన్వయంతో పని చేసేలా పర్యవేక్షించడం జరుగుతుందని కలెక్టర్ పేర్కొన్నారు.

NINADAM CINEMA

# కల్కి-2 షూటింగ్‌లో బచ్చన్, కమల్



పాన్ ఇండియా లెవల్లో భారీ విజయాన్ని అందుకున్న 'కల్కి 2898 -2' సీక్వెల్ షూటింగ్ శరవేగంగా ప్రారంభమైంది. ఈ నేపథ్యంలో బాలీవుడ్ మెగాస్టార్ అమితాబ్ బచ్చన్, విశ్వనటుడు కమల్ హాసన్ సెట్స్‌లో కలుసుకున్న ఫోటోలు ప్రస్తుతం సోషల్ మీడియాలో ట్రెండింగ్‌గా మారాయి. హైదరాబాద్‌లోని రామోజీ ఫిలిం సిటీలో 'కల్కి 2' షూటింగ్ మొదలైనట్లు తెలుస్తుంది. ఈ షెడ్యూల్‌లో అమితాబ్ బచ్చన్ (అశ్వత్థామ), కమల్ హాసన్ (సుప్రీమ్ యాస్కిన్) మధ్య కీలక సన్నివేశాలను దర్శకుడు నాగ అశ్విన్ చిత్రీకరిస్తున్నారు. పాన్ ఇండియా లెవల్లో భారీ విజయాన్ని అందుకున్న 'కల్కి 2898 ఎడి' సీక్వెల్ షూటింగ్ శరవేగంగా ప్రారంభమైంది. ఈ నేపథ్యంలో బాలీవుడ్ మెగాస్టార్ అమితాబ్ బచ్చన్, విశ్వనటుడు కమల్ హాసన్ సెట్స్‌లో కలుసుకున్న ఫోటోలు ప్రస్తుతం సోషల్ మీడియాలో ట్రెండింగ్‌గా మారాయి. హైదరాబాద్‌లోని రామోజీ ఫిలిం సిటీలో 'కల్కి 2' షూటింగ్ మొదలైనట్లు తెలుస్తుండగా.. ఈ షెడ్యూల్‌లో అమితాబ్ బచ్చన్ (అశ్వత్థామ), కమల్ హాసన్ (సుప్రీమ్ యాస్కిన్) మధ్య కీలక సన్నివేశాలను దర్శకుడు నాగ అశ్విన్ చిత్రీకరిస్తున్నారు. అమితాబ్ బచ్చన్ తన బ్లాగ్ ద్వారా ఈ ఫోటోలను షేర్ చేస్తూ.. 'దాదాపు 40 ఏళ్ల తర్వాత మళ్ళీ కమల్ హాసన్‌తో కలిసి పనిచేయడం గొప్ప అనుభూతినిస్తోంది. చివరిసారిగా మేమిద్దరం 1985లో 'గిరఫ్తార్' సినిమాలో కలిసి నటించాం' అని రాసుకొచ్చారు. ఇక అమితాబ్ షేర్ చేసిన ఫోటోలలో ఇద్దరు స్టార్స్ ఆత్మీయంగా కౌగిలించుకోవడం, సరదాగా ముచ్చటించుకోవడం కనిపిస్తోంది. ఇందులో బిగ్ బీ తన అశ్వత్థామ గెటప్‌లో కనిపించబోతున్నాడు.

# కేరళ స్టోరీ మూవీపై హైకోర్టు విచారణ




ముందుగా కోర్టులో చిత్ర ప్రదర్శనకు ఆదేశం

'ది కేరళ స్టోరీ 2' విడుదలకు ముందు కోర్టులో ప్రదర్శించాలని కేరళ హైకోర్టు పేర్కొంది. ఈ సినిమాలో కేరళను తప్పుగా చూపించారని ఆరోపణలు నెలకొన్న నేపథ్యంలో ఈ వ్యాఖ్యలు చేసింది. మతపరమైన ఉద్రిక్తతలకు దారితీసే అంశాలు ఉన్నాయనే రాష్ట్ర ప్రజల ఆందోళనలను విస్మరించలేమని కోర్టు పేర్కొంది. ఈ సినిమా సెన్సార్‌ను సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్‌పై మంగళవారం కేరళ హైకోర్టులో విచారణ జరిగింది. కోర్టులు సాధారణంగా సినిమాలకు సంబంధించి భావవ్యక్తీకరణ స్వేచ్ఛ విషయంలో జోక్యం చేసుకోదు. కానీ.. ఈ సినిమా టైటిల్‌లో కేరళ రాష్ట్రం పేరు ఉపయోగించారని ఈ నేపథ్యంలో దీనిపై విచారణకు అంగీకరించినట్లు పేర్కొంది. ఫిబ్రవరి 25న 'ది కేరళ స్టోరీ 2'ను కోర్టులో ప్రదర్శించాలని ఆ తర్వాతే దీని సెన్సార్ విషయంలో నిర్ణయం తీసుకోగలమని తెలిపింది. కామాఖ్య నారాయణ్ సింగ్ దర్శకత్వంలో రూపొందిన ఈ సినిమాకు సెన్సార్ బోర్డు ఇటీవల 'యూ/ఏ' సర్టిఫికెట్ జారీ చేసింది. 2023లో వివాదాల నడుమ విడుదలైన 'ది కేరళ స్టోరీ'కి సీక్వెల్‌గా రూపొందింది 'ది కేరళ స్టోరీ 2: గోస్ బియాండ్'. టీజర్, ట్రైలర్లు విడుదలయ్యాక ఈ మూవీ కూడా చర్చనీయాంశంగా మారింది. దీనిపై తాజాగా.. కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ దీనిపై స్పందించారు. ఈ సినిమాపై అప్రమత్తంగా ఉండాలని ప్రజలను కోరారు. దీన్ని బహిష్కరించాలని పిలుపునిచ్చారు. ఫిబ్రవరి 27న ఈ చిత్రం విడుదల కానుంది.

# మీనాక్షి చౌదరిని వారు వదలరా..



సినిమా ఇండస్ట్రీలో ఏదైనా ఒక బ్యానర్లో ఒక హీరో నటించి మంచి విజయాన్ని అందుకున్నాడు అంటే, వారి బ్యానర్లో మరికొన్ని సినిమాలు రావడానికి చాలా అవకాశాలు ఉంటాయి. ఒకే బ్యానర్లో హీరోయిన్లు కూడా ఒకటి, రెండు సినిమాలు నటించడం అనేది సర్వసాధారణమైన విషయం. కానీ ఒక హీరోయిన్ మాత్రం ఒకే బ్యానర్లో వరుసగా సినిమాలు చేస్తుంది. ఇప్పటివరకు తక్కువ కాలంలోనే ఆ నటి ఒక బ్యానర్లో మూడు సినిమాలు చేస్తే, మూడు విజయాలను సాధించాయి. ఇక ఆ హీరోయిన్ అదే బ్యానర్లో నాలుగవ సినిమా కూడా చేసే అవకాశాలు ఉన్నట్లు విశ్వసనీయ వర్గాల నుండి సమాచారం అందుతుంది. ఇంతకు ఆ బ్యూటీ ఎవరు అనుకుంటున్నారా? ఆమె మరెవరో కాదు మీనాక్షి చౌదరి. ఈమె సితార ఎంటర్టైన్మెంట్ బ్యానర్లో వరుసగా సినిమాలు చేస్తుంది. మొదటగా సితార ఎంటర్టైన్మెంట్ బ్యానర్లో ఈ బ్యూటీ ‘గుంటూరు కారం’ అనే చిత్రంలో నటించింది. ఈ సినిమా పర్వాలేదు అనే స్థాయి సక్సెస్ను సొంతం చేసుకుంది. ఈ సినిమాలో ఈమెది చిన్న పాత్ర. ఆ తర్వాత ఈమె ఇదే బ్యానర్లో ‘లక్కీ భాస్కర్’ అనే చిత్రంలో నటించింది. ఇది సూపర్ విజయాన్ని సొంతం చేసుకుంది. అలాగే ఇందులోని మీనాక్షి పాత్రకు మంచి ప్రశంసలు దక్కాయి. తాజాగా ఈమె ఈ బ్యానర్లో ‘అనగనగా ఒక రాజు’ అనే సినిమాలో నటించింది. ఈ మూవీ ఈ సంక్రాంతికి విడుదలై మంచి సక్సెస్ను అందుకుంది. ఇలా ఇప్పటికే ఈ బ్యానర్లో మూడు సినిమాల్లో నటించి మూడింటితో విజయాలను అందుకున్న ఈ హీరోయిన్కి ఇదే బ్యానర్లో నాలుగో అవకాశం కూడా దక్కే ఛాన్సెస్ ఉన్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం సితార సంస్థ వారు కార్తీతో ఓ సినిమా చేయడానికి రెడీ అయ్యారు. ఇందులో హీరోయిన్ పాత్ర కోసం భాగ్యశ్రీ బోర్సే మరియు మీనాక్షి చౌదరిని అనుకుంటున్నట్లు తెలుస్తోంది. ఈ బ్యూటీ సితార బ్యానర్లో నటించినట్లు అవుతుంది.

# వారణాసి కోసం జార్జియాకు మహేశ్ బాబు



సూపర్‌స్టార్ మహేశ్ బాబు, దర్శకధీరుడు ఎస్.ఎస్. రాజమౌళి కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న ప్రతిష్టాత్మక చిత్రం 'వారణాసి'పై దేశవ్యాప్తంగా కాకుండా అంతర్జాతీయ స్థాయిలోనూ భారీ అంచనాలు నెలకొన్నాయి. ఫాంటసీ మైథలాజికల్ యాక్షన్ అడ్వెంచర్‌గా రూపుదిద్దుకుంటున్న ఈ చిత్రం భారీ బడ్జెట్‌తో నిర్మితమవుతోంది. కథను కె.వి. విజయేంద్ర ప్రసాద్, ఎస్.ఎస్. కాంచి అందిస్తుండగా, మాటలను దేవ కట్టా రచిస్తున్నారు. సంగీతాన్ని ఆస్కార్ విజేత ఎం.ఎం. కీరవాణి సమకూరుస్తున్నారు. సినిమాలో మహేశ్ బాబు ద్విపాత్రాభినయం చేయనున్నారని సమాచారం. 'రుద్ర'గా శక్తివంతమైన యోధుడిగా, అలాగే పౌరాణిక ఎపిసోడ్‌లో 'రాముడు'గా దర్శనమివ్వనున్నారని టాక్ వినిపిస్తోంది. బాలీవుడ్ స్టార్ ప్రియాంక చోప్రా 'మందాకినీ' పాత్రలో నటిస్తుండగా, పృథ్వీరాజ్ సుకుమారన్ 'కుంభ' అనే కీలక పాత్రలో కనిపించనున్నారు. ఇటీవల విడుదలైన టైటిల్ గ్లింప్స్‌కు అద్భుతమైన స్పందన లభించింది. విజువల్స్, బ్యాక్‌గ్రౌండ్ స్కోర్, పాత్రల పరిచయంతోనే సినిమాపై అంచనాలు గరిష్ట స్థాయికి చేరాయి. హైదరాబాద్ షెడ్యూల్‌ను విజయవంతంగా పూర్తి చేసిన యూనిట్, తదుపరి షెడ్యూల్ కోసం జార్జియాకు వెళుతున్నారు . ఈ నెలాఖరులో ప్రారంభమయ్యే ఈ షెడ్యూల్‌లో ప్రధాన తారాగణంపై భారీ యాక్షన్ సన్నివేశాలను చిత్రీకరించనున్నారు. ఆఫ్రికన్ ఫారెస్ట్ బ్యాక్‌డ్రాప్‌లో సాగే అడ్వెంచర్ ఎపిసోడ్‌లను విదేశీ లొకేషన్లలో తెరకెక్కించనున్నారని తెలుస్తోంది. అయితే జార్జియాకి వెళుతున్న మహేష్ బాబుకి భార్య నమ్రత, కూతురు సితార సెండాఫ్ ఇచ్చారు. ఇందుకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఇక ఇదిలా ఉంటే గ్రాండ్ యాక్షన్ బ్లాక్స్, భారీ సెట్స్ ఈ షెడ్యూల్‌కు ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్నాయి. రామాయణానికి సంబంధించిన ఎపిసోడ్ చిత్రీకరణ ఇప్పటికే పూర్తయిందని రాజమౌళి వెల్లడించడం సినిమాపై ఆసక్తిని మరింత పెంచింది.

# జోరు మీదున్న కిరణ్ అబ్బవరం



టాలీవుడ్‌లో సక్సెస్ ఒక్కటి పడితే హీరోల మార్కెట్ విలువ ఎలా పెరుగుతుందో మరోసారి చర్చకు దారితీసింది. యువ హీరో కిరణ్ అబ్బవరం. వరుసగా మంచి విజయాలు అందుకుంటూ తనకంటూ ప్రత్యేక స్థానం సంపాదించుకున్నాడు. ప్రస్తుతం ఇండస్ట్రీలో ఫుల్ క్రేజ్‌ను ఆస్వాదిస్తున్నారని ట్రేడ్ వర్గాలు చెబుతున్నాయి. ఇటీవల వచ్చిన 'క', 'కె ర్యాంప్' సినిమాలు బాక్సాఫీస్ వద్ద మంచి ఫలితాలు సాధించడంతో కిరణ్ అబ్బవరం మార్కెట్ గణనీయంగా పెరిగిందని సమాచారం. కంటెంట్‌కు ప్రాధాన్యం ఇచ్చే కథలు, అందులో కామెడీ ఎమోషన్ సెంటిమెంట్ మేళవింపుతో ఆయన ఎంచుకునే స్క్రిప్ట్స్ నిర్మాతలకు నమ్మకం కలిగిస్తున్నాయం టున్నారు. కిరణ్‌తో సినిమా చేస్తే మినిమమ్ గ్యారెంటీ‘ అన్న భావన కొందరు నిర్మాతల్లో ఏర్పడిందని ఇండస్ట్రీ టాక్. దీంతో ఆయనకు భారీ ఆఫర్లు వస్తున్నాయని ప్రచారం. తాజా సమాచారం ప్రకారం, కిరణ్ అబ్బవరం ప్రస్తుతం ఒక్కో సినిమాకు దాదాపు రూ.12 కోట్ల వరకు రెమ్యునరేషన్ అందుకుంటున్నారట. ఇటీవల ఓ ప్రముఖ నిర్మాణ సంస్థతో కుదిరిన ఒప్పందంలో కూడా ఇదే స్థాయిలో పారితోషికం తీసుకున్నారని టాక్ వినిపిస్తోంది. అయితే ఈ విషయంపై అధికారికంగా ఎలాంటి ప్రకటన వెలువడలేదు. 'కె ర్యాంప్' తర్వాత కిరణ్ అబ్బవరం మరో రిఫ్రెషింగ్ లవ్ స్టోరీతో ప్రేక్షకుల ముందుకు రానున్నారు. ప్రస్తుతం ఆయన 'చెన్నై లవ్ స్టోరీ' చిత్రంలో నటిస్తున్నారు.

ÔáPrinted, Published & Owned by B. Srinivas, Printed at Sree Seshasai EnterprisesPlot no. 98/1, Co-operative Industrial Estate,Gandhi Nagar, near Balanagar Medchel -Malkajgiri Dist.Hyderabad 500037 (T.S).
Published at Plot S11, 3rd Floor, Ballard estate Margadarshi building Tarnaka Secundrabad, Hyderabad 500 007 (T.S), Editor : B. Srinivas, PRGI.REGN.NO. APTEL /2003/11288, Gmail: ninadamnews@gmail.com, CELL : +91 8333068787